Pubilshed from Eluru

PRGI NO : APTEL/25/A1219

ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు

Prajabhoomi Telugu Daily

www.prajabhoomi.com



ఏలూరు ELURU | సంపుటి : 03 | సంచిక : 07 | శనివారం | నవంబర్ 7, 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి | పేజీలు : 12 | వెల : 3 రూ

Vol.No : 03 | Issue No : 07 | Saturday | 7 November 2026 | Editor : Ankireddypalle Ramamohan Reddy | Pages 12 | Rs 3/-

Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana

తానొక రైతుగా..

పొలం గట్లపైనా, పంట బోదెల మీద సీఎం

- రైతు కష్టం తెలిసిన నాయకుడిగా..ప్రతి అడుగులో భరోసా
- తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన
- అటు సమీక్షలు.. ఇటు పర్యటనలతో గట్టెక్కిస్తున్న సీఎం



ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి :

సచివాలయంలో సమీక్షలే కాదు పొలం గట్లపైకి, పంట బోదెల మీద తిరుగుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు తుఫాను నష్టాన్ని స్వయంగా చూసి తెలుసుకున్నారు. రైతన్న కష్టానికి కదిలి.. పొలం గట్లపైకి ముఖ్యమంత్రి వెళ్లారు. తుఫాను వల్ల నష్ట పోయిన అన్నదాతకు అండగా నిలిచేలా రాత్రిళ్లు సైతం సమీక్షలు నిర్వహించారు. క్షేత్రస్థాయిలో పర్యటించారు. తుఫాను వల్ల కురిసిన భారీ వర్షాలకు పంటలు నీట మునిగిన రైతుల కష్టాన్ని కళ్లారా చూసేందుకు ధ్వంసమైన రహదారుల్లోనూ, ముంపు ప్రాంతాల్లోనూ పర్యటించారు. అక్టోబరు 27 తేదీ నుంచి నిరంతరాయంగా ప్రజల్ని నిరంతరం అప్రమత్తం చేస్తూ.. క్షేత్రస్థాయిలో రైతుల కష్టాల్ని తెలుసుకుంటూ ముంపు ప్రాంతాల ప్రజలకు అండగా నిలిచారు. యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేలా పర్యవేక్షణతో పాటు నేల కొరిగిన చెట్లను తక్షణమే తొలగించేలా యంత్రాంగాన్ని నడిపించి సంక్షోభ నివారణలో ఆయనకు ఆయనే సాటి అనిపించుకున్నారు.



నెలల తరబడి కష్టపడి, అప్పులు చేసి, ఆశలతో సాగు చేసిన పంట నష్ట పోతే అన్నదాతకు ఎంత కష్టమో రైతుకే తెలుసు. అలాంటి కష్ట కాలంలో రైతుకు ధైర్యం చెప్పేందుకు, వారి కన్నీళ్లు తుడిచేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా పొలం గట్లపైకి నడిచారు. నీట మునిగిన చేల మధ్యకు వెళ్లారు. పంట బోదెల వద్ద నిలబడి పంట నష్టాన్ని పరిశీలించారు. రైతుల పక్కన నిలబడి వారి కష్టాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అండగా ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు.

తుఫాను నష్టం ఎక్కడుంటే..అక్కడికి


సీఎం : అర్నబ్ తుఫాను సమయంలో కోనసీమ జిల్లాలోని కాట్రేనికోన నుంచి పశ్చిమగోదావరి జిల్లాలోని మొగల్తూరు, నరసాపురం వరకు ముఖ్యమంత్రి పర్యటించారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకున్నారు. తాజాగా మురసు తుఫాను ప్రభావిత ప్రాంతాల్లోనూ పర్యటించారు. బాపట్ల జిల్లాలోని జిల్లెళ్లమూడి, గుంటూరు జిల్లాలోని రేటూరులో నీట మునిగిన వరి పొలాల వద్దకు వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. పొలం గట్లపై నడుస్తూ, పంట బోదెలను చూస్తూ రైతుల ఆవేదనను ఆలకించారు.

2 పేజీలో..

నేపాల్‌లో స్వల్ప భూకంపం


ఖాట్మాండు : నేపాల్‌లో స్వల్ప భూకంపం సంభవించింది. ఖాట్మాండుకు వాయవ్య దిశగా సుమారు 700 కిలోమీటర్ల దూరంలో ఉన్న కర్ణాలి ప్రావిన్స్‌లోని హుమ్లా జిల్లాలో శుక్రవారం ఉదయం 7.10 గంటలకు భూమి కంపించిందని జాతీయ భూకంప పర్యవేక్షణ, పరిశోధన సంస్థ తెలిపింది.

2 పేజీలో..



కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు సీఎం చంద్రబాబు లేఖ

- వారం వ్యవధిలోనే రెండు తుఫాన్లతో తీవ్రంగా నష్టపోయామని వెల్లడి
- తుఫాను నష్టం నుంచి ఉపశమనం కోసం తక్షణ సాయం అందించాలని విజ్ఞప్తి



ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి:

వరుస తుఫాన్లతో ఆంధ్రప్రదేశ్‌కు భారీ నష్టం వాటిల్లిందని, మురసు తుఫాన్ కారణంగా ప్రాథమికంగా రూ.1,919.59 కోట్ల మేర నష్టం వాటిల్లిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వానికి వివరించారు. తుఫాను నష్టం నుంచి ఉపశమనం కోసం తక్షణం మధ్యంతర ఆర్థిక సాయం అందించాలని కోరారు. ఈ మేరకు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాకు సీఎం చంద్రబాబు లేఖ రాశారు. వారం రోజుల వ్యవధిలోనే రెండు వరుస తుఫాన్ల కారణంగా ఏపీపై తీవ్ర ప్రభావం పడిందని సీఎం పేర్కొన్నారు. భారీ వర్షాలు, తీవ్ర గాలుల కారణంగా విద్యుత్, రహదారుల లాంటి మౌలిక సదుపాయాలు ధ్వంసం అయ్యాయని వివరించారు. అక్టోబరు 27 తేదీన అర్నబ్ తుఫాను వల్ల జరిగిన నష్టం నుంచి రాష్ట్రం కోలుకుంటున్న సమయంలోనే మురసు తుఫాన్ విరుచుకు పడటంతో రైతులు, మత్స్యకారులు ఒకే సీజన్‌లో రెండుసార్లు నష్టపోయారని తెలిపారు. వరద నీరు తగ్గిన తర్వాత నష్టాలపై పూర్తిస్థాయి అంచనాలు నిర్వహించి మరో 15 రోజుల్లో సమగ్ర నివేదికను కేంద్రానికి సమర్పిస్తామని ముఖ్యమంత్రి లేఖలో పేర్కొన్నారు.

2 పేజీలో..

అమెరికా మార్కెట్లలో భారీ పతనం..

అమెరికా : అమెరికా మధ్యంతర ఎన్నికల ఫలితాల తర్వాత భారీగా లాభపడిన వాల్‌స్ట్రీట్ మార్కెట్లు మరుసటి రోజే తీవ్ర నష్టాలను చవిచూశాయి. మదుపర్లు పెద్ద ఎత్తున అమ్మకాలకు దిగడంతో 19 నెలల్లో ఎన్నడూ లేనంతగా ప్రధాన సూచీలు పడిపోయాయి. నాస్‌డాక్ 5.52 శాతం, ఎస్‌అండ్‌పీ 4.36 శాతం, డోజోన్స్ 3.4 శాతం చొప్పున నష్టపోయాయి.

2 పేజీలో..



ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు విస్తృత ఏర్పాట్లు

నవంబర్ 7న ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు

- 19,885 మంది పోలీసులతో మూడు అంచెల భద్రత
- సున్నిత ప్రాంతాల్లో సీసీటీవీలు, డ్రోన్లు, బాడీ వోర్న్ కెమెరాలతో నిఘా



ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ :

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ రెండవ సాధారణ ఎన్నికల ఓట్ల లెక్కింపు 07.11.2026న ఉదయం 8.00 గంటలకు ప్రారంభం కానుందని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 365 లెక్కింపు కేంద్రాల్లో సుమారు 9,062 లెక్కింపు బల్లలపై ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహిం చనున్నారని పేర్కొన్నారు. ఇందుకోసం 11,002 మంది లెక్కింపు పర్యవేక్షకులు, 28,692 మంది లెక్కింపు సహాయకులు, ఇతర సిబ్బందిని నియమించారని ఎన్నికల కమిషనర్ పునేఠా తెలిపారు.

2 లో



రైతన్నకు అండగా...

- పొలం గట్లు, పంట బోదెలపై వెళ్తూ దెబ్బతిన్న పంటల పరిశీలన
- జిల్లెళ్లమూడి నుంచి రేటూరు వరకు కాలినడకన బాధిత రైతులతో మాట్లాడిన సీఎం
- పట్టిసీమ వరమచ్చినా... ప్రకృతి కరుణించలేదని రైతుల ఆవేదన
- చివరి బాధితునికి సైతం సాయం అందే వరకు పని చేస్తామని సీఎం హామీ
- పంటల బీమానే రైతులకు శ్రీరామ రక్ష : ముఖ్యమంత్రి చంద్రబాబు



ప్రజాభూమి ప్రతినిధి,గుంటూరు/బాపట్ల: మురసు తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న పంటలను, వరద నీటితో మునిగిన పాలాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. శుక్రవారం బాపట్ల జిల్లాలోని తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన ఆయన.. జిల్లెళ్లమూడి నుంచి రేటూరు వరకు నడుచుకుంటూ వెళ్లి రైతుల కష్టాలను స్వయంగా తెలుసుకున్నారు. జిల్లెళ్లమూడి వంతెన వద్ద వరద ప్రవాహాన్ని పరిశీలించిన అనంతరం అక్కడి నుంచి రేటూరు గ్రామం వరకు కాలినడకన సాగిన ముఖ్యమంత్రి.. దారిపొడవునా రైతులు, అధికారులు, ప్రజాప్రతినిధులతో మాట్లాడుతూ తుఫాన్ కారణంగా జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. మధ్యమధ్యలో పాలాల వద్ద ఆగుతూ రైతులతో ముఖాముఖి మాట్లాడారు. పంట కాలువ గట్లు, పంట బోదెలపై నడుచుకుంటూ వెళ్లి నీట మునిగిన వరి పాలాలను పరిశీలించారు. రైతులు పెట్టిన పెట్టుబడులు, పంట దిగుబడి అంచనాలు, నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు.

జిల్లెళ్లమూడి వంతెన వద్ద వరద ప్రవాహ ఉద్ధృతిని పరిశీలించిన ముఖ్యమంత్రికి వాగు ఉధృతి కారణంగా చుట్టుపక్కల ప్రాంతాలు నీట మునిగిన తీరును రైతులు, అధికారులు వివరించారు. జిల్లెళ్లమూడి నుంచి రేటూరు వెళ్లే మార్గంలో పలు చోట్ల కోతకు గురైన రహదారిని పరిశీలించారు. నల్లమడ వాగు గేట్లు దెబ్బతిన్నాయని, వాటి కారణంగా నీటి నిర్వహణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన సీఎం దెబ్బతిన్న గేట్లకు మరమ్మతులు చేయించాలని, అవసరమైతే కొత్త గేట్లు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. నల్లమడ డ్రైయిన్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు. పంట పొలాల్లోకి వరద నీరు

2 పేజీలో..

నేటి నుంచి మూడ్రోజుల పర్యటన

- సీఎం రేవంత్ రెడ్డి మూడు రోజుల కొడంగల్ పర్యటన ఖరారు
- సుమారు రూ.9100 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం
- రైతు మేళా, పరిశ్రమలు, విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి
- వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వ భవనాలు, పోలీస్ స్టేషన్ల ప్రారంభోత్సవాలు
- పర్యటన ముగింపులో భారీ రైతు బహిరంగ సభ ఏర్పాటు

వివరాలు 2లో..



కొడంగల్ అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి మెగా ప్లాన్..

ప్రజాభూమి ప్రతినిధి,తెలంగాణ : తన సొంత నియోజకవర్గమైన కొడంగల్ అభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించారు. నియోజకవర్గ రూపురేఖలను మార్చే లక్ష్యంతో సుమారు రూ.9,100 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టేందుకు సిద్ధమయ్యారు.

ప్రజాభూమి

శనివారం, నవంబర్ 7, 2026

సంపాదకీయం

హక్కుల దొంగలకు
శిక్ష ఖాయం!



ఇది ఏ ఒక్క రాజకీయ పార్టీ గొంతుకో కాదు. కేవలం రాజకీయ నేతల గొంతు కూడా కాదు. ఇది ఈ దేశంలోని యువత గొంతు. రైతుల గొంతు. కష్టజీవుల గొంతు. మొత్తానికి మొత్తంగా ఇది ఈ దేశ ప్రజల గొంతు. ఈ దేశ రాజ్యాంగానికి దెబ్బ తగలకుండా కాపాడుకునేందుకు ముందుకొచ్చిన ఈ దేశ పౌరుల గొంతు. కేంద్రంలోనే కాదు, ప్రతి రాష్ట్రంలోనూ ఓట్ చోరీ జరిగింది. అన్ని సాక్ష్యాలూ, అన్ని ఆధారాలూ ముందుకొచ్చాయి. కొంత కాలంగా దేశంలోని మేధావులంతా వాటిని ప్రజలకు వివరిస్తూనే ఉన్నారు. బాధ్యత గల ప్రభుత్వం ఎప్పటికప్పుడు, ఎక్కడికక్కడ వివరణలు ఇవ్వాలి కదా? ఇవ్వలేదు. జవాబుదారీతనం లేని ప్రభుత్వం అవసరమా? ఆ పనిలో భాగంగానే ఊహించని రీతిలో ఈ దేశ పౌరులు నవంబర్ 1న ఢిల్లీ-రామ్‌లీలా మైదాన్‌లో గుమిగూడారు. తమ హక్కులను దొంగిలించిన ప్రభుత్వం మీద విరుచుకుపడ్డారు. 2024 ఎన్నికల తర్వాత దేశంలోని 13.5 కోట్ల మంది ఓట్లు మాయం చేసింది ఈ ఆర్.ఎస్.ఎస్, బిజెపి ప్రభుత్వం! అంటే, ఈ దేశ జనాభాలో 15 శాతం మంది ఓటు హక్కు కోల్పోయారు. ప్రజలు నాయకులను ఎన్నుకోవడం చూశాం. కాని, ఇక్కడ నాయకులు ప్రజలను ఎన్నుకుంటున్నారు. ఇది ఎప్పుడూ, ఎక్కడా లేని విచిత్రమైన పరిస్థితి. ఈ నరేంద్ర మోడీ ప్రభుత్వం 'ఓట్ చోరీ' చేసి, దొంగతనంగా అధికారాన్ని ఆక్రమించింది. విషయాలన్నీ సామాన్య ప్రజలకు అర్థమయ్యాయి. అందుకే న్యాయం కావాలంటున్నారు. అక్రమ మార్గంలో ఎన్నికలు జరిపించిన జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయడమే కాదు, జైలుకు కూడా వెళ్లాల్సి వుంటుంది. జ్ఞానేష్ కుమార్‌ను ఉపయోగించుకుని అధికారం దక్కించుకున్న మోడీ, అమిత్ షా, వారి మంత్రి వర్గంలోని వారంతా దోషులే. ఎవరూ తప్పించుకుని పోలేరు. చేసిన దుర్మార్గాలకు శిక్షలు అనుభవించాల్సిందే! ఇది మామూలు దొంగతనం కాదు, పౌరుల ప్రాథమిక హక్కులను దొంగిలించడం. భావ ప్రకటనా స్వేచ్ఛను దొంగిలించడం. పౌరులు సజీవంగా వున్నారు. కానీ, ఓట్ చోరీ వల్ల వారంతా చనిపోయిన వాళ్ల కిందే లెక్క! ఓటు హక్కు లాగేయడమంటే మాటలు కాదు. సజీవంగా ఉంచుతూనే హత్య చేయడం. ఇది కూడా ఒకరకంగా గుజరాత్, మణిపూర్ మారణకాండ లాంటిదే- ఈ హత్యలకు పాల్పడింది మోడీ, అమిత్ షా, జ్ఞానేష్ కుమార్. వీరిని మించిన దేశద్రోహులు మరెవ్వరూ లేరు. విద్యా రంగం, వైద్య రంగం, సిబిఐ, ఇ.డి, న్యాయ వ్యవస్థ, పోలీసు యంత్రాంగం, అధికార గణం - ఇవన్నీ ఎవరివీ? ఈ దేశ పౌరులవి ! ఎవరి కోసం పని చేయాలీ? ఈ దేశ ప్రజల కోసం పని చేయాలి! కానీ, ఇవన్నీ అధికారంలో ఉన్న ఒకరిద్దరి స్వార్థ ప్రయోజనాల కోసం పనిచేస్తున్నాయి. ఈ వ్యవస్థలన్నీ భవిష్యత్ తరాలవారివి. యువతకు వీటి మీద అధికారం ఉంది. కానీ, ఈ వ్యవస్థలన్నీ ఏం చేస్తున్నాయి? అన్యాయంగా వారిని అణచివేస్తున్నాయి. వ్యవసాయ రంగానికి న్యాయం జరగడం లేదు. యువతకు ఉపాధి లేదు. విద్యా రంగాన్ని భ్రష్టు పట్టించారు. కనీసం రోజుకూలీల శ్రమకు తగిన ఫలితం దక్కడం లేదు. మరి డబ్బంతా ఎటుపోతోంది? అదానీ, అంబానీలకు పోతోంది. విద్యుత్ వ్యవస్థ అదానీది, మొబైల్ అదానీది, డ్రోన్ అదానీది, ఆయుధం అదానీది. మొత్తానికి మొత్తం దేశమంతా అదానీదేనా? వారికి వేల వేల కోట్ల రుణ మాఫీ లభిస్తోంది. సామాన్యులు మాత్రం నరకయాతన పడాల్సి వస్తోంది. నిరంతరం కష్టించి పనిచేస్తున్న రైతుకు శ్రమ ఫలితం దక్కనవసరం లేదా? రోజూ పద్దెనిమిది గంటలు కష్టపడి చదువుకుంటున్న విద్యార్థికి ఇంత జ్ఞానం సంపాదించుకునే అవకాశం అక్కరలేదా? ఈ పరిస్థితిని మార్చుకోవడానికి మనమంతా అప్రమత్తతతో ఉండాలి. ప్రభుత్వ దుష్ట ప్రయత్నాలను అడ్డుకుంటూ ఉండాలి. ఈ దేశాన్ని మళ్ళీ గాడిలో పెట్టాలి. అది జ్ఞానేష్ కుమార్ రాజీనామాతో ప్రారంభం కావాలి! "నరేంద్ర మోడీ ఎక్కడికీ పోవడం లేదు కదా?" అని అమిత్ షా ప్రతిపక్షాల్ని ఎద్దేవా చేస్తూ మాట్లాడారు. అతను ఒకటి గుర్తు పెట్టుకోవాలి. ప్రతిపక్షాలు కూడా ఎక్కడికీ పోవడం లేదు. ఈ దేశ ప్రజలూ ఎక్కడికి పోవడం లేదు. ప్రస్తుత పరిస్థితుల నుండి తప్పించుకోవడానికి మోడీ-షాలు ఎట్లైనా పారిపోవాలని ప్రయత్నించినా లాభం లేదు. ఈ దేశ ప్రజలు కాపలా కాస్తున్నారు. ప్రతిపక్షాలు కాపలా కాస్తున్నాయి. యువత అంతా కాపలా కాస్తోంది. వీరు చేస్తూ వచ్చిన అరాచకాలకు ఈ దేశంలోనే శిక్ష అనుభవించక తప్పదు. తప్పదు- దేశాన్ని కార్పొరేట్లకు అమ్మిన నేరానికి, ఓట్ చోరీకి శిక్ష తప్పదు.

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు విస్తృత ఏర్పాట్లు

ఈ ఎన్నికల్లో 77 జడ్పీటీసీ లు, 2,051 ఎంపీటీసీలు ఏకగ్రీవం కాగా, మిగిలిన 577స్థానాలు, 7,707 వీూజలకు 05.11.2026న పోలింగ్ నిర్వహించారని, మొత్తం పోలింగ్ శాతం 70.72గా నమోదైందని ఆయన తెలిపారు. గత 2021 ఎన్నికల పోలింగ్ శాతం 60.91తో పోలిస్తే 9.81 శాతం పెరుగుదల నమోదైందని వెల్లడించారు. బూత్ క్యాప్చరింగ్, బ్యాలెట్ పెట్టెల ధ్వంసం వంటి ఘటనల నేపథ్యంలో అనంతపురం, కర్నూలు, శ్రీకాకుళం, మార్కాపురం, పల్నాడు జిల్లాల్లోని ఏడు పోలింగ్ కేంద్రాల్లో 06.11.2026న రీపోలింగ్ నిర్వహించేందుకు ఆదేశించామని ఈ మేరకు ఆయా జిల్లాల్లో పోలింగ్ ప్రక్రియ కూడా సజావుగా ముగిసిందని తెలిపారు. ఓట్ల లెక్కింపులో తొలుత పోస్టల్ బ్యాలెట్లను, అనంతరం బ్యాలెట్ పెట్టెల్లోని ఎంపీటీసీ, జడ్పీటీసీ బ్యాలెట్ పత్రాలను లెక్కిస్తారని తెలిపారు. మొత్తం లెక్కింపు బల్లల్లో 50 శాతంస్థానాలకు, మిగిలిన 50 శాతం ఎంపీటీసీలకు కేటాయించారని, ప్రతి బల్లకు ఒక్కో రౌండ్‌లో 1,000 బ్యాలెట్ పత్రాలను లెక్కింపు కోసం అందజేస్తారని ఆయన పేర్కొన్నారు. లెక్కింపు ప్రక్రియ పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని కేంద్రాల్లో పటిష్టమైన పోలీసు భద్రత, సీసీటీవీ నిఘా ఏర్పాటు చేశామని, ఓట్ల లెక్కింపు సజావుగా జరిగేలా అన్ని అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసిమని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేతా తెలిపారు.

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల కౌంటింగ్‌కు భారీ పోలీసు



బందోబస్తు.. రాష్ట్ర పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా నవంబర్ 5వ తేదీన నిర్వహించిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి రేపు జరగనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం ఐజీ బి. రాజకుమారి వెల్లడించారు. కౌంటింగ్ ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా రాష్ట్రవ్యాప్తంగా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. అంతేకాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేసిన మొత్తం 365 కౌంటింగ్ కేంద్రాల్లో 19,885 మంది పోలీసు సిబ్బందితో మూడు అంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మొత్తం 19,885 మంది పోలీసులతో కౌంటింగ్ కేంద్రాలు, పరిసర ప్రాంతాల్లో మూడు అంచెల భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నట్లు ఐజీ తెలిపారు. అదేవిధంగా సున్నితమైన

బందోబస్తు విధుల్లో భాగంగా :

■ డీఎస్పీలు, అడిషనల్ ఎస్పీలు	- 135 మంది
■ ఇన్‌స్పెక్టర్లు	- 572 మంది
■ సబ్‌ఇన్‌స్పెక్టర్లు	- 1,412 మంది
■ అడిషనల్ సబ్‌ఇన్‌స్పెక్టర్ల నుంచి పోలీసు కానిస్టేబుళ్ల వరకు	- 14,877 మంది
■ హోమ్ గార్డ్‌లు	- 2889 మంది

ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా సీసీటీవీ కెమెరాలు, డ్రోన్ సర్వెలెన్స్‌తో పాటు పోలీసు సిబ్బంది ధరించే బాడీ వోర్న్ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ చేపట్టనున్నట్లు తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద భద్రతను నిరంతరం పర్యవేక్షిస్తూ, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా అవసరమైన అన్ని ముందస్తు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసు శాఖ అన్ని విధాలా సిద్ధంగా ఉందని, ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు పోలీసులకు సహకరించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఐజీ బి. రాజకుమారి కోరారు.

రైతన్నకు అండగా...

చేరకుండా నియంత్రించడంతోపాటు, వరద వచ్చినప్పుడు వచ్చే నీటిని సద్వినియోగం చేసుకునేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సూచించారు.

రైతులు పడిన కష్టానికి ఫలితం దక్కేలా పని చేస్తున్నాం

రేటూరు గ్రామంలో నడుచుకుంటూ వెళ్లిన ముఖ్యమంత్రి... వరద నీటిలో మునిగిపోయిన వరి చేలను పరిశీలించారు. పొలం గట్లపై నడుస్తూనే రైతులతో మాట్లాడి వారి కష్టాలను తెలుసుకున్నారు. పట్టిసీమ ద్వారా సాగునీరు అందడంతో పంటలు సాగు చేశామని, మంచి దిగుబడి వస్తుందని ఆశించిన సమయంలో తుఫాన్ వచ్చి తీవ్రంగా నష్టపరిచిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పంటల కోసం ఎంత పెట్టుబడి పెట్టారు? పంటల బీమా చేయించుకున్నారా? అనే విషయాలను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి విపత్తుల సమయంలో పంటల బీమా, ప్రభుత్వ ఇన్‌పుట్ సబ్సిడీ రైతులకు అండగా నిలుస్తాయని వివరించారు. పంటల బీమాపై రైతుల్లో మరింత అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. తుఫాన్ల ముప్పు తగ్గేలా సాధారణ సాగు సీజన్ కంటే ముందుగానే నీరు అందించి పంటలు వేసుకునేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని చెప్పారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే ముందస్తు సాగుకు మరింత అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. రేటూరులో రైతులు, ప్రజలను ఉద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. అర్నబ్, మురసు తుఫాన్ల వల్ల రాష్ట్రానికి పెద్ద ఎత్తున నష్టం వాటిల్లిందన్నారు. పంట చేతికొచ్చే సమయంలో తుఫాన్లు రైతులను తీవ్రంగా దెబ్బతీశాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్‌నినో ప్రభావంతో ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు పట్టిసీమ ద్వారా సాగునీరు అందించడంతో పంటలు సాగు చేశారని, మంచి దిగుబడులు వచ్చే సమయంలో మురసు తుఫాన్ నష్టాన్ని మిగిల్చిందని చెప్పారు. ప్రభుత్వం ముందస్తుగా తీసుకున్న చర్యల వల్ల నష్టాన్ని చాలావరకు నివారించగలిగామని తెలిపారు. గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాలపై మురసు తుఫాన్ తీవ్ర ప్రభావం చూపిందన్నారు. తుఫాన్లపై ముందస్తు హెచ్చరికలు వచ్చినప్పుడు ప్రజలు వాటిని తేలిగ్గా తీసుకోవద్దని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ముందస్తు చర్యలతో నష్ట నివారణ..వేగంగా పునరుద్ధరణ

తుఫాన్ల కారణంగా జరిగిన నష్టాన్ని పూర్తి స్థాయిలో అంచనా వేస్తున్నామని, చివరి బాధితుడికి సాయం అందే వరకు ప్రభుత్వం పనిచేస్తుందని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ ద్వారా రైతులకు నష్టపోయిన పెట్టుబడిలో కొంత మేర ఉపశమనం కలుగుతుందని చెప్పారు. రైతుల పంట నష్టం అంచనాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నామని తెలిపారు. రైతులకు అవసరమైన సమాచారం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని... రైతులకు ఫోన్ల ద్వారా సమాచారం అందుతోందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. సాగునీటి సంఘాల ప్రతినిధులతోనూ మాట్లాడి కాలువలు, తూముల్లో పేరుకుపోయిన కంప, ఇతర అడ్డంకులను తొలగిస్తున్నారా అని ఆరా తీశారు. నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అర్నబ్ తుఫాన్ కారణంగా నేలకొరిగిన 30 వేల విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించామని, మురసు తుఫాన్ వల్ల మరో 10 వేల స్తంభాలు దెబ్బతిన్నాయని ముఖ్యమంత్రి తెలిపారు. ఆక్వా చెరువులకు విద్యుత్ సరఫరాను కూడా త్వరితగతిన పునరుద్ధరిస్తున్నామని చెప్పారు. తుఫాన్ సహాయక చర్యల కోసం తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి కూడా సహకారం తీసుకుంటున్నామని వెల్లడించారు. తుఫాన్ల ప్రభావంపై కేంద్ర ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు సమాచారం అందించామని, ప్రధాని నరేంద్ర మోదీ కూడా పరిస్థితిని అడిగి తెలుసుకున్నారని చెప్పారు.

ఓ పక్క తుఫాన్లు...మరో పక్క ఎల్ నినో

రాష్ట్రంలోని తీర ప్రాంతాలను వరుస తుఫాన్లు ఇబ్బందులకు గురిచేస్తుంటే, రాయలసీమ ప్రాంతం ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులను ఎదుర్కొంటోందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాయలసీమలో కరువు పరిస్థితులను అధ్యయనం చేసేందుకు కేంద్ర బృందాలు కూడా పర్యటించాయని తెలిపారు. ఒకవైపు తీర ప్రాంతాల్లో నీరు వృథాగా సముద్రంలో కలుస్తుంటే, మరోవైపు



రాయలసీమలో నీటి కొరత నెలకొంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితులను అధిగమించేందుకు నీటి భద్రత, సమర్థ నీటి నిర్వహణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. వరద నీటిని సమర్థంగా వినియోగించుకునేలా ప్రణాళికలు రూపొందిస్తామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో పెద్ద ఎత్తున విధ్వంసం జరిగిందని ముఖ్యమంత్రి విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో తుఫాన్లు వచ్చినప్పుడు రెడ్ కార్పెట్ వేసుకుని పంటలను పరిశీలించి, పరామర్శించేవారన్నారు. తాము స్థానిక సంస్థల ఎన్నికల కంటే ప్రజా సమస్యలకే ప్రాధాన్యత ఇచ్చి తుఫాన్ సమయంలో సహాయక చర్యలను వేగవంతం చేశామని తెలిపారు. ఎన్నికల సమయంలోనే రెండు తుఫాన్లు వచ్చాయని... అయినా ఎన్నికలపై దృష్టి పెట్టకుండా...ప్రజలకు ఇబ్బందులు పరిష్కరించేందుకే ప్రాధాన్యత ఇచ్చామని... నిరంతరం పర్యవేక్షిస్తూనే ఉన్నామని ముఖ్యమంత్రి చెప్పారు. కొందరు ప్రభుత్వాన్ని ఇబ్బందులకు గురిచేయడమే పనిగా పెట్టుకున్నారని, పరిషత్ ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత అన్ని అంశాలపై మాట్లాడతానని చెప్పారు. అంతకుముందు జిల్లెళ్లమూడి గ్రామానికి చేరుకున్న ముఖ్యమంత్రిని అమ్మ భక్తులు కలిశారు. వారు గ్రామంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను ముఖ్యమంత్రి అభినందించారు. అలాగే అమరావతి నుంచి ఏరియల్ సర్వే చేసుకుంటూ సీఎం చంద్రబాబు సూర్యలంక ఎయిర్ ఫోర్స్ స్టేషన్‌కు చేరుకున్నారు. ఈ పర్యటనలో మంత్రి కొలుసు పార్థసారథి, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, వేగేశ్న నరేంద్ర వర్మ, ఏలూరి సాంబశివరావు, రెండు జిల్లా కలెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.



తానొక రైతుగా...

అధికారుల నివేదికలకే పరిమితం కాకుండా.. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితిని స్వయంగా తెలుసుకున్నారు. పంట నష్టాన్ని చూసి రైతులు పడుతున్న ఆవేదనను ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా తెలుసుకున్నారు. ఎన్ని ఎకరాల్లో పంట దెబ్బతింది.. ఎంత నష్టం వాటిల్లింది. రైతులకు తక్షణం అందించాల్సిన సాయం తదితర అంశాలను వారినే అడిగి తెలుసుకున్నారు. కష్టపడి పండించిన పంటను కోల్పోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రకృతి విపత్తు రైతును కుంగదీయకుండా, తిరిగి వ్యవసాయం చేసుకునేలా సహకారం అందించాలన్న దిశగా అధికారులకు సూచనలు చేశారు.

రైతులు, ప్రజల కోసం రాత్రి పగలు అప్రమత్తం : తుఫాను తీరం దాటిన తర్వాతే కాదు.. ముప్పు పొంచి ఉందని తెలిసినప్పటి నుంచే ముఖ్యమంత్రి అప్రమత్తమయ్యారు. అక్టోబరు 27 నుంచే ఆర్నబ్ తుఫాను ప్రభావంపై వరుస సమీక్షలు నిర్వహించారు. ముందస్తు హెచ్చరికలు జారీ చేయించి, అధికార యంత్రాంగాన్ని సిద్ధం చేశారు. మురసు తుఫాను సమయంలోనూ రాత్రిళ్లు సైతం మేల్కొని టెలి కాన్ఫరెన్సుల ద్వారా కలెక్టర్లు, ఉన్నతాధికారులను అప్రమత్తం చేశారు. వాతావరణ పరిస్థితులు, వర్షాల తీవ్రత, ముంపు ప్రాంతాలు, ప్రజల తరలింపు, సహాయక చర్యలపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించారు. విపత్తు సమయంలో రాష్ట్ర యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడమే కాకుండా కేంద్ర ప్రభుత్వంతోనూ నిరంతరం సంప్రదింపులు జరిపారు. నష్ట తీవ్రతను అంచనా వేయడం, బాధితులకు సాయం అందించడం, పునరుద్ధరణ చర్యలను వేగవంతం చేయడంపై దృష్టి సారించారు. ఒకవైపు ఉన్నతాధికారులతో సమీక్షలు..మరో వైపు క్షేత్రస్థాయి పర్యటనలు.. ఇంకోవైపు ప్రజలను అప్రమత్తం చేస్తూ విపత్తు నిర్వహణను సమన్వయంతో ముఖ్యమంత్రి ముందుకు అడుగు వేశారు.

కొడంగల్ అభివృద్ధికి
సీఎం రేవంత్ రెడ్డి మెగా ప్లాన్..

ఇందులో భాగంగా నవంబర్ 7, 8, 9 తేదీల్లో ఆయన కొడంగల్‌లో కీలక పర్యటన చేపట్టనున్నారు. ఈ మూడు రోజుల పర్యటనలో భాగంగా భారీ ఎత్తున శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. వ్యవసాయం, పరిశ్రమలు, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా ముఖ్యమంత్రి పర్యటన షెడ్యూల్‌ను అధికారులు ఖరారు చేశారు. ఈ పర్యటనలో భాగంగా రెండు రాత్రులు ఆయన కొడంగల్‌లోనే బస చేయనున్నారు.

నేపాల్‌లో స్వల్ప భూకంపం

రిక్టర్‌స్కేలుపై భూకంప తీవ్రత 4.2గా నమోదైందని పేర్కొంది. పారుగున ఉన్న ముగు, భజహంగ్ జిల్లాల్లోనూ ప్రకంపనలు వచ్చాయని వెల్లడించింది. ఆస్తి, ప్రాణ నష్టానికి సంబంధించిన వివరాలు తెలియాల్సి వుంది.



కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు
సీఎం చంద్రబాబు లేఖ

తక్షణ సాయంతో రాష్ట్రానికి ఉపశమనం

మురసు తుఫాన్ కారణంగా వ్యవసాయ రంగంలో 1,43,122 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయని, 1,86,063 మంది రైతులు ప్రభావితం అయ్యారని ముఖ్యమంత్రి కేంద్ర హోం మంత్రికి రాసిన లేఖలో పేర్కొన్నారు. వ్యవసాయ రంగానికి రూ.874.96 కోట్ల నష్టం వాటిల్లిందని...ఉద్యాన పంటలు 6,504.38 హెక్టార్లలో దెబ్బతినగా, 12,178 మంది రైతులు నష్ట పోయారని తెలిపారు. ఈ రంగానికి రూ.337.10 కోట్ల నష్టం జరిగిందని వివరించారు. దీంతో పాటు పశుసంవర్ధక, ఆక్వా, గృహ నిర్మాణం, ఇరిగేషన్, విద్యుత్, పంచాయతీ రాజ్, విద్య, వైద్యారోగ్య శాఖల్లో తీవ్రంగా నష్టం వాటిల్లిందని కేంద్ర హోం మంత్రికి రాసిన లేఖలో తెలిపారు. ముందస్తు చర్యలు తీసుకోవడంతో కొంత మేర ఆస్తి నష్టాన్ని తగ్గించ గలిగామని వివరించారు. మురసు తుఫాన్ వల్ల నష్టపోయిన రైతులు, మత్స్యకారులు, గృహాలు దెబ్బతిన్న కుటుంబాలు, ఇతర బాధిత వర్గాలను ఆదుకోవడానికి, రాష్ట్రంలో దెబ్బతిన్న అత్యవసర మౌలిక సదుపాయాలు, సేవలను పునరుద్ధరించడానికి కేంద్ర హోం శాఖ తక్షణమే మధ్యంతర ఆర్థిక సాయం మంజూరు చేయాలని సీఎం చంద్రబాబు కోరారు. కేంద్రం నుంచి తక్షణ సహాయం అందితే బాధితులకు ఉపశమనం కల్పించడంతోపాటు రాష్ట్రంలో సాధారణ పరిస్థితులు నెలకొనేలా చర్యలు తీసుకోగలమని స్పష్టం చేశారు.



అమెరికా మార్కెట్లలో భారీ పతనం ..
ఒక్కరోజే కుప్పకూలిన సూచీలు



టెక్నాలజీ, కృత్రిమ మేధ (ఎఐ), సెమీకండక్టర్ రంగాల షేర్లలో భారీ అమ్మకాలు మార్కెట్ పతనానికి ప్రధాన కారణమయ్యాయి. ఈ రంగాల్లో కంపెనీల షేర్ల విలువ వాస్తవ స్థాయికి మించి పెరిగిందన్న ఆందోళనతో మదుపర్లు లాభాల స్వీకరణకు దిగారు. మరోవైపు ఎఐ డేటా సెంటర్ల విస్తరణపై డెమోక్రాట్లు ఆంక్షలు విధించే అవకాశం ఉందన్న అంచనాలు కూడా మార్కెట్‌పై ప్రభావం చూపాయి. మస్క్ కంపెనీలకు భారీ దెబ్బ .... ఎలాన్ మస్క్‌కు చెందిన టెస్లా, స్పేస్‌ఎక్స్ కంపెనీల మార్కెట్ విలువ కేవలం రెండు రోజుల్లోనే 420 బిలియన్ డాలర్లకు పైగా తగ్గింది. ఎన్నికల్లో మస్క్ మద్దతు ఇచ్చిన అభ్యర్థులు ఓడిపోవడం, ఆయన కంపెనీలపై విచారణలు, నిబంధనలు కఠినతరం కావచ్చన్న భయాలు ఇందుకు కారణమయ్యాయి. ప్రభుత్వ కాంట్రాక్టులు, ఎఐ ప్రాజెక్టులు, కంపెనీల విలీన ప్రయత్నాలపై ప్రతికూల ప్రభావం పడవచ్చని మదుపర్లు భావిస్తున్నారు. అమెరికా మార్కెట్ల పతనం ప్రభావం ఆసియా మార్కెట్లపైనా పడింది. జపాన్ నిక్కీ సూచీ 6 శాతానికి పైగా, దక్షిణ కొరియా కొస్పి 8 శాతం మేర నష్టపోయాయి.

ప్రజాభూమి
ఎన్టీఆర్, కృష్ణా
శనివారం, నవంబర్ 07, 2026

మచిలీపట్నం మేయర్ అబ్దుల్ అబీదకు బుల్లెట్ ధర్మారావు సన్మానం





మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి
మచిలీపట్నం నగర మేయర్‌గా ఎన్నికైన కూట మి అభ్యర్థి అబ్దుల్ అబీదను రాధా రంగా మిత్ర మండలి అధ్యక్షుడు, జనసేన పార్టీ నాయకుడు బుల్లెట్ ధర్మారావు ఆధ్వర్యంలో మహిళా కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. మేయర్ అబీదతో పాటు ఆమె భర్త, కార్పొరేటర్ డాక్టర్ హసీం బేగ్‌ను దుశ్శాలువాలతో సత్కరించి, స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పరస్పరం పూలమాలలు వేసుకొని అభినందనలు తెలియజేశారు.

మిత్రమండలి కృషి మరువలేనిది: మేయర్ అబీదఈ సందర్భంగా మేయర్ అబీద మాట్లా డుతూ, మచిలీపట్నంలో తమ విజయానికి బుల్లెట్ ధర్మారావు, రాధా రంగా మిత్రమండలి సభ్యులు, మహిళా కమిటీ సభ్యులు విశేషంగా కృషి చేశారని తెలిపారు. తమ విజయానికి సహకరించిన వారందరికీ జీవితాంతం రుణపడి ఉంటామని పేర్కొన్నారు.

ధర్మారావు సేవలు అభినందనీయం: డాక్టర్ హసీం బేగ్..కార్పొరేటర్ డాక్టర్ హసీం బేగ్ మాట్లాడుతూ, రాధా రంగా మిత్రమండలి అంటే బుల్లెట్ ధర్మా రావు గుర్తుకొస్తారని అన్నారు. ఎలాంటి ప్రతి ఫలం ఆశించకుండా సొంత ఖర్చు లతో మిత్ర మం డలిని ఎన్నో సంవత్సరాలుగా ముందుకు నడిపిస్తున్న ఆయన సేవలు అభినంద నీయమని కొనియాడారు. తమ గెలుపులో మిత్రమండలి సభ్యుల పాత్ర కీలకమని, వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటూ చేతనైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.

కులమతాలకు అతీతంగా కూటమి విజయానికి కృషి... బుల్లెట్ ధర్మారావు, మిత్రమండలి సభ్యు లు మాట్లాడుతూ, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు కులమతాలకు అతీతంగా కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేశామని పేర్కొన్నారు. కాపులు సమాజంలో పెద్దన్న పాత్ర పోషించాలన్న పిలుపుతో అన్ని వర్గాల అభ్యు న్నతిని ఆకాంక్షిస్తూ మేయర్ అబీదతో పాటు కూటమి కార్పొరేటర్ల గెలుపు కోసం శక్తివంచన లేకుండా పనిచేశామని తెలిపారు. తమ కృషికి ప్రజల మద్దతు తోడవడంతో కూటమికి మంచి విజయం లభించిందని అన్నారు.మచిలీపట్నం నగర అభివృద్ధికి మేయర్, కార్పొరేటర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరుతూ, అభివృద్ధి కార్యక్రమాల్లో రాధా రంగా మిత్రమండలి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో షేక్ సిరాజుద్దీన్, ఎల్ఐసీ రాంబాబు, మత్తి వెంకటేశ్వరరావు, పద్మనాభుని శేఖర్, వన్నెంరెడ్డి ప్రసాద్, బడుగు ఉమాదేవి, వేముల కుమారి, మోకా మల్లిక, కొక్కు ప్రభావతి, జూపూడి శాంతకుమారి, తోట విజయకుమారి, అమ్ముల కళ్యాణి, ముంగండ బాలకుమారి, ఎడ్ల అప్పాయమ్మ, టి.ఎస్.ఆర్. ఆంజనేయులు, వెన్న నాగఫణిరాజు, జరుగు వెంకట సుబ్బారావు, నిడదవోలు శ్రీనివాసరావు, మోగంటి బాలాజీ, వేమూరి సాయి పంతులు, బంగారపు కొట్టు మల్లి, రాతిపల్లి పండు, కొల్లు శ్రీనివాస్, అక్బర్, తుమ్మలపల్లి రాంబాబు, పుప్పాల భాను, బాడిగ రంగారావు, చలమలశెట్టి త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

మచిలీపట్నంలో వృద్ధ మహిళలపై వరుస దాడులు!

రక్షణ కల్పించాలని బాధిత కుటుంబం వేడుకోలు

మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి




కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని విశ్వబ్రా హ్మణ కాలనీలో వృద్ధ మహిళలపై వరుసగా దాడులు జరుగుతున్నాయన్న ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. కుటుంబ సభ్యు డైన రమేష్ తమపై దాడు లకు పాల్పడుతు న్నాడని బాధిత కుటుంబానికి చెందిన జయపార్వతి ఆరోపించారు. తమ కుటుం బానికి ప్రాణహాని ఉందని, తక్షణమే రక్షణ కల్పించాలని పోలీసులను వేడుకున్నారు. జయపార్వతి తెలిపిన వివరాల ప్రకారం.. రమేష్ తన తల్లి నాగేశ్వరమ్మతో పాటు మరో వృద్ధ మహిళపై తరచూ దాడులకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. తాజాగా తాను పనికి వెళ్లి ఇంటికి తిరిగి వచ్చేసరికి ఇద్దరు మహిళలు రక్తగాయాలతో పడి ఉండటాన్ని గమనించినట్లు తెలిపారు. వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అం దించి, వారిని మచిలీపట్నం ప్రభుత్వ ఆసుప త్రికి తరలించినట్లు చెప్పారు.ఈ ఘటనలో ఒక వృద్ధ మహిళకు నాలుగు కుట్లు పడగా, మరో మహిళ పరిస్థితి తీవ్రంగా ఉండటంతో విజయ వాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అం దించినట్లు కుటుంబ సభ్యులు వెల్లడిం చారు.



చికిత్స అనంతరం ఇంటికి తిరిగి వచ్చిన తర్వా త కూడా మరోసారి దాడి జరిగినట్లు జయపార్వతి ఆరోపించారు. రమే ష్ మద్యం సేవించి ఇంటికి వచ్చిన సమయంలో మరింత దాడికి పాల్పడుతున్నాడని, చిన్నచిన్న విషయాలకే తమను కొడుతు న్నాడని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఇంట్లో మహిళలు, పిల్లలను ఉంచుకోవాలంటేనే భయంగా ఉందని, తమకు ఏ క్షణంలోనైనా ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ ఘటనకు సంబంధించి విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో కేసు నమోదైనట్లు, చిలకల పూడి పోలీసు లకు కూడా సమాచారం అందించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తమకు తక్షణ రక్షణ కల్పిం చ డంతో పాటు, దాడులకు పాల్పడుతున్న వ్యక్తిపై విచారణ జరిపి చట్టపరమైన చర్య లు తీసుకోవాలని జయపార్వతి పోలీసులను కోరారు.వృద్ధ మహిళలపై దాడులు జరిగినట్లు వస్తున్న ఆరోపణలపై పోలీసులు సమగ్ర విచారణ జరిపి, బాధితులకు భద్రత కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. అయితే, ఈ ఆరోపణలపై పోలీసుల అధికారిక స్పందన తెలియాల్సి ఉంది.

చేనేత రంగానికి విశిష్టమైన సేవలు అందిస్తున్న వ్యక్తి నల్లి కుప్పుస్వామి


వ్యాపార దక్షతకు, నిజాయితీకి నిలువెత్తు వ్యక్తి..నేటి తరానికి, ముందు తరాలకు ఆదర్శనీయులు డా|| నల్లి కుప్పుస్వామి చెట్టిఈ నెల 9న ఆయన పుట్టిన రోజు





ప్రజాభూమి, కృష్ణా బ్యూరో:
ఆయన మహోన్నతులు, దేశ, విదేశాలలో చేనేత రంగానికి విశిష్టమైన సేవలు అందిస్తున్నారు. ఆయన పేరు తెలియని వారు లేరు! కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలుమార్లు అంకితమైన ఆయన సేవలను గుర్తించి ఘనంగా సత్కరించి, పుర స్కారాలు అందించిన సంఘటనలు ఎన్నో వు న్నాయి. పద్మశ్రీ (2003), పద్మభూషణ్ (2025), తిరుమల తిరుపతి దేవస్థానం మూడుసార్లు డైరెక్టర్‌గా పని చేసే అవకాశం కల్పించింది. పలు దేవాలయాలకు, మద్రాసులోని రామకృష్ణ మిష న్‌కు, వివేకానంద కళాశాలకు ఉదాత్తమైన సేవ లు అందిస్తూ వస్తున్నారు. మేనేజింగ్ కమిటీలలో నల్లి కుప్పుస్వామి చెట్టి సభ్యులుగా ఉన్నారు. మద్రాసులో నల్లి చిన్నస్వామి చెట్టి 'వస్త్రవ్యా పారం' అంటే దేశంలో తెలియనివారు లేరు. దాన గుణానికి, పేదలకు, తన దగ్గర పని చేసే వందలాది మంది కుటుంబాలను ఆదుకుంటూ వస్తున్న ఆయనే 'డా|| నల్లి కుప్పుస్వామి చెట్టి'. ఆయన్ని చూస్తే ఆశ్చర్య పోవడం, విస్మయం వ్యక్తం చేయని వ్యక్తులే వుండరు. అతి సాధార ణంగా కాటన్ తెల్లని పంచె, తెల్లని చొక్కాతో, నుదుట బొట్టుతో సదా చిరునవ్వుతో ఆకట్టుకునే ఆయన వ్యక్తిత్వం. ఆయన్ని చూడగానే ఒక భక్తిభావం... ఆ ముఖంలో ఒక తేజస్సు మనల్ని కట్టిపడేస్తాయి.

విద్య, కళ, సంస్కృతి, సాహిత్యం, సంగీతం, నాట్యం మొదలగు రంగాలకు డా|| కుప్పుస్వామి చెట్టిగారు చేసిన సేవలు, అందిం చిన ఆర్థిక సహాయాలు ప్రజా జీవితంలో ఆయన మమేకాన్ని, నిజాయితీని తేటతెల్లం చేస్తాయి. 1928 సంవత్సరంలో మద్రాసులోని ఒక చిన్న షాపులో 'నల్లి' పురుడు పోసుకుంది. ఈ సంవత్సరం (2026)కి 98 సంవత్సరాలలో నల్లి చిన్నస్వామి చెట్టి వస్త్రవ్యాపారం శాఖోపశాఖ లుగా విస్తరించింది. త్వరలో నల్లి చినస్వామి చెట్టి ప్రారంభించిన వస్త్రవ్యాపారం 100 సంవత్స రాలు పూర్తి చేసుకుంటున్న శుభసందర్భంగా ఉత్సవాలను అత్యంత ఘనంగా జరుపుకోను న్నది. ఒక షాపు 100 సంవత్సరాలు కొనుగోలు దారుల అభిమానంతో, వారి ఆశీస్సులతో నడవటం చాలా అరుదు. ఆ ఘనతను డా|| నల్లి కుప్పుస్వామి చెట్టి సాధించారు.




మద్రాసు టీనగర్, పానగల్ పార్కు ఎదురుగా 200 చదరపు అడుగులతో షాపును ప్రారంభించగా నేడు 30 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో మూడు అంతస్తుల విశాలమైన భవనంగా వుండి, ఒక వీధి నుండి మరో వీధికి విస్తరించి వుంది. కొనుగోలుదారు లకు అన్ని వసతులు ఆయన ఏర్పాటు చేశారు. కొనుగోలుదా రులు సంతృప్తిగా, సంతోషంగా కొనుకున్న తరువాత మరోసారి 'నల్లీ' షాపుకు వచ్చే విధంగా ఆకర్షించే విధంగా తీర్చిదిద్దారు.

ఇది డా|| కుప్పుస్వామి చెట్టిగారి వ్యాపార దక్షతకు నిదర్శనం. వ్యాపారంలో నిజాయితీ, నమ్మకం, నాణ్యమైన వాటిని అమ్మడం కొనుగో లుదారులపై శ్రద్ధ చూపటం, వినయం, విధేయత తాత ముత్తాతల నుంచి ఇదే సూత్రాన్ని అనుసరిస్తూ వుండటంవల్లనే 'నల్లి' వస్త్ర వ్యాపార సామ్రాజ్యం దేశ, విదేశాలలో 45 శాఖలతో అలరారుతోంది. పరిస్థితుల ప్రాబల్యం వల్ల నల్లి కుప్పుస్వామి చెట్టి పట్టు వ్యాపారంలోకి రాక తప్పలేదు. అందువల్ల పెద్దగా చదువుకోలేక పోయారు. అయినా ఆయన విపరీతంగా చదివే వారు. ఆధ్యాత్మికమైన భావంతో, తనలో దాగి వున్న సాహిత్య పిపాసతో స్వంతంగా ఇంటిలోనే పెద్ద లైబ్రరీని ఏర్పాటు చేసుకున్నారు. స్వయంగా ఆయన 80కు పైగా పుస్తకాలు రాశారు. ఆయన పుస్తకాలు మేధావులు, విద్యావేత్తల అభిమానాన్ని చూరగొన్నాయి. సాహిత్య రంగానికి డా|| నల్లి కుప్పుస్వామిచెట్టి అందించిన సేవలకు గాను ఆయనకు ప్రతిష్టాత్మకమైన 'రాజాసర్ అన్నాదురై చెట్టియార్ అవార్డుతో సత్కరించారు'. 'విదు రుని' నీతులపై ఆయన రాసిన పుస్తకానికి ప్రతిష్టా త్మకమైన 'ఇలక్కియ చింతనై' అవార్డు లభించింది. తిరుప్పూర్ తమిళ సంఘం చెట్టిగారు రాసిన అర్థశాస్త్రం పుస్తకానికి ఉత్తమ అవార్డును అందించింది. తమిళనాడు ప్రభుత్వం ఆయన రాసిన 'వ్యాపార అభివృద్ధి, కస్టమర్ కేర్' ఉత్తమ పుస్తకంగా అందరికీ ఉపయోగపడేవిగా గుర్తించి బహుమతులు ప్రధానం చేసింది.

చెట్టిగారు రాసిన పలు తమిళ పుస్తకాలు, ఇంగ్లీషు తోపాటు పలు భారతీయ భాషల్లో అనువదింపబ డ్డాయి. ఆయనలో వున్న రచయితను గుర్తించిన ఐ.ఐ.ఎం. అహ్మ దాబాద్ సహా, పలు బిజినెస్ స్కూళ్ళు, కళాశాలలు చెట్టిగారిని తమ సంస్థలో ఉపన్యాసాలు ఇవ్వడానికి ఆహ్వాని స్తున్నాయంటే ఆయన ఎంతటి మేధావో అర్థం చేసుకోవచ్చు!

1940 నవంబరు 9వ తేదీన తమిళనాడులోని కాంచీపురంలో చేనేత కుటుంబంలో డా|| నల్లి కుప్పుస్వామి చెట్టియార్ జన్మించారు. చెన్నై టీనగర్‌లోని రామకృష్ణ మిషన్ హైస్కూలులో చదువుతుండగా తండ్రి అకాల మరణంతో తప్పనిసరిగా స్వంత పట్టు వ్యాపారాన్ని చేపట్టక తప్పలేదు. 'కంచి పట్టుచీరలకు' దేశ, విదేశాలలో గుర్తింపు తీసుకొచ్చింది కుప్పుస్వామి చెట్టియే! అంటే అతిశయోక్తి కాదు. పండుగలకు, శుభకార్యాలకు, వేడుకలకు మహిళలు పట్టుచీరలే కట్టుకునేంతగా ఆయన గుర్తింపును తీసుకొచ్చారు. ఒక సామాన్య చేనేత కుటుంబంలో పుట్టి పట్టుతోపాటు వస్త్ర ప్రపంచంలో గుర్తింపు తీసుకొచ్చిన డా|| నల్లి కుప్పుస్వామి చెట్టి తమ సంస్థల్లో పని చేసే ప్రతి కుటుంబాన్ని తమ వారిగానే భావించి అండగా వుండడం గొప్ప విషయం. ఒక్కసారి 'నల్లీ'లో ప్రవేశించిన వారు రిటైరయ్యే వరకూ అక్కడే పని చేస్తూ వుంటారు. ఇది డా|| కుప్పుస్వామి చెట్టి దూరదృష్టికి, కష్టపడే వారి మనస్తత్వానికి ఇచ్చే పెద్ద బహుమతి! అందుకే తమిళనాడు ప్రభుత్వం కలైమామణి, భారత రాష్ట్రపతి నుంచి పద్మభూషణ్ అందుకోవటం ఆ మహోన్నత వ్యక్తికే దక్కింది. నేటికీ, ముందు తరాలకూ డా|| నల్లి కుప్పుస్వామి చెట్టి ఆదర్శనీయులు.





నిరుపేదకు స్వయం ఉపాధి భరోసా

మైత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇస్త్రీ తోపుడు బండి అందజేత



మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి
నిరుపేదలకు అండగా నిలుస్తూ, స్వయం ఉపాధి ద్వారా ఆర్థిక స్వావలంబన కల్పిం చడమే లక్ష్యంగా మైత్రి ఫౌండేషన్ మరో సేవా కార్యక్రమాన్ని చేపట్టింది. మచిలీప ట్నంలోని బలరామునిపేటకు చెందిన కాకి కృష్ణకు ఇస్త్రీ తోపుడు బండిని అందజేసి ఉపాధి అవకాశాన్ని కల్పించింది.అనారోగ్య కారణాలతో ఉపాధిని కోల్పోయి జీవనోపాధి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్న కృష్ణకు ఈ బండిని అందించడం ద్వారా తన కాళ్లపై తాను నిలబడి గౌరవప్రదంగా జీవిం చేందు కు ఫౌండేషన్ చేయూతనందించింది. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న నిరుపేదలకు తాత్కాలిక సహాయం అందించడమే కాకుండా, వారి భవిష్యత్తుకు భరోసా కల్పించేలా స్వయం ఉపాధి మార్గాలను చూపడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.ఈ సేవా కార్యక్రమానికి సంపూర్ణ ఆర్థిక సహకారం అందించిన మైత్రి ఫౌండేషన్ గౌరవ సభ్యుడు, ఎన్నారై చదలవాడ దివాకర్‌కు ఫౌండేషన్ ప్రతినిధులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆయన సహకారంతో ఒక నిరుపేద కుటుంబానికి జీవనోపాధి మార్గం కల్పించగలిగామని పేర్కొన్నారు.ఒక వ్యక్తికి సహాయం చేయడం అంటే ఆ రోజుకు అవసరాన్ని తీర్చడం మాత్రమే కాదని, అతని భవిష్యత్తుకు పునాది వేయడమేనని మైత్రి ఫౌండేషన్ తన సేవా కార్యక్రమం ద్వారా చాటిచెప్పింది. మానవత్వం, సేవాభావం, సామాజిక బాధ్యతే లక్ష్యంగా ఇటువంటి కార్యక్రమాలను కొనసాగిస్తున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు.ఈ కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఫౌండేషన్ తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు.

చక్రపాణికి ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ఘననివాళి

చక్రపాణి అంతిమయాత్ర, అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



ప్రజాభూమి ప్రతినిధి అవనిగడ్డ
ఆంధ్రప్రదేశ్ శాసన మండలి తొలి చైర్మన్ డాక్టర్ ఏ.చక్రపాణి పార్థివ దేహానికి అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఘనంగా నివాళులు అర్పించారు. శుక్రవారం చక్రపాణి అంత్యక్రియలు హైదరాబాదులో నిర్వహించారు. ఈ సందర్భంగా చక్రపాణి పార్థివ దేహానికి వారి స్వగృహంలో నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. చక్రపాణి మృతి పట్ల ప్రగాఢ సంతాపం, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. అనంతరం చక్రపాణి అంతిమయాత్ర, అంత్యక్రియలలో పాల్గొన్నారు. ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, పలువురు ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రముఖులు చక్రపాణి అంత్యక్రియలలో పాల్గొన్నారు.

యార్లగడ్డ దుర్గా ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన వైసీపీ నాయకులు

చల్లపల్లి, ప్రజాభూమి ప్రతినిధి:
కృష్ణా జిల్లా చల్లపల్లి మండలం యార్లగడ్డ గ్రా మంలో స్థానిక ఎన్నికల ఓటింగ్ సందర్భంగా



గ్రామానికి చెందిన పెద్దలు, నాయకులు యార్లగ డ్డ దుర్గా ప్రసాద్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ యార్లగడ్డ హేమాంజనేయ ప్రసాద్, గ్రామ కన్వీనర్ యార్లగడ్డ సత్యాంజనేయ ప్రసా ద్ ఆధ్వర్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయ కులు, కార్యకర్తలు గౌతమ్‌ను సన్మా నించారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెం దిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాభూమి

ఏలూరు, పశ్చిమగోదావరి 4

శనివారం 7 నవంబర్ 2026



భూలోకమ్మ అమ్మవారి ఆలయంలో అన్నదానం

- కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే బడేటి చంటి, మేయర్ రెడ్డి అప్పలనాయుడు

ప్రజాభూమి ఏలూరు

స్థానిక బావిశెట్టి వారి పేటలోని శ్రీ భూలోకమ్మ అమ్మవారి ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ఏలూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి),నగర మేయర్ రెడ్డి అప్పలనాయుడు ముఖ్య అతిథులు గా హాజరై ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఈడా చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, కార్పొరేటర్లు మేకల కనకదుర్గ, అమరావతి అశోక్,ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

ధ్వంసమైన రోడ్డుకు మరమ్మతులు చేయించిన కౌన్సిలర్ కురసాల సురేష్ నాయుడు



ప్రజాభూమి ప్రతినిధి, అమలాపురం రూరల్

గత రెండు నెలలుగా పాడై, ఇటీవల వచ్చిన 'ఆర్నబ్' తుఫానుకు పూర్తిగా ధ్వంసమైన రోడ్డుకు ఎట్టకేలకు మరమ్మతులు పూర్తయ్యాయి. 25వ వార్డు కౌన్సిలర్ కురసాల సురేష్ నాయుడు మున్సిపల్ కమిషనర్ మరియు అధికారుల సహకారంతో ఈరోజు దగ్గరుండి ప్యాచ్ వర్క్ పనులను పూర్తి చేయించారు. రాకపోకలకు ఇబ్బంది తొలగడంతో స్థానిక వార్డు ప్రజలు, వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు. సహకరించిన అధికారులకు కౌన్సిలర్ ధన్యవాదాలు తెలిపారు.

తెదేపా సీనియర్ నేత లంకలపల్లి వీరేశ్వరరావు గుండెపోటుతో మృతి

ప్రజాభూమి ప్రతినిధి, అమలాపురం రూరల్



తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు లంకలపల్లి వీరేశ్వరరావు గురువారం రాత్రి గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. ఎన్టీఆర్ పార్టీ స్థాపించిన నాటి నుంచి పసుపు జెండానే నమ్ముకుని సామాన్య కార్యకర్తగా పనిచేసిన ఆయన, స్వర్గీయ మెట్లతో ఎంతో సన్నిహిత అనుబంధం కొనసాగించారు. ఇటీవల మున్సిపల్ ఎన్నికల్లో 11వ వార్డులో పార్టీకి తక్కువ మెజారిటీ రావడంపై నిన్నటివరకు తీవ్ర ఆవేదన వ్యక్తం చేసిన ఆయన, రాత్రి వ్యాపారం ముగించుకుని ఇంటికి వెళ్లాక తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వెంటనే ఆసుపత్రికి తరలించగా అప్పటికే తుదిశ్వాస విడిచారు. ఆయన మృతి పట్ల స్థానిక తెదేపా నాయకులు, శ్రేణులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశాయి.

దాసరి ఆంజనేయులుకు ఎమ్మెల్యే చేతుల మీదుగా ఘన సన్మానం



ప్రజాభూమి ఏలూరు

నగర కార్పొరేషన్ ఎన్నికల్లో 7వ డివిజన్ కార్పొరేటర్‌గా ఘనవిజయం సాధించిన దాసరి కామేశ్వరిని,ఆమె భర్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులుని ఘనంగా సన్మానించి అభినందించడం జరిగింది.ఈ సందర్భంగా ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణ చేతుల మీదుగా దాసరి ఆంజనేయులుని సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.మాల మహాసేన జాతీయ అధ్యక్షులు ఆలగ రవికుమార్ ఆధ్వర్యంలో రాష్ట్ర మాల మహాసేన (వీమీ) నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొని దాసరి ఆంజనేయులుకు అభినందనలు తెలిపారు.అనంతరం ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణని కూడా మాల మహాసేన నాయకులందరూ కలిసి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ,ప్రజల ఆదరాభిమానాలతో విజయం సాధించిన దాసరి కామేశ్వరి 7వ డివిజన్ అభివృద్ధికి,ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని ఆకాంక్షించారు.అలాగే సామాజిక సేవా కార్యక్రమాల్లో దాసరి ఆంజనేయులు సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో ఉత్సాహభరితంగా సాగింది.పలువురు మాల మహాసేన రాష్ట్ర నాయకులు సరిపల్లి పెద్దిరాజు, నాగార్జున కార్యకర్తలు పాల్గొని దాసరికి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

అన్నవరంలో ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం

ప్రజాభూమి ప్రతినిధి నూజీవీడు



జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల అన్నవరములో స్కూల్ పరిధి లో భారతరాజ్యాంగ దినోత్సవము గూర్చి, వ్యాస రచన, వక్తృత్వ, డ్రాయింగ్ పోటీలునిర్వహించడమైనదని పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు రవీంద్ర తెలిపారు. ఇన్చార్జిప్ర ధానోపాధ్యాయుడు మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని" సంవిధాన్ దివస్" అని అంటారు. ప్రతి సంవత్సరము నవంబర్ 26 న జరుపుకుంటారు అని తెలిపారు.స్టాప్ సెక్రటరీ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ భారత రాజ్యాంగమును రూపిందించడములో అంబేద్కర్ ప్రముఖమైన పాత్ర పోషించడము జరిగినది..భారత రాజ్యాంగ నిర్మాత, రాజ్యాంగశిల్పి అని పిలుస్తారు. అంబేద్కర్ డ్రాఫ్టింగ్ కమిటీ ఛైర్మన్ గా వ్యవహరించారు. 1947 ఆగష్టు 29 న రాజ్యాంగ సభ డ్రాఫ్టింగ్ కమిటీ ఏర్పాటు చేసింది.. కమిటీ అధ్యక్షుడు గా అంబేద్కర్ వ్యవహరించారు.

రాజ్యభారత రాజ్యాంగ దినోత్సవము భారత రాజ్యాంగ దినోత్సవము గూర్చి, వ్యాస రచన, వక్తృత్వ, డ్రాయింగ్ పోటీలునిర్వహించడమైనదని తెలిపారు.ప్రతి సంవత్సరము నవంబర్ 26 న జరుపుకుంటారు అని తెలిపారు. భారత రాజ్యాంగ నిర్మాతను రాజ్యాంగ శిల్పి అని పిలుస్తారు. అంబేద్కర్ డ్రాఫ్టింగ్ కమిటీ ఛైర్మన్‌గా వ్యవహరించారు. రాజ్యాంగ తుది ముసాయిదాను తయారు చేయటంలో, వివిధ దేశాల రాజ్యాంగాలను అధ్యయనం చేసి, భారతదేశపరిస్థితుల కు అనుగుణంగా రూప దిద్దడంలో ఆయన ప్రధాన భాధ్యత తీసుకున్నారు. ప్రాధమిక హక్కులు మరియు సామాజిక న్యాయం,కుల, మత, వర్గ, లింగ వివక్ష త లేకుండా చేయడం. భారత రాజ్యాంగం 2 సంవత్సరాల 11 నెలల18 రోజుల సమయంపట్టినది. అంబేద్కర్ ను రాజ్యాంగ శిల్పి అని పిలుస్తారు. ఇది ప్రపంచములో పెద్ద రాజ్యాంగము. ప్రతి సంవత్సరము నవంబర్ 26 రాజ్యాంగ దినోత్సవము జరుపుకుంటాము. 1950 జనవరి 26 న భారత రాజ్యాంగము అమలులోకి వచ్చినది అని తెలియచేశారు.వ్యాసరచనలో ప్రథమ బహుమతి జయకృష్ణ రాజు, ద్వితీయ భరత్ కుమార్, త్రుతీయ బహుమతి ఎనోష్, కన్స్యులేషన్ బహుమతి ధనలక్షి సాధించారు. డాయింగ్ పోటీల్లో ప్రథమ బహుమతి సూర్య, ద్వితీయ అభినయ్, త్రుతీయ బహుమతి మహేశ్వరి సాధించారు. న్యాయ నిర్ణేతగా సీనియర్ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయని జయ కుమారి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయనీ ఉపాధ్యాయులు నాగరాజు, జయకుమారి, జాస్మిన్, వెంక రమణ, రాజేంద్రప్రసాద్, భోగి ప్రసాద్ పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా బాణసంచా విక్రయిస్తే క్రిమినల్ కేసులు!

- వ్యాపారులు భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి : జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా

ప్రజా భూమి ప్రతినిధి,అనకాపల్లి



దీపావళి పండుగ నేపథ్యంలో బాణసంచా విక్రయాలు, నిల్వల విషయంలో వ్యాపారులు అప్రమత్తంగా ఉండాలని అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా హెచ్చరించారు. బాణసంచా విక్రయాలు, నిల్వలకు సంబంధిత శాఖల నుంచి ముందస్తు అనుమతులు, తాత్కాలిక లైసెన్సులు తప్పనిసరిగా పొందాలని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు. దీపావళి సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, అగ్నిప్రమాదాలు జరగకుండా బాణసంచా దుకాణాలు, నిల్వ గోదాముల వద్ద భద్రతా ప్రమాణాలు పాటించేలా క్షేత్రస్థాయిలో విస్తృత తనిఖీలు చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా బాణసంచా వ్యాపారులు తప్పనిసరిగా పాటించాల్సిన నిబంధనలను ఎస్పీ వెల్లడించారు. నివాస ప్రాంతాలు, విద్యాసంస్థలు, ఆసుపత్రులకు దూరంగా పట్టణ, గ్రామీణ శివార్లలోని బహిరంగ ప్రదేశాల్లో మాత్రమే తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేయాలి. రెండు దుకాణాల మధ్య కనీసం 15 మీటర్ల దూరం ఉండేలా చర్యలు తీసుకోవాలి. దుకాణాల నిర్మాణంలో అగ్నిని నిరోధించే పదార్థాలను ఉపయోగించాలి. ప్రతి దుకాణం వద్ద నీరు, పొడి ఇసుక బస్తాలు, ఫైర్ ఎక్స్‌టింగిషర్లు అందుబాటులో ఉంచాలి. దుకాణాల వద్ద రద్దీ నియంత్రణకు చర్యలు తీసుకోవడంతో పాటు అగ్నిప్రమాద నివారణ సూచనలతో కూడిన హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. అధీకృత లైసెన్స్ కలిగిన హోల్‌సేల్ వ్యాపారుల వద్ద నుంచే బాణసంచా కొనుగోలు చేయాలి. ప్రజా రవాణా వాహనాల్లో బాణసంచా తరలించడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. బాణసంచా నిల్వ గోదాముల్లో సురక్షితమైన విద్యుత్ వైరింగ్, ఫైర్ అలారమ్‌లు, అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లేందుకు తగిన మార్గాలు ఉండాలి. లైసెన్స్ గడువు ముగిసిన తర్వాత మిగిలిన బాణసంచాను ఇళ్లలో లేదా జనావాసాల్లో నిల్వ చేయకుండా అధీకృత గోదాముల్లోనే భద్రపరచాలని సూచించారు. అనుమతులు లేకుండా బాణసంచా నిల్వ చేసినా, నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు చేపట్టినా, జనావాసాల మధ్య దుకాణాలు ఏర్పాటు చేసినా బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ వ్యాపారులు పోలీసులకు సహకరించాలని కోరారు.

ఎన్నికల కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేయాలి



- రెండు మండలాలకు సంబంధించి 38 కౌంటింగ్ టేబుళ్ల ఏర్పాటు.
- రెండు స్ట్రాంగ్ రూములు, ఆరు కౌంటింగ్ గదుల కేటాయింపు
- జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్

ప్రజాభూమి ప్రతినిధి, రామచంద్రపురం

రామచంద్రపురం డివిజన్ పరిధిలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. రామచంద్రపురం డివిజన్ పరిధిలోని రామ చంద్రపురం, కె.గంగవరం మండలాలకు సంబంధించి మొత్తం 38 ఎంపీటీసీ స్థానాల ఓట్ల లెక్కింపు కోసం ఏర్పాట్ల ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. రామచంద్రపురం మండలానికి సంబంధించి ఎస్.కె.పి.జి. ఎన్. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని ఐదవ గదిని స్ట్రాంగ్ రూముగా, ఆరో, ఏడో, ఎనిమిదో గదులను మూడు కౌంటింగ్ హాళ్లుగా కేటాయించినట్లు తెలిపారు. వీటిలో మొదటి కౌంటింగ్ హాల్‌కు 7 టేబుళ్ల, రెండవ కౌంటింగ్ హాల్‌కు 7 టేబుళ్లు, మూడవ కౌంటింగ్ హాల్‌కు 6 టేబుళ్లు కేటాయించారు. కె.గంగవరం మండలానికి సంబంధించి మొదటి గదిని స్ట్రాంగ్ రూముగా, రెండు, మూడు, నాలుగు గదులను కౌంటింగ్ హాళ్లుగా కేటాయించారు. వీటిలో మూడు కౌంటింగ్ హాళ్లకు వరుసగా 6, 6, 6 టేబుళ్ల చొప్పున ఏర్పాటు చేశారు. రెండు మండలాలకు కలిపి మొత్తం రెండు స్ట్రాంగ్ రూములు, ఆరు కౌంటింగ్ గదులు, 38 కౌంటింగ్ టేబుళ్లను ఏర్పాటు చేసేలా ప్రణాళిక రూపొందించారు. బ్యాలెట్ బాక్సులను భద్రపరిచే స్ట్రాంగ్ రూముల వద్ద నిరంతర పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతి ఉన్న అధికారులు, సిబ్బంది, అభ్యర్థులు, ఏజెంట్లను మాత్రమే నిబంధనల ప్రకారం అనుమతించాలని సూచించారు.కౌంటింగ్ కేంద్రాల వద్ద శాంతిభద్ర తలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, అవసరమైన పోలీసు బలగాలను మోహరించాలని ఆదేశించారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితం గా అమలు చేయాలని, విజయోత్సవాలు, ఊరేగింపులు, బహిరంగ సమా వేశాల నిర్వహణలో ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించకుండా పర్యవేక్షించాలన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో ఎటువంటి అవకతవకలకు తావులేకుండా పారదర్శకత, నిష్పక్షపాత విధానాలను పాటిస్తూ ఎన్నికల అధికారులు, పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.



పోణంగిలో కార్పొరేటర్ గేదెల సూర్య ప్రకాష్‌కు కొఠారు అబ్బయ్య చౌదరి శుభాకాంక్షలు

ప్రజాభూమి ఏలూరు

నగరంలోని 24వ డివిజన్ పోణంగిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున కార్పొరేటర్‌గా విజయం సాధించిన గేదెల సూర్య ప్రకాష్ ఆహ్వానం మేరకు, పోణంగిలోని వారి నివాసంలో ఏర్పాటు చేసిన విందు కార్యక్రమానికి దెందులూరు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కొఠారు అబ్బయ్య చౌదరి హాజరయ్యారు.ఈ సందర్భంగా గేదెల సూర్య ప్రకాష్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకుని,కార్పొరేటర్‌గా విజయం సాధించినందుకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం ఆయనతో కొద్దిసేపు ఆత్మీయంగా ముచ్చటించారు.ఈ విందు కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో సాగింది.ఈ సందర్భంగా ఇరువురి మధ్య స్నేహపూర్వక సంభాషణలు చోటుచేసుకున్నాయి.



ఎన్నికల విధి నిర్వహణలో ఆదర్శంగా నిలిచిన మహిళా ఉద్యోగులు

ప్రజాభూమి, బుట్టాయగూడెం

మండలంలో జడ్పిటిసి ఎంపీటీసీ ఎన్నికలలో విధులు నిర్వహించిన మహిళా సిబ్బంది కొందరు వ్యవహరించిన తీరు ఎందరికో ఆదర్శంగా నిలుస్తుంది. అంతర్వేదిగూడెంలో శుక్రవారం జరిగిన స్థానిక ఎన్నికలలో విధూది దివ్య అనే బాలింత తన ఓటు హక్కును వినియోగించుకోవడానికి పోలింగ్ బూత్ కు పసికందుతో వచ్చింది. అయితే పసికందుని ఎత్తుకొని క్యూలో నిలబడి ఓటు హక్కును వినియోగించుకోవడానికి దివ్య పడుతున్న ఇబ్బందిని ఎన్నికల బూత్ వద్ద విధి నిర్వహణలో ఉన్న అటవీ శాఖ ఉద్యోగిని కొవ్వాసు శ్రీదేవి గమనించింది. వెంటనే స్పందించిన శ్రీదేవి బాలింతరాలు దివ్య దగ్గరకు వెళ్లి ఆమె పసికందును తాను ఎత్తుకొని, దివ్య ను ఓటు హక్కు వినియోగించుకోవడానికి పోలింగ్ బూత్ లోకి పంపించింది.. ఇది గమనించిన పలువురు శ్రీదేవిని అభినందించారు. ఇది ఇలా ఉండగా బుట్టాయగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ బూత్ ల వద్ద వైద్య శిబిరం నిర్వహించిన ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు తమ విధి నిర్వహణతో పాటు చిన్న పిల్లలతో వచ్చిన తల్లుల వద్ద నుండి పిల్లలను తీసుకుని వారిని ఎత్తుకొని ఓదార్చుతూ తల్లులను ఓటు హక్కు వినియోగించుకోవడానికి వీలు కల్పించారు. ఇది గమనించిన పలువురు ఆశా వర్కర్లను ఏఎన్ఎం లను అభినందించారు. తమ విధులతోపాటు సమస్యల పట్ల మహిళా ఉద్యోగులు స్పందించిన తీరు పలువురు ప్రశంసలను అందుకుంది

ఓట్ల లెక్కింపునకు పకడ్బందీ ఏర్పాట్లు

- ఎస్.కె.బి.ఆర్. కళాశాలలో 10 మండలాలకు 196 కౌంటింగ్ టేబుళ్లు, 21 హాళ్లు
- స్ట్రాంగ్ రూములు, కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు భద్రత
- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్

ప్రజాభూమి ప్రతినిధి, అమలాపురం రూరల్



అమలాపురం డివిజన్ పరిధిలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని ముందస్తు ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. స్థానిక అమలాపురం పట్టణంలోని ఎస్.కె.బి.ఆర్. కళాశాల ప్రాంగణంలో డివిజన్ పరిధిలోని 10 మండలాలకు సంబంధించి స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ హాళ్లను కేటాయించినట్లు కలెక్టర్ వెల్లడించారు. అమలాపురం, ఉప్పలగుప్తం, అల్లవరం, ముమ్మిడివరం, ఐ.పోలవరం, కాట్రేనికోన, మలికిపురం, సఖినేటిపల్లి, మామిడికుదురు, రాజోలు మండలాల్లోని మొత్తం 196 ఎంపీటీసీ స్థానాల ఓట్ల లెక్కింపు కోసం 196 కౌంటింగ్ టేబుళ్లను సిద్ధం చేసేలా పక్కా ప్రణాళిక రూపొందించామన్నారు. కళాశాలలోని జూలజీ, కామర్స్, డి.ఈడి, బి.ఈడి, ఎన్.సి.సి బ్లాకులలో మండలాల వారీగా మొత్తం 21 కౌంటింగ్ హాళ్లను కేటాయించినట్లు పేర్కొన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లో నిరంతర విద్యుత్ సరఫరా, తాగునీరు, పారిశుధ్యం, సరైన టేబుళ్ల అమరిక తదితర మౌలిక సదుపాయాలను ఎక్కడా లోటుపాట్లు లేకుండా ముందస్తుగానే సమకూర్చాలని అధికారులకు సూచించారు. స్ట్రాంగ్ రూముల వద్ద 24 గంటల పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, కౌంటింగ్ కేంద్రాల పరిసరాల్లో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారం అనుమతి కార్డులు కలిగిన అధికారులు, సిబ్బంది, అభ్యర్థులు, ఏజెంట్లను మాత్రమే కేంద్రాల్లోకి అనుమతించాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటించాలని, ఫలితాల అనంతరం విజయోత్సవాలు, ఊరేగింపులు, బహిరంగ సభల విషయంలో నిబంధనలు ఉల్లంఘించకుండా నిరంతరం పర్యవేక్షించాలని పోలీసు, ఎన్నికల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో వ్యవహరించి ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రజాభూమి
కోనసీమ
5
శనివారం 7 నవంబర్ 2026

నూజివీడులో నేడు ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల కౌంటింగ్

ప్రజాభూమి ప్రతినిధి నూజివీడు

నూజివీడులోని సారథి ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 7వ తేదీ శనివారం ఉదయం 8 గంటల నుంచి ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో కౌంటింగ్ ఏజెంట్ల నియామకం, గుర్తింపు కార్డుల జారీకి సంబంధించి అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు. కౌంటింగ్ ఏజెంట్లుగా నియమితులైన వారు తమ గుర్తింపు కార్డులను నేటిలోగా తప్పనిసరిగా పొందాలని సూచించారు.ప్రతి ఎంపీటీసీ అభ్యర్థి తరఫున ఒక మెయిన్ ఏజెంట్, ఒక రిలీవర్‌తో కలిపి ఇద్దరు కౌంటింగ్ ఏజెంట్లను నియమించుకునేందుకు అవకాశం ఉంది. జెడ్పీటీసీ అభ్యర్థి తరఫున సంబంధిత మండలంలోని మొత్తం ఎంపీటీసీ స్థానాల సంఖ్యలో సగం మంది కౌంటింగ్ ఏజెంట్లను నియమించుకోవచ్చు. ఉదాహరణకు నూజివీడు మండలంలో 20 ఎంపీటీసీ స్థానాలు ఉంటే, జెడ్పీటీసీ అభ్యర్థి తరఫున 10 మంది కౌంటింగ్ ఏజెంట్లను నియమించుకోవడానికి అవకాశం ఉంటుంది. కౌంటింగ్ ఏజెంట్ల నియామకానికి సంబంధించిన ఫారమ్‌ను పూర్తిగా నింపి,



అభ్యర్థి లేదా అధీకృత వ్యక్తితో సంతకం చేయించాలి. ఫారమ్‌తో పాటు ఏజెంట్ ఆధార్ కార్డు జిరాక్స్, ఓటర్ ఐడీ జిరాక్స్, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలను జతచేసి సంబంధిత ఎంపీడీవో కార్యాలయంలో సమర్పించాలి. అనంతరం కౌంటింగ్ ఏజెంట్ గుర్తింపు కార్డులను పొందాల్సి ఉంటుంది.

మండలాల వారీగా గుర్తింపు కార్డుల జారీ వివరాలు:

ఆగిరిపల్లి మండలానికి చెందిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ కౌంటింగ్ ఏజెంట్లు ఈరోజు మధ్యాహ్నం 2 గంటల తర్వాత ఆగిరిపల్లి ఎంపీడీవో కార్యాలయంలో గుర్తింపు కార్డులు పొందాలి. చాట్రాయి మండలానికి చెందిన కౌంటింగ్ ఏజెంట్లు ఈరోజు ఉదయం 10 గంటల తర్వాత నూజివీడులోని సారథి ఇంజనీరింగ్ కళాశాలకు వెళ్లి గుర్తింపు కార్డులు తీసుకోవాలి.నూజివీడు మండలానికి చెందిన కౌంటింగ్ ఏజెంట్లు నూజివీడు ఎంపీడీవో కార్యాలయంలో, ముసునూరు మండలానికి చెందిన కౌంటింగ్ ఏజెంట్లు ముసునూరు ఎంపీడీవో కార్యాలయంలో తమ గుర్తింపు కార్డులను పొందాలి.శనివారం ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభం కానున్న నేపథ్యంలో కౌంటింగ్ ఏజెంట్లు కనీసం అరగంట నుంచి గంట ముందుగానే కౌంటింగ్ హాల్‌కు చేరుకోవాలని సూచించారు. సంబంధిత ఎంపీటీసీ, జెడ్పీటీసీ అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు ఈ సూచనలను పాటించి, కౌంటింగ్ ప్రక్రియకు అవసరమైన ఏర్పాట్లు సకాలంలో పూర్తి చేసుకోవాలని కోరారు.



ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

ప్రజా భూమి ప్రతినిధి, జీలుగుమిల్లి

జీలుగుమిల్లి మండలం బర్రింకలపాడు గ్రామంలోని ఏపీ రెసిడెన్షియల్ స్కూల్ పోలింగ్ కేంద్రంలో పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు శుక్రవారం ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రాధాన్యతను చాటుతూ, ఎన్నికల ప్రక్రియలో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని ఆయన సూచించారు. వివిధ గ్రామాలలో పోలింగ్ స్టేషన్లో పోలింగ్ శాతాన్ని అడిగి తెలుసుకున్నారు.

ఉంగుటూరు ఎమ్మెల్యే ధర్మరాజును కలిసిన

ఏలూరు నూతన మేయర్ రెడ్డి అప్పలనాయుడు

ప్రజాభూమి ఉంగుటూరు

ఏలూరు నగర మేయర్‌గా 44,661 ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించిన జనసేన పార్టీ అభ్యర్థి రెడ్డి అప్పలనాయుడు శుక్రవారం జనసేన నాయకులు నారా శేషుతో కలిసి ఉంగుటూరు ఎమ్మెల్యే పట్సమట్ల ధర్మరాజును పత్తేపురంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధర్మరాజు నూతన మేయర్ రెడ్డి అప్పలనాయుడును శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.ఏలూరు నగర అభివృద్ధికి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు.కూటమి ప్రభుత్వ సహకారంతో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నగర పాలన సాగించాలని సూచించారు. అనంతరం ఉంగుటూరు నియోజకవర్గ జనసేన



నాయకులు ఎమ్మెల్యే ధర్మరాజు,నూతన మేయర్ రెడ్డి అప్పల నాయుడు, నారా శేషులను సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు,జనసైనికులు పాల్గొన్నారు.

44,661 ఓట్ల భారీ మెజారిటీతో

రెడ్డి అప్పలనాయుడు ఘన విజయం



ప్రజాభూమి ఏలూరు

నగర మేయర్‌గా ఘన విజయం సాధించిన జనసేన పార్టీ అభ్యర్థి రెడ్డి అప్పలనాయుడుకు అభినందనలు వెల్లువెత్తాయి. 44,661 ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించిన సందర్భంగా శుక్రవారం ఏలూరులోని జనసేన పార్టీ కార్యాలయం, ఆయన నివాసం వద్ద సందడి నెలకొంది.నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లు,కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు,వీర మహిళలు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ తన విజయానికి కృషి చేసిన ఎమ్మెల్యే బడేటి చంటి, జనసేన నాయకుడు నారా శేషు,కూటమి నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఏలూరు అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని, కార్పొరేటర్ల సహకారంతో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ నగరాన్ని అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు.

తుఫాన్ బాధితులకు, సహాయక చర్యల్లో పాల్గొంటున్న కార్మికులకు ఆహార పదార్థాల పంపిణీ

ప్రజాభూమి ప్రతినిధి పాలకొల్లు

పాలకొల్లు యునైటెడ్ కాపు వనిత క్లబ్ ఆధ్వర్యంలో తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో సేవా కార్యక్రమం నిర్వహించారు.ఆర్నాబ్ తుఫాన్ ప్రభావంతో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరిగి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించడం, రహదారులపై పడిపోయిన చెట్లను తొలగించడం వంటి సహాయక చర్యల్లో నిరంతరం శ్రమిస్తున్న విద్యుత్ శాఖ కార్మికులు, చెట్ల తొలగింపు పనుల్లో పాల్గొంటున్న శ్రామికుల సేవలను గుర్తించిన వనిత క్లబ్ సభ్యులు వారికి బిస్కెట్ ప్యాకెట్లు, రస్కులు, బ్రెడ్ ప్యాకెట్లను పంపిణీ చేశారు.అదేవిధంగా తుఫాన్ ప్రభావంతో హౌసింగ్ బోర్డు కాలనీలోని రామాలయం సమీపంలో ఇళ్లలోకి వరద నీరు చేరడంతో ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలను పరామర్శించి, వారికి కూడా బిస్కెట్లు, రస్కులు, బ్రెడ్ ప్యాకెట్లను అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు మాట్లాడుతూ, ప్రకృతి వైపరీత్యాలు, విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు అండగా నిలవడం, సహాయక చర్యల్లో పాల్గొంటున్న వారికి తోడ్పాటు అందించడం తమ వనిత క్లబ్ సేవా భావానికి నిదర్శనమని తెలిపారు. అవసరమైన సమయంలో తమ వంతు సహాయం అందించడం సామాజిక బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు దేవరపు కాంచనమాల, కార్యదర్శి సిద్ధిరెడ్డి శైలజారాణి, కోశాధికారి తోట గాయత్రి, మల్లిపూడి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ధర్మ గూడెం పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన అసిస్టెంట్ కలెక్టర్ శ్రవణ్ కుమార్



ప్రజాభూమి ప్రతినిధి, జీలుగుమిల్లి

జీలుగుమిల్లి మండలం లోని దర్భగూడెం పోలింగ్ కేంద్రాన్ని అసిస్టెంట్ కలెక్టర్ శ్రావణ్ కుమార్, జంగారెడ్డిగూడెం ఆర్డీఓ ఎం వి రమణ ఆకస్మిక తనిఖీ చేశారు. పోలింగ్ శాతం అడిగి తెలుసుకున్నారు. స్థానిక సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం పోలింగ్ బహిష్కరించిన కోరుటూరు పునరావాస కాలని కి వెళ్ళి గ్రామస్తులతో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ శ్రావణ్ కుమార్ సమస్యను పరిష్కరింపజేశారు. ఈయన వెంట తాసిల్దారు వెంకటేశ్వరరావు, ఎస్సై క్రాంతి కుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సైలెంట్‌గా ఓటేసిన కామవరపుకోట..!

శనివారం మధ్యాహ్నానికి తేలనున్న పీఠం ఎవరిదో? ఎవరికి వారే ధీమా

ప్రజా భూమి ప్రతినిధి, కామవరపుకోట

కామవరపుకోట మండలంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. అభ్యర్థుల భవితవ్యం బ్యాలెట్ బాక్సుల్లో భద్రంగా నిక్షిప్తమైంది.

మండల పోలింగ్ వివరాలు

మొత్తం పోలింగ్: 73.09%

పోలైన ఓట్లు: 37,611(పురుషులు: 18,633 । మహిళలు: 18,978)

పోటీలో ఉన్నవారు: 1 జడ్పీటీసీ స్థానానికి ముగ్గురు, 16 ఎంపీటీసీ స్థానాలకు 35 మంది అభ్యర్థులు.

గ్రామాలవారీ పోలింగ్ శాతం: గుంటుపల్లి: 82.01% కామవరపుకోట-1: 61.06%, కామవరపుకోట-2: 62.50%,కామవరపుకోట-3: 65.99%, కామవరపుకోట-4: 54.81%, ఉప్పలపాడు: 80.92%, రావికంపాడు: 79.21%, తూర్పు ఎడవల్లి: 80.61%, కల్లచెరువు: 73.31%, కె.ఎస్. రామవరం: 82.95%, అంకాలంపాడు: 88.84%, అడమిల్లి: 68.44%, సాగిపాడు: 77.17%, తడికలపూడి-1: 69.62%, తడికలపూడి-2: 66.63%, వీరశెట్టిగూడెం: 72.44%

శనివారం ఏలూరులో కౌంటింగ్:

బ్యాలెట్ బాక్సులను ఏలూరులోని స్ట్రాంగ్ రూమ్‌లకు



తరలించారు. శనివారం మధ్యాహ్నానికి కామవరపుకోట పీఠం ఎవరిదో తేలనుంది! ఎవరికి వారి ధీమా వ్యక్తం చేస్తూ సాయి శక్తులు ఇరు పార్టీలు శక్తి మీర పని చేశారు. గ్రామ పంచాయతీలలో వార్డులు లలో పనిచేసినట్లు పనిచేశారంటే ఏ విధంగా పని చేసారో అర్థం అవుతుంది. మరోవారు రోజుల్లో పంచాయతీలో అయితే రణరంగం ఏర్పడే పరిస్థితి నెలకొంది. ఒక పార్టీలో అయితే ఆఖరిలో వచ్చిన శక్తి మేర పనిచేసినట్లు కార్యకర్తలు చెప్పుకుంటున్నారు. రావికంపాడు వార్డులో 91% పోలయ్యాయి అంటే ఇరు పార్టీ కార్యకర్తలు ఏమిరా పనిచేశారో అర్థం పడుతుంది. ఒక వర్గం మాత్రం క్రాస్ ఓటింగ్ జరిగిందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా నేడు బద్దలయ్యే పరిస్థితి నెలకొంది.



కంటి ఆరోగ్య పరిరక్షణపై అవగాహన అవసరం

- విశ్వవిద్యాలయంలో ఉచిత కంటి పరీక్షల శిబిరం

ప్రజా భూమి ప్రతినిధి, ఆగిరిపల్లి

ఆగిరిపల్లి సమీపంలోని డా. ఆర్.వి.ఆర్. అండ్ ఎన్.ఆర్.వి. ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విశ్వవిద్యాలయంలో శుక్రవారం ఉచిత కంటి పరీక్షల శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ ఛాన్సలర్ డా.ఆర్. వెంకట రావు మాట్లాడుతూ విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది కంటి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. సంస్థ కంటి ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డా. ఎం. భార్గవ రావు మాట్లాడుతూ క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలని, మొబైల్ ఫోన్లు, కంప్యూటర్ల వినియోగంలో తగిన జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. సంస్థ కంటి ఆసుపత్రి మార్కెటింగ్ మేనేజర్ జి.సి.వి.ఆర్. స్వామి ఆధ్వర్యంలో వైద్య బృందం విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకేతర సిబ్బంది, స్థానిక ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి వైద్య సలహాలు, చికిత్స సూచనలు అందించింది. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఉపకులపతి డా. కె.ఆర్.ఎన్. సాంబశివరావు, రిజిస్ట్రార్ డా.బి.రామభద్రరావు, ప్రో వైస్ ఛాన్సలర్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

చివరి ఇంటి వరకు వీలైనంత త్వరగా విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలి

ప్రజాభూమి ప్రతినిధి అమరావతి

మురసు తుఫాన్ గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాలపై తీవ్ర ప్రభావం చూపింది. తుఫాన్ కారణంగా ఆయా జిల్లాల్లో సుమారు 7500 పైగా విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయి. దీంతో దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను పునరుద్ధరించేందుకు ఏపీసీపీడీసీఎల్ విద్యుత్ సిబ్బంది విస్తృతంగా మరమ్మతు పనులు చేపట్టారు. ఈ నేపథ్యంలో బాపట్ల జిల్లా పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి.పుల్లారెడ్డితో మురసు తుఫాన్ కారణంగా దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థ, చేపట్టిన పునరుద్ధరణ పనుల పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా, చివరి ఇంటి వరకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు.

కూచింపూడిలో డ్రైనేజీ సమస్యకు తక్షణ పరిష్కారం

- ప్రజారోగ్యానికి ప్రాధాన్యం
- డ్రైనేజీ మరమ్మతు పనులను దగ్గరుండి పర్యవేక్షించిన ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్



ప్రజాభూమి దెందులూరు

గ్రామాల పరిశుభ్రత, ప్రజారోగ్యమే తొలి ప్రాధాన్యమని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు.శుక్రవారం పెదవేగి మండలం కూచింపూడి గ్రామంలో డ్రైనేజీ మ్యాన్‌హోల్ నుంచి మురుగునీరు రోడ్డుపైకి ప్రవహిస్తున్న సమస్యను గుర్తించిన ఆయన వెంటనే స్పందించారు.జేసీబీ యంత్రం.పారిశుధ్య కార్మికులను రప్పించి మరమ్మతులు, పూడికతీత పనులు చేపట్టించారు.పనులు పూర్తయ్యే వరకు దగ్గరుండి పర్యవేక్షించారు.ఈ సందర్భంగా డ్రైనేజీల్లో ప్లాస్టిక్ బాటిళ్లు,కవర్లు వంటి వ్యర్థాలను వేయవద్దని గ్రామస్తులకు సూచించారు. గ్రామాల పరిశుభ్రతను కాపాడటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సమస్యను వెంటనే పరిష్కరించడంతో గ్రామస్థులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు,గ్రామస్థులు పాల్గొన్నారు.

కొత్తపేటలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఓట్ల లెక్కింపుకు ఏర్పాట్లు పూర్తి

- రెండు కేంద్రాల్లో ఏడు మండలాల ఓట్ల లెక్కింపు
- ఏర్పాట్లను పరిశీలించిన ఆర్డీఓ సత్యనారాయణ

ప్రజాభూమి ప్రతినిధి కొత్తపేట

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియకు కొత్తపేట రెవెన్యూ డివిజన్ పరిధిలో అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గంలోని నాలుగు మండలాలైన కొత్తపేట, ఆత్రేయపురం, ఆలమూరు, రావులపాలెం మండలాల ఓట్ల లెక్కింపు కొత్తపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించనున్నారు. అదేవిధంగా పి.గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గంలోని మూడు మండలాలైన పి.గన్నవరం, అంబాజీపేట, అయినవిల్లి మండలాల ఓట్ల లెక్కింపు కొత్తపేటలోని వి.కె.వి. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరగనుంది. ఈ మేరకు కొత్తపేట రెవెన్యూ డివిజనల్ అధికారి జి.వి.వి. సత్యనారాయణ శుక్రవారం



అధికారులతో కలిసి కౌంటింగ్ కేంద్రాలను సందర్శించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా, ప్రశాంతంగా, క్రమబద్ధంగా నిర్వహించేం దుకు చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రోడ్లు, భవనాల శాఖ అధికారులు, కొత్తపేట ఎంపీడీఓ, డిప్యూటీ ఎంపీడీఓలు, కొత్తపేట మండల సర్వేయర్, అంబాజీపేట మండల సర్వేయర్, కొత్తపేట ఎంఆర్ఐ తదితరులు పాల్గొన్నారు.



శ్రీ ధర్మశాస్త్ర స్వామి దారు ధ్వజస్తంభ గ్రామోత్సవం

ప్రజా భూమి ప్రతినిధి, ఆగిరిపల్లి



ఆగిరిపల్లి గ్రామంలోని దుగ్గిరాల బాలరావమ్మ అమ్మవారి దేవస్థానంలో గణేష్ స్వామి ఆధ్వర్యంలో నిర్మితమవుతున్న శ్రీ ధర్మశాస్త్ర స్వామి ఆలయ దారు ధ్వజస్తంభాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. ఈ గ్రామోత్సవంలో అయ్యప్ప స్వాములు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ నెల 13న విశేష పూజలు, 14న దారు ధ్వజస్తంభ ప్రతిష్ఠ, అనంతరం అయ్యప్ప పడిపూజ నిర్వహించనున్నట్లు గణేష్ స్వామి తెలిపారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం కూడా ఏర్పాటు చేసినట్లు పేర్కొంటూ, పూజా కార్యక్రమాలు, ప్రతిష్ఠా మహోత్సవం, అన్నదాన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ప్రజాభూమి

అనంతపురం,శ్రీసత్యసాయి జిల్లా 6

శనివారం 07 నవంబరు 2026

అనంతపురం అభివృద్ధే లక్ష్యంగా పనిచేయండి

- ప్రజల నమ్మకాన్ని మరింతగా నిలబెట్టుకోండి
- డివిజన్ స్థాయిలో పార్టీ మరింత బలోపేతం కావాలి
- అవినీతి వ్యవహారాలు, వివాదాలకు దూరంగా ఉండండి
- పదవులంటే అలంకారం కాదు.. సేవ చేసే అవకాశం
- వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి సూచన





ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం

అనంతపురం నగర అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగాలని వైసీపీ జిల్లా అధ్యక్షులు, అనంతపురం నియోజకవర్గ నమన్వయకర్త అనంత వెంకటరామిరెడ్డి సూచించారు. శుక్రవారం వైసీపీ జిల్లా కార్యాలయంలో కార్పొరేషన్ మేయర్‌గా ఎన్నికైన రమేష్‌గౌడ్‌తో పాటు కార్పొరేటర్లుగా గెలిచిన, ఓడిపోయిన అభ్యర్థులు, స్థానిక నేతలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముందుగా దివంగత ముఖ్యమంతి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా అనంత మాట్లాడుతూ నగర పాలక సంస్థ ఎన్నికల్లో వైసీపీ విజయం సాధించడం వెనుక ప్రతి ఒక్కరి కష్టం ఉందన్నారు. అధికార పార్టీ నేతలు దాడులు, దౌర్జన్యాలు చేసినా భయపడలేదన్నారు. ప్రజలు ఎంతో నమ్మకంతో గెలిపించారని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవాలన్నారు. డివిజన్ స్థాయిలో పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని సూచించారు. కొన్ని డివిజన్లలో కార్పొరేటర్ అభ్యర్థులు స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారని తెలిపారు. ఓటమికి ఎవరూ చింతించాల్సిన అవసరం లేదని, మనమంతా బలంగా నిలబడడం వల్లే మేయర్ స్థానాన్ని గెలుచుకోగలిగామని తెలిపారు. కార్పొరేషన్ ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీలను నిలబెట్టుకునే దిశగా అడుగులు వేయాలని సూచించారు. ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన వారంతా ప్రజలకు మరింత చేరువ కావాలని అన్నారు.

అవినీతికి తావులేకుండా అనంతపురం నగరాన్ని ప్రశాంతంగా ఉంచడమే మన ముందున్న ప్రథమ కర్తవ్యమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నగరంలో దాడులు, దౌర్జన్యాలు, భూకబ్జాలు ఎక్కువయ్యాయన్నారు. ప్రజలు అన్నింటినీ గమనించే వైసీపీకి పట్టం కట్టిన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. అందరూ నమన్వయంతో పనిచేసి అనంతపురం కార్పొరేషన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని సూచించారు. ప్రజలకు సేవ చేసే అవకాశం అందరికీ రాదని, వచ్చిన అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. మేయర్, కార్పొరేటర్ పదవులు అంటే అధికారం చలాయించడానికి కాదని, ప్రజలకు సేవ చేసే అవకాశాలు అని తెలియజేశారు.

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల కోసమే ఆలోచిస్తుందని తెలిపారు. ఈ ఎన్నికల్లో ఓడిపోయిన అభ్యర్థులు కూడా ప్రజలకు అందుబాటులో ఉండి వీలైంత వరకు డివిజన్ స్థాయిలో నమన్వయ పరిష్కారానికి చొరవ చూపాలని సూచించారు. మేయర్‌గా గెలిచిన రమేష్ గౌడ్ మాట్లాడుతూ అందరూ కలిసికట్టుగా పని చేసి అనంతపురం నగరాన్ని సుందరమైన, స్వచ్ఛమైన నగరంగా తీర్చిదిద్దుదామన్నారు. అవినీతి రహిత పాలన అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుదామని తెలిపారు. తనను మేయర్‌గా గెలిపించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు.

కళాకారుడు మినగల్లు సుధాకర్‌కు ఘన నివాళి



ప్రజాభూమి, హిందూపురం టౌన్

రాష్ట్రస్థాయి కళాకారుడిగా గుర్తింపు పొందిన కడప జిల్లా మినగల్లు గ్రామానికి చెందిన మినగల్లు సుధాకర్ మృతి కళారంగానికి తీరని లోటని హిందూపురం కళాకారులు పేర్కొన్నారు. ఆయన మరణాన్ని జీర్ణించుకోలేకపోతున్నట్లు, ఆయనతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ కన్నీటి నివాళులర్పించారు. శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద ఉన్న కళాకారుల కార్యాలయంలో సుధాకర్ సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సుధాకర్ తన కళా ప్రదర్శనలతో అనేక అవార్డులు, గుర్తింపులు పొందారని తెలిపారు. ముఖ్యంగా సత్యహరిశ్చంద్ర నాటకంలో వారణాసి హరిశ్చంద్రుడి పాత్రను అద్భుతంగా పోషించి రాష్ట్రస్థాయిలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని కొనియాడారు. ఎన్నో సంవత్సరాలుగా కళారంగానికి సేవలందించిన ఆయన అకాల మరణం కళాకారులందరినీ తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. ఈ సందర్భంగా కళాకారులు మాట్లాడుతూ, కళాకారులు తమ జీవితాలను కళారంగానికే అంకితం చేస్తున్నప్పటికీ, వయసు పైబడిన సమయంలోనూ, అనారోగ్య పరిస్థితుల్లోనూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మినగల్లు సుధాకర్ కుటుంబాన్ని ఆదుకోవడంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కళాకారుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. కళాకారులకు ఆర్థిక భరోసా కల్పించేలా సంక్షేమ పథకాలు, కుటుంబాలకు సహాయ కార్యక్రమాలు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో హార్మోనిస్టు ఏ. రవికుమార్, భూమయ్య, గారిపల్లి ఆదినారాయణ, హరికథా కళాకారుడు భగవతదాస్, ఆదిమూల్యం, సూర్యనారాయణ, కగ్గల పూల లక్ష్మమ్మ, మహిళా నాటక కళాకారిణి మంజుల, శీను తదితరులు పాల్గొన్నారు.

జనసేనలోకి 50 మంది యువకుల చేరిక

-నవీన్ నిశ్చల్ సమక్షంలో పార్టీలో చేరిన వీవర్స్ కాలనీ యువత



ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం నియోజకవర్గంలో జనసేన పార్టీ బలోపేతం దిశగా మరో ముందడుగు పడింది. హిందూపురం రూరల్ మండలం కిరికెర పంచాయతీ పరిధిలోని వీవర్స్ కాలనీకి చెందిన 50 మంది యువకులు జనసేన పార్టీలో చేరారు. శుక్రవారం హిందూపురం పార్లమెంట్ స్థానిక సంస్థల సమన్వయకర్త, జనసేన నేత నవీన్ నిశ్చల్ సమక్షంలో ఈ చేరికల కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నవీన్ నిశ్చల్ మాట్లాడుతూ జనసేన పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్న యువతకు స్వాగతం పలికారు. పార్టీ పట్ల నిబద్ధతతో, క్రమశిక్షణతో పనిచేసే ప్రతి ఒక్కరికీ రాబోయే రోజుల్లో తగిన గుర్తింపు, మంచి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. యువత రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలు, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ చంద్రశేఖర్, నిమ్మకాయల రాము, పార్టీలో చేరిన వారిలో కిష్టప్ప, ప్రసాద్, గంగాధర్, రాము, కిరణ్, హనుమంత్, రమేష్, రాజు, శివ, సునీల్, గణేష్ తదితరులు ఉన్నారు.

స్వర్ణ పతకం సాధించిన షేక్ షాహిదాను ఘనంగా సన్మానం చేసిన: ఎంపీ అంబికా

ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం



ఆసియా స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ ఛాంపియన్‌షిప్‌లో భారత మహిళా జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించి స్వర్ణ పతకం సాధించిన ఆంధ్రప్రదేశ్, అనంతపురం జిల్లాకు చెందిన క్రీడాకారిణి షేక్ షాహిదాను అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ శుక్రవారం ఘనంగా సన్మానించారు. అంతర్జాతీయ స్థాయిలో అద్భుత ప్రతిభ కనబరిచి దేశానికి, మన అనంతపురం జిల్లాకు గర్వకారణంగా నిలిచిన షాహిదాను అభినందించడం ఎంతో సంతోషంగా ఉంది. భవిష్యత్తులో ఆమె పాల్గొనే టోర్నమెంట్లకు నా వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చాను. మరిన్ని విజయాలు సాధిస్తూ క్రీడారంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాను. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ టెన్నిస్ బాల్ క్రికెట్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.డి. ప్రసాద్, జిల్లా కార్యదర్శి అన్వర్ భాషా, ప్రతినిధులు, కోచ్‌లు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

దీపావళి బాణసంచా దుకాణాల ఏర్పాట్లలో

33 దుకాణాలకు రెవెన్యూ అధికారులు అనుమతులు మంజూరు

ప్రజాభూమి, హిందూపురం టౌన్

స్థానిక సంస్థల ఎన్నికల విధుల్లో అధికారులు నిమగ్నం కావడంతో దీపావళి బాణసంచా దుకాణాల ఏర్పాట్లలో జాప్యం నెలకొంది. ఎంజీఎం పాఠశాల ఆవరణలో 33 దుకాణాలకు రెవెన్యూ అధికారులు అనుమతులు మంజూరు చేశారు. మున్సిపల్, అగ్నిమాపక శాఖల భద్రతా చర్యలపై ముందస్తు పర్యవేక్షణ కొరవడిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖలు సమన్వయంతో దుకాణాలను తనిఖీ చేసి, అగ్నిప్రమాద నివారణ చర్యలు పక్కాగా అమలు చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

జడ్పీటిసి, ఎంపిటిసి ఎన్నికల కౌంటింగ్ కోసం సర్వం సిద్ధం..

-: జిల్లాలో 3 రెవెన్యూ డివిజన్లలో 7 కేంద్రాల్లో జరగనున్న కౌంటింగ్..- : కౌంటింగ్ కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లు..

-: కౌంటింగ్ పై జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్ ఆదేశాలు..





ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం

స్థానిక సంస్థల ఎన్నికలు-2026లో భాగంగా జడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికల కౌంటింగ్ కోసం సర్వం సిద్ధం చేయడం జరిగింది. జిల్లాలో 3 రెవెన్యూ డివిజన్లలో 7 కేంద్రాల్లో జరగనున్న కౌంటింగ్ జరగనుంది. జిల్లా యంత్రంగా ఆధ్వర్యంలో కౌంటింగ్ కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టడం జరిగింది. కౌంటింగ్ కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు అత్యంత పారదర్శకంగా, శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్ ఆదేశాలు జారీ చేశారు. 3 రెవెన్యూ డివిజన్లు.. 7 కౌంటింగ్ కేంద్రాలు జిల్లాలో జడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికల కౌంటింగ్ ను అనంతపురం, గుంతకల్లు, కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్ లలో మొత్తం 7 కేంద్రాల్లో చేపట్టన్నారు. అనంతపురం రెవెన్యూ డివిజన్ లో 4 కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరగగా, వాటిల్లో 11 మండలాలకు సంబంధించి ఓట్ల లెక్కింపు చేయనున్నారు. 1. అనంతపురం నగరంలోని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కాలేజ్ లో ఏర్పాటుచేసిన కౌంటింగ్ కేంద్రంలో అనంతపురం, ఆత్మకూరు, బుక్కరాయసముద్రం, రాప్తాడు సింగనమల మండలాలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు చేపట్టన్నారు. 2. అనంతపురం జేఎన్టీయూ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రంలో నార్పల, గార్లదిన్నె మండలాలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. 3. అనంతపురం జేఎన్టీయూ కళాశాలలో ఏర్పాటుచేసిన కౌంటింగ్ కేంద్రంలో పుట్లూరు, ఎల్లనూరు మండలాలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు చేయనున్నారు. 4. తాడిపత్రి పట్టణంలోని గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రంలో తాడిపత్రి, పెద్దపప్పూరు మండలాలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు జరగనుంది. కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్ లో 3 కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరగగా, వాటిల్లో 11 మండలాలకు సంబంధించి ఓట్ల లెక్కింపు చేయనున్నారు. 1. కళ్యాణదుర్గం పట్టణంలోని కరణం చిక్కప్ప హైస్కూల్లో కంబదూరు, సెట్టూరు, గుమ్మగట్ట, కుందుర్పి మండలాలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు చేయనున్నారు. అందులో కంబదూరు మండలం ఓట్ల లెక్కింపు 41, 42 రూమ్ నంబర్లలో, సెట్టూరు మండలం ఓట్ల లెక్కింపు 45, 46 రూమ్ నంబర్లలో, గుమ్మగట్ట మండలం ఓట్ల లెక్కింపు 43, 44 రూమ్ నంబర్లలో, కుందుర్పి మండలానికి సంబంధించిన ఓట్ల లెక్కింపు 32, 34 రూమ్ నెంబర్లలో జరగనుంది. 2. కళ్యాణదుర్గం పట్టణంలోని గవర్నమెంట్ జూనియర్ కళాశాలలో కళ్యాణదుర్గం, బెలుగుప్ప, బ్రహ్మసముద్రం మండలాలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు జరగనుంది. కళ్యాణదుర్గం మండలానికి సంబంధించి 7, 6 రూమ్ నంబర్లలో, బెలుగుప్ప మండలం ఓట్ల లెక్కింపు 2, 5 రూమ్ నంబర్లలో, బ్రహ్మసముద్రం మండలానికి సంబంధించి 13, 12(మొదటి అంతస్తు) రూమ్ నంబర్లలో జరగనుంది. 3. కళ్యాణదుర్గంలోని ఎస్విడీఎం గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో బొమ్మనహాల్, డి.హీరేహాల్, రాయదుర్గం, కనేకల్ మండలాలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు చేయనున్నారు. బొమ్మనహాల్ మండలానికి సంబంధించి 24, 25 రూమ్ నంబర్లలో, డి.హీరేహాల్ మండలంకు సంబంధించి రూమ్ నంబర్లు 26, సెమినార్ హాల్ లో, రాయదుర్గం మండలం ఓట్ల లెక్కింపు రూమ్ నెంబర్ 27, సెమినార్ హాల్ లో, కనేకల్ మండలానికి సంబంధించి 30, 31 రూమ్ నంబర్లలో కౌంటింగ్ జరగనుంది. గుంతకల్లు రెవెన్యూ డివిజన్‌లో 4 కౌంటింగ్ కేంద్రాలు.. గుంతకల్లు రెవెన్యూ డివిజన్ లో 4 కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరగగా, అందులో 9 మండలాలకు సంబంధించిన కౌంటింగ్ ప్రక్రియ చేపట్టనున్నారు. 1. గుంతకల్లు పట్టణంలోని ఎస్కేపి గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో గుత్తి, యాడికి, గుంతకల్లు, పెద్దవడుగూరు, పామిడి మండలాలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు జరగనుంది. 2. ఉరవకొండ ఎస్.కె గవర్నమెంట్ జూనియర్ కళాశాలలో విడపనకల్లు మండలానికి సంబంధించిన కౌంటింగ్ జరగనుంది. 3. ఉరవకొండ గవర్నమెంట్ జూనియర్ కళాశాలలో ఉరవకొండ, కూడేరు మండలాలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు చేపట్టడం జరుగుతుంది. 4. ఉరవకొండ పట్టణంలోని శ్రీకరిబసవన్న స్వామి హైస్కూల్ లో వజ్రకరూరు మండలానికి సంబంధించిన కౌంటింగ్ చేపట్టనున్నారు. జడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ నిష్పక్షపాతంగా జరిగేలా కౌంటింగ్ కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ అమలు చేస్తూ మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. గుర్తింపు కార్డులు ఉన్న ఎన్నికల ఏజెంట్లు, సిబ్బందిని మాత్రమే ప్రాంగణాల్లోకి అనుమతిస్తారు. నిరంతర విద్యుత్ సరఫరా, తాగునీటి సదుపాయం, అత్యవసర వైద్య శిబిరాలను సిద్ధంగా ఉంచాలని అన్ని విభాగాల అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఆయా కౌంటింగ్ కేంద్రాలలో పకడ్బందీ ఏర్పాట్లను పూర్తి చేయడం జరిగింది.

మున్సిపల్ వైస్ చైర్మన్ పదవి ముస్లింలకే కేటాయించాలి

-ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎమ్మెల్యే బాలకృష్ణకు ముస్లిం ఐక్యవేదిక విజ్ఞప్తి



ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం మున్సిపల్ వైస్ చైర్మన్ పదవిని ముస్లిం సామాజిక వర్గానికి చెందిన కౌన్సిలర్లలో ఒకరికి కేటాయించి సామాజిక న్యాయం చేయాలని ముస్లిం ఐక్యవేదిక ప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వానికి, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు విజ్ఞప్తి చేశారు. పట్టణంలో ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న సామాజిక సమతుల్యత సంప్రదాయాన్ని ఈసారి కూడా కొనసాగించాలని కోరారు. శుక్రవారం పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో ముస్లిం ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ, ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో వివిధ రాజకీయ పార్టీల నుంచి ముస్లిం సామాజిక వర్గానికి చెందిన పలువురు అభ్యర్థులు కౌన్సిలర్లుగా విజయం సాధించారని తెలిపారు. మరికొందరు స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారని పేర్కొన్నారు. విజయం సాధించిన ముస్లిం కౌన్సిలర్లందరికీ అభినందనలు తెలియజేశారు. హిందూపురం పట్టణంలో సుమారు 38 వేల మంది ముస్లిం ఓటర్లు ఉండగా, ఈసారి దాదాపు 18 మంది ముస్లిం సామాజిక వర్గానికి చెందిన కౌన్సిలర్లు విజయం సాధించడం తమ వర్గానికి ఉన్న ప్రజాప్రాతినిధ్యాన్ని తెలియజేస్తోందన్నారు. హిందూపురం మున్సిపాలిటీలో చైర్మన్, వైస్ చైర్మన్ పదవుల కేటాయింపులో సామాజిక సమతుల్యతకు ప్రాధాన్యత ఇవ్వడం ఆనవాయితీగా వస్తోందని వివరించారు. చైర్మన్ పదవి ముస్లిం సామాజిక వర్గానికి దక్కిన సందర్భాల్లో ముస్లిమేతర సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి వైస్ చైర్మన్ అవకాశం కల్పించడం, ముస్లిమేతరులకు చైర్మన్ పదవి దక్కినప్పుడు ముస్లిం సామాజిక వర్గానికి చెందిన కౌన్సిలర్‌ను వైస్ చైర్మన్‌గా ఎన్నుకోవడం సంప్రదాయంగా కొనసాగుతోందన్నారు. ప్రస్తుతం మున్సిపల్ చైర్మన్ పదవి ముస్లిమేతర సామాజిక వర్గానికి దక్కిన నేపథ్యంలో ఈ సంప్రదాయం ప్రకారం వైస్ చైర్మన్ పదవిని ముస్లిం సామాజిక వర్గానికి కేటాయించాలని కోరారు. తెలుగుదేశం, వైఎస్సార్ కాంగ్రెస్, జనసేన పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులుగా విజయం సాధించిన ముస్లిం కౌన్సిలర్లలో సమర్థుడైన వ్యక్తిని ఎంపిక చేసి వైస్ చైర్మన్‌గా అవకాశం కల్పించవచ్చని సూచించారు. పార్టీలకు అతీతంగా ముస్లిం సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా సామాజిక న్యాయానికి పెద్దపీట వేసినట్లవుతుందని అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా దృష్టి సారించాలని, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ చొరవ తీసుకొని ముస్లిం కౌన్సిలర్లలో ఒకరికి వైస్ చైర్మన్ పదవి దక్కేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ముస్లిం సామాజిక వర్గం ఆకాంక్షలను గౌరవించి తగిన ప్రాధాన్యత కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో ముస్లిం ఐక్యవేదిక నాయకులు ఉమర్ ఫారూఖ్ ఖాన్, ఫయాజ్, నహీద్, ఉబైదుల్లా, హుస్సేన్, షౌకత్, తన్వీర్, అల్తాఫ్, వసీఉల్లా పాల్గొన్నారు.

జెడ్పిటిసి ఎంపీటీసీ ఎన్నికల కౌంటింగ్ నేడు

కూటమి ప్రభుత్వం గెలుపు లాంఛనం

ప్రజాభూమి, పుట్లూరు.

పుట్లూరు మండలంలో పోటీ చేసిన జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థుల కౌంటింగ్ శనివారం నిర్వహించడం జరుగుతున్నది. పుట్లూరు మండలంలో ప్రశాంత వాతావరణ కోసం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు కీలక నిర్ణయం తీసుకోవడం జరిగినది మండలంలో ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకూడదని ప్రజలు ఓటర్లు ప్రశాంతంగా ఉండాలని ఉద్దేశంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 11 ఎంపీటీసీ స్థానాలకు ఒక జడ్పిటిసి స్థానానికి సంబంధించి అభ్యర్థులు ఒక కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల జరుగుతున్న కొన్ని ఘటనలు దృష్ట్యా మండలంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకూడదని ఓటర్లను దృష్టిలో పెట్టుకొని తమ ఎన్నికల కార్యక్రమాల నుండిస్వచ్ఛందంగా తప్పుకోవడం జరిగినది. మాకు పదవులు ముఖ్యం కాదని ప్రజల ప్రశాంతత ముఖ్యమని ఎన్నికల ప్రశాంతంగా జరగాలనీ వైఎస్ఆర్సిపి పోటీ నుండి స్వచ్ఛందంగా తప్పుకోవడంతో కూటమి ప్రభుత్వం గెలుపు లాంఛనం కానుంది.

ప్రజాభూమి
వైఎస్ఆర్ కడప, శ్రీ అన్నమ్మయ్య 7
శనివారం 07 నవంబరు 2026

ఐదు రెవెన్యూ డివిజన్లలో కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటు .....

జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి

ప్రజాభూమి ప్రతినిధి,కడప : జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించిన కౌంటింగ్ ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు. ఇందులో భాగంగా జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల కు సంబంధించి ఐదు రెవెన్యూ డివిజన్లలో కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. బద్వేల్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని బి.కోడూరు, మైదుకూరు, శ్రీ అవదూత కాశీ నాయన, బి. మఠం, గోపవరం, కలసపాడు, పోరుమామిళ్ల మండలాలకు సంబంధించి బద్వేల్ లోని అంబేద్కర్ గురుకులాన్ని కేంద్రంలో కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జమ్మలమడుగు రెవెన్యూ డివిజన్ పరిధిలోని మైలవరం, దువ్వూరు, పెద్దముడియం, ప్రొద్దుటూరు మండలాలకు సంబంధించి జమ్మల మడుగులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కడప రెవెన్యూ డివిజన్ పరిధిలోని సిద్ధవటం, ఒంటిమిట్ట మండలాలకు సంబంధించి కడపలోని మౌలానా ఆజాద్ ఉర్దూ విశ్వవిద్యాలయం పాలటెక్నిక్ కళాశాలలో కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పులివెందుల రెవెన్యూ డివిజన్ పరిధిలోని లింగాల, పులివెందుల, వేముల, వేంపల్లె మండలాలకు సంబంధించి పులివెందులలోని రమనప్ప సత్రం, జడ్ .పి హై స్కూల్ లో కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాజంపేట రెవెన్యూ డివిజన్ పరిధిలోని నందలూరు, రాజంపేట, టి.సుండుపల్లి, వీరబల్లి మండలాలకు సంబంధించి రాజంపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.కౌంటింగ్ నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని, సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు



బాలికల భద్రత గాలికి.. అధికారుల నిర్లక్ష్యం ఏ స్థాయిలో?

నాలుగు ఐదు నెలలుగా మరమ్మతులకు నోచుకోని కస్తూర్బా పాఠశాల కాంపౌండ్ వాల్ ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది?

ప్రజాభూమి పోరుమామిళ్ల :
కడప జిల్లా కలసపాడు మండలం పెండ్లిమర్రి నమీవంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. పాఠశాల ఆవరణకు రక్షణగా ఉండాల్సిన కాంపౌండ్ వాల్ కూలిపోయి దాదాపు నాలుగు నుంచి ఐదు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు మరమ్మతులు చేపట్టకపోవడం సంబంధిత అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.
బాలికల భద్రతపై ఇంత నిర్లక్ష్యమా?
బాలికలు విద్యనభ్యసించే వసతి విద్యాలయాల్లో భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన బాధ్యత పాఠశాల యాజమాన్యంతో పాటు సంబంధిత అధికారులపై ఉంది. కాంపౌండ్ వాల్ కూలిపోయి నెలలు గడుస్తున్నా పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. పాఠశాల ఆవరణకు రక్షణ లేకపోవడంతో విద్యార్థినుల భద్రతపై తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొనే పరిస్థితి ఉంది. ఇటీవల రాప్తాడు పాఠశాలలో చోటు చేసుకున్న బాలికలపై దాడి ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపిన నేపథ్యంలోనైనా విద్యాశాఖ అధికారులు అప్రమత్తం కావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అన్ని సదుపాయాలు ఉన్న పాఠశాలల్లోనే ఇలాంటి దారుణ ఘటనలు చోటుచేసుకుంటున్నప్పుడు, కనీసం కాంపౌండ్ వాల్ కూడా సరిగా లేని విద్యాలయాల్లో బాలికల భద్రతకు ఎవరు బాధ్యత వహిస్తారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.
అధికారులు స్పందించకపోతే బాధ్యత ఎవరిది?
ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగిన తర్వాత హడావుడి చేయడం కంటే ముందుగానే నివారణ చర్యలు చేపట్టడం అధికారుల బాధ్యత. ఇప్పటికైనా నిర్లక్ష్యాన్ని వీడి పాఠశాల యాజమాన్యం, విద్యాశాఖ ఉన్నతాధికారులు, సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు తక్షణమే స్పందించాలి. కూలిపోయిన కాంపౌండ్ వాల్‌కు వెంటనే మరమ్మతులు చేపట్టి పటిష్టమైన రక్షణ గోడ నిర్మించాలని ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ సభ్యులు ఫణి రావు. ప్రవీణ్. రాజు. సుహాసిని. రామకోటి డిమాండ్ చేస్తున్నారు. బాలికల భద్రత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదు. ఏదైనా ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కాదు.. ప్రమాదం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి. విద్యార్థినుల భద్రతను దృష్టిలో ఉంచుకొని అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.



స్నేహిత అమృత హస్తం భవనానికి అరవై ఎనిమిది వేల విలువైన పెయింటింగ్ సామాగ్రి వితరణ

-సేవా కార్యక్రమాలకు దాతల సహకారం అభినందనీయం : అధ్యక్షులు రాజు

ప్రజాభూమి, పులివెందుల
స్నేహిత అమృత హస్తం సేవాసమితి నూతన భవన నిర్మాణానికి దాతలు సహాయ సహకారాలు అందించడం అభినందనీయమని సేవాసమితి అధ్యక్షులు రాజు పేర్కొన్నారు.లింగాల మండలం పార్నవల్లి గ్రామానికి చెందిన మోదువల్లి వెంకటప్రసాద్ సేవాభావంతో ముందుకు వచ్చి, సుమారు అరవై ఎనిమిది వేల రూపాయల విలువైన పెయింటింగ్ సామాగ్రిని నూతన భవన నిర్మాణానికి వితరణగా అందజేశారు. పులివెందుల పట్టణంలోని జగనన్న కాలనీకి వెళ్లే నూరు అడుగుల రహదారి మార్గంలో సేవాసమితి ఆధ్వర్యంలో నూతన భవన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఈ భవనంలోని గ్రౌండ్ ఫ్లోర్‌కు అవసరమైన పెయింటింగ్ పనుల నిమిత్తం ఈ సామాగ్రిని శుక్రవారం నూతన భవనం వద్ద వెంకటప్రసాద్ స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు రాజు మాట్లాడుతూ సమాజంలో అవసరమైన వారికి సేవలు అందించాలనే సంకల్పంతో రెండు వేల పదిలో ప్రారంభమైన సేవాసమితి అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. గ్రామీణ విద్యార్థులకు ఉచిత విద్యా బోధన, నేత్రదాన అవగాహన, నేత్రసేకరణ కేంద్రం, యువతకు నైపుణ్య శిక్షణ వంటి కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించేందుకు నూతన భవన నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు.వెంకటప్రసాద్ అందించిన సామాగ్రి భవన నిర్మాణంలో మరో ముఖ్యమైన పనిని పూర్తి చేసేందుకు దోహదపడుతుందని, ఆయనకు సేవాసమితి తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ తమకు చేతనైన సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ ఓబుల్ రెడ్డి, శివరాం రెడ్డి, సేవాసమితి ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం సభ్యులు, సురేష్, శ్రీ రాజా కళా నిలయం డాన్స్ మాస్టర్ రాజా, బండారు రాజు, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.



ఎస్పీబీవిడి పాఠశాలలో ఘనంగా ముందస్తు దీపావళి సంబరాలు



ప్రజాభూమి, సిద్ధవటం: సిద్ధవటం మండలం మాధవరం--1 గ్రామపంచాయతీ పరిధిలోని పార్వతీపురం గ్రామంలో ఉన్న ఎస్పీబీవిడీ సభ ఎలిమెంటరీ హైస్కూల్‌లో శుక్రవారం ముందస్తు దీపావళి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల సంప్రదాయ వేషధారణలతో అలరించారు. దీపావళి పండుగ విశిష్టత, పండుగను సాంప్రదాయబద్ధంగా ఎలా జరుపుకోవాలి, దీపాల ప్రాధాన్యత, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలపై ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. పర్యావరణానికి హాని కలిగించే విధంగా కాకుండా సురక్షితంగా దీపావళి జరుపుకోవాలని సూచించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, వేషధారణలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మేరువ మధుసూదన్‌తో పాటు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొండచిలువను పట్టుకున్న మధుసూదన్ రెడ్డి

ఎక్కడ ఏ పాములు ఉన్నా వచ్చి పట్టుకుంటా

ప్రజాభూమి, పులివెందుల : సింహాద్రిపురం మండలం విదినంచెర్ల గ్రామంలో ఒక వ్యక్తి ఇంట్లో పాము ఉందని పాములు పట్టే నేర్పరి మధుసూదన్ రెడ్డికి వారు శరవాణి ద్వారా సమాచారం అందించారు.వెంటనే మధుసూదన్ రెడ్డి అక్కడికి చేరుకొని కోళ్ల గూటిలో కోడి, నాలుగు పిల్లలను తిని పడుకొని ఉన్న కొండచిలువను పట్టుకున్నారు. దానిని ఒక సంచిలో పెట్టుకొని కదిరి రోడ్డులోని నామాలగుడ్డు వెళ్లే అడవి ప్రాంతంలో ఫారెస్ట్ ఆఫీసర్ గోపాలకృష్ణ ఆదేశాల మేరకు వదిలిపెట్టినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గం చుట్టుపక్కల యాభై కిలోమీటర్ల దూరంలో ఏ గ్రామంలో ఏ పాములు ఉన్నా వచ్చి పట్టుకోవడం జరుగుతుందన్నారు. ఎక్కడ పాములు ఉన్నా 9866660195 ఫోన్ చేయాలన్నారు. ఎవరూ పామును చంపవద్దన్నారు.



నియోజకవర్గ స్థాయి స్టూడెంట్ అసెంబ్లీ విజేత హిమశ్రీ

నూట ఇరవై మార్కులతో ప్రథమ స్థానం... అమరావతి మాక్ అసెంబ్లీకి ఎంపిక



ప్రజాభూమి, పులివెందుల
రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అహోబిలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి స్టూడెంట్ అసెంబ్లీలో పులివెందుల బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎస్ హిమశ్రీ ప్రథమ స్థానంలో నిలిచింది.ఈ పోటీలో హిమశ్రీ నూట ఇరవై మార్కులు సాధించి విజేతగా నిలిచింది. గత సంవత్సరం జాతీయ ఉపకార వేతనాల పరీక్షలో జిల్లాలో ప్రథమ స్థానంలో నిలవడం విశేషం. స్టూడెంట్ అసెంబ్లీలో ద్వితీయ స్థానంలో అహోబిలాపురం విద్యార్థి ఆర్ అఖిల్, తృతీయ స్థానంలో అంకాలమ్మగూడూరు విద్యార్థిని ఏ యస్మిత నిలిచినట్లు నిర్వాహకులు రవిచంద్రారెడ్డి, సెల్వరాజ్ తెలిపారు. ఈ ముగ్గురు జిల్లా స్థాయిలో జరిగే ప్రత్యేక శిక్షణలో పాల్గొని, వీరిలో ఒకరు అమరావతిలో జరిగే మాక్ అసెంబ్లీలో పులివెందుల నియోజకవర్గ ఎమ్మెల్యేగా వ్యవహరించనున్నట్లు వారు వివరించారు. వీరి ఎంపిక పట్ల ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

చిరుధాన్యాల ఆహారంతో ఆరోగ్యం

- చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహార పదార్థాల ప్రదర్శన- ప్రిన్సిపాల్ డా. కె. ఉషశ్రీ



ప్రజాభూమి, వేంపల్లె
చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహార పదార్థాలను తీసుకోవడం వల్ల ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని స్థానిక పట్టణంలోని వైఎస్ఆర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. ఉషశ్రీ తెలిపారు. కళాశాలలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) యూనిట్లు ఆధ్వర్యంలో బీఆర్ఐసీఎస్--2026 సుస్థిర జీవనశైలి కార్యక్రమంలో భాగంగా మిల్లెట్ ఫుడ్ స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఉషశ్రీ మాట్లాడుతూ.. విద్యార్థులు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను అలవర్చుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు తోడ్పడే సుస్థిర జీవనశైలిని పాటించాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు తమ ఇళ్ల నుంచి చిరుధాన్యాలతో తయారు చేసిన వివిధ రకాల ఆహార పదార్థాలను తీసుకువచ్చి ఫుడ్ స్టాల్ ఏర్పాటు చేసి ప్రదర్శించారు. అధ్యాపకులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎ. కుమార్ రాజా, యూనిట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కె. జనార్ధన సమన్వయం చేశారు.

ప్రకృతి వ్యవసాయంతో భూసారానికి భరోసా

పంట కోత ప్రయోగంలో ఆశాజనక ఫలితం

పీఎండీఎస్ పొలంలో పంట కోత ప్రయోగం

ఐదు బై ఐదు మీటర్ల విస్తీర్ణంలో నలభై ఐదు కిలోల దిగుబడి



ప్రజాభూమి, పులివెందుల
వైఎస్ఆర్ కడప జిల్లా సింహాద్రిపురం మండలం లోమడ గ్రామానికి చెందిన రైతు పరమేశ్వరరెడ్డి సాగు చేస్తున్న మూడు ఎకరాల పీఎండీ ఎస్ పొలంలో పంట కోత ప్రయోగం నిర్వహించారు.వర్షాధారంగా సాగు చేస్తున్న ఈ పొలంలో సద్దా, ఆవాలు, నువ్వులను ప్రధాన పంటలుగా సాగు చేస్తున్నారు. పంట దిగుబడిని అంచనా వేసేందుకు నిర్వహించిన ఐదు బై ఐదు మీటర్ల విస్తీర్ణంలోని పంట కోత ప్రయోగంలో నలభై ఐదు కిలోల దిగుబడి నమోదైంది. ఈ ప్రయోగం ద్వారా పీఎండీఎస్ సాగు విధానంలో పంటల దిగుబడి సామర్థ్యాన్ని అంచనా వేశారు. ఈ కార్యక్రమంలో రైతు మాస్టర్ ట్రైనర్లు రామకృష్ణ, రిబిక పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతు పరమేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా భూమి ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు భూసారం పెరుగుతుందని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

వెలుగుపల్లిలో డ్రైనేజీ సమస్య.. దోమల బెడద



ప్రజాభూమి, సిద్ధవటం: సిద్ధవటం మండలం వెలుగుపల్లి గ్రామంలో డ్రైనేజీ కాలువలు మురుగునీటితో నిండిపోయి దుర్వాసన వెదజల్లుతున్నాయి. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలువలను శుభ్రం చేయకపోవడంతో దోమల బెడద పెరిగి, సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మురుసు తుఫాన్ ప్రభావంతో వాతావరణం ముసురుగా ఉండటంతో పాటు కాలువల్లో మురుగునీరు నిల్వ ఉండడం వల్ల దోమల లార్వా వృద్ధి చెందే అవకాశం ఉందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. పంచాయతీ అధికారులు వెంటనే డ్రైనేజీ కాలువలను శుభ్రం చేసి, బ్లీచింగ్ పౌడర్ తదితర పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. వ్యాధులు ప్రబలిన తర్వాత స్పందించకుండా ముందస్తు చర్యలు చేపట్టి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

శీతల గంగమ్మకు విశేష పూజలు



ప్రజాభూమి, సిద్ధవటం: మండలంలోని మాధవరం-1 పరిధిలోని పార్వతీపురం గ్రామంలో కడప--చెన్నై జాతీయ రహదారి సమీపంలో వెలసిన శ్రీ శీతల గంగమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ పూజారి రంగమ్మ మాట్లాడుతూ వేకువజామునే అమ్మవారి మూలవిరాట్‌కు జలాభిషేకం, కుంకుమార్చన, పంచామృతాభిషేకాలు నిర్వహించి అనంతరం నూతన పట్టు వస్త్రాలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించినట్లు తెలిపారు. అమ్మవారి దర్శనం కోసం పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రికి అమ్మవారి సన్నిధిలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ నిర్వాహకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

దోమల నివారణకు పరిశుభ్రత పాటించాలి



ప్రజాభూమి, సిద్ధవటం: దోమల నివారణకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, దోమలు కుట్టకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని మలేరియా నబ్‌యూనిట్ అధికారి ఇండ్ల సుబ్బరాయుడు సూచించారు. ప్రైడే డ్రై డే సందర్భంగా శుక్రవారం సిద్ధవటం మండలం వంతాటిపల్లిలో దోమల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, వారానికి ఒకసారి నీటి తొట్లలోని నీటిని తొలగించి కొత్త నీటిని నింపాలని సూచించారు. పాత టైర్లు, కూలర్లు, కొబ్బరి బోండాలు, ప్లాస్టిక్ గ్లాసులు తదితరాల్లో నీరు నిల్వ ఉంటే దోమల లార్వా వృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. రాత్రివేళ దోమల కాటు నుంచి రక్షణ కోసం తప్పనిసరిగా దోమతెరలు వినియోగించాలని తెలిపారు. జలుబు, దగ్గు, తలనొప్పి, విరేచనాలు వంటి లక్షణాలు ఉంటే సమీపంలోని ప్రభుత్వ వైద్యశాలను సంప్రదించి వైద్యుల సూచనలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీనరసమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ మౌలాలి, ఎంఎల్‌హెచ్‌పీ సంధ్య, ఆరోగ్య కార్యకర్తలు ఆదిలక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైరా ఎమ్మెల్యే కుమార్తె గాయత్రి - రామ్ నాయక్ నిశ్చితార్థం

హైదరాబాద్‌లో ఘనంగా వేడుకలు ... నూతన జంటను ఆశీర్వదించిన ప్రముఖులు

ప్రజాభూమి, పులివెందుల :
వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ కుమార్తె గాయత్రి - రామ్ నాయక్ ల నిశ్చితార్థ వేడుక హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని జూబ్లీ కన్వెన్షన్‌లో ఘనంగా జరిగింది.ఉదయం తొమ్మిది గంటల నలభై ఐదు నిమిషాలకు జరిగిన ఈ వేడుకకు కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై నూతన జంటను ఆశీర్వదించారు.ఈ వేడుకలో పులివెందుల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ మూలంరెడ్డి ధ్రువకుమార్ రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హర్ష వర్ధన్ రెడ్డి, ఆలగడ్డ సూరి తదితరులు పాల్గొని నూతన జంటకు శుభాకాంక్షలు తెలియజేశారు.నూతన జంట వైవాహిక జీవితం సుఖ సంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. వేడుకకు విచ్చేసిన అతిథులందరికీ ఎమ్మెల్యే రాందాస్ నాయక్ కృతజ్ఞతలు తెలియజేశారు.



ప్రజాభూమి

తిరుపతి,చిత్తూరు 8

శనివారం 07 నవంబరు 2026

జాతీయ న్యాయ సేవల వారోత్సవాల్లో భాగంగా న్యాయ విజ్ఞాన సదస్సు, ర్యాలీ

ప్రజా భూమి ప్రతినిధి శ్రీ కాళహస్తి టౌన్



భారతదేశంలో ప్రతి సంవత్సరం నవంబర్ 9న నిర్వహించే జాతీయ న్యాయ సేవల దినోత్సవాన్ని పురస్కరించుకుని, నవంబర్ 2 నుంచి 10వ తేదీ వరకు నిర్వహిస్తున్న న్యాయ సేవల వారోత్సవాల్లో భాగంగా శ్రీకాళహస్తిలోని 11వ వార్డు సచివాలయం వద్ద న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. అనంతరం న్యాయవాదులు గరికిపాటి రమేష్, రాజేశ్వరరావు, పారా లీగల్ వాలంటీర్ల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి మున్సిపాలిటీకి చెందిన శానిటరీ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా న్యాయవాదులు గరికిపాటి రమేష్, రాజేశ్వరరావు మాట్లాడుతూ.. శానిటరీ కార్మికులకు కార్మిక చట్టాలు, రాజ్యాంగం కల్పించిన హక్కులపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. రాజ్యాంగం ప్రతి పౌరుడికి వివిధ రకాల హక్కులను కల్పించిందని, మహిళలకు సైతం పురుషులతో సమానంగా చట్టపరమైన హక్కులు ఉన్నాయని పేర్కొన్నారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ తమ హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉన్నప్పుడే సమాజంలో న్యాయం పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. న్యాయస్థానాలు ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటాయని, అందరికీ సమాన న్యాయం అందించడమే వాటి లక్ష్యమని తెలిపారు. మహిళలు ఎక్కడైనా ఇబ్బందులు లేదా సమస్యలు ఎదుర్కొంటే న్యాయస్థానాలను ఆశ్రయించి చట్టపరంగా తమ హక్కులను కాపాడుకోవచ్చని వివరించారు. న్యాయ సహాయం అవసరమైన బాధితులు టోల్ ఫ్రీ నంబర్ 15100 కు ఫోన్ చేసి సమాచారం అందిస్తే ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని తెలిపారు.అలాగే, శ్రీకాళహస్తి కోర్టు ప్రాంగణంలో ఉచిత న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయం అందుబాటులో ఉందని, ఆర్థిక ఇబ్బందులు లేదా ఇతర సమస్యల కారణంగా న్యాయ సహాయం పొందలేని వారు అక్కడి అధికారులను సంప్రదించవచ్చని సూచించారు. కోర్టు ద్వారా నియమితులైన పారా లీగల్ వాలంటీర్లకు తమ సమస్యలను తెలియజేస్తే, వారు వాటిని న్యాయ సేవాధికార సంస్థ దృష్టికి తీసుకెళ్లి తగిన న్యాయ సహాయం అందేలా చర్యలు తీసుకుంటారని న్యాయవాదులు వివరించారు.

చెన్నై వివాహ వేడుకలో కిలివేటి సంజీవయ్యకు ప్రముఖ నేతల అభినందనలు

నాయుడుపేట మున్సిపల్ విజయంపై సజ్జల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ తలసాని రఘురాం ప్రత్యేక అభినందనలు



ప్రజా భూమి ప్రతినిధి నాయుడుపేట..

తిరుపతి జిల్లా నాయుడుపేటలో రసవత్తంగా జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా వైఎస్ఆర్సిపి ఘన విజయం సాధించిన సందర్భంగా అభినందనలు తెలిపిన వైయస్ జగన్మోహన్ రెడ్డి .మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గారి సోదరుడు వైఎస్ అనిల్ రెడ్డి గారి కుమార్తె వివాహ వేడుక చెన్నైలో ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి కిలివేటి సంజీవయ్యను ఆప్యాయంగా పలకరించి ప్రత్యేకంగా అభినందించారు. ఇటీవల జరిగిన నాయుడుపేట మున్సిపల్ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సాధించిన విజయంపై, చైర్‌పర్సన్‌గా తంబిరెడ్డి రాజేశ్వరమ్మ ఎన్నికైన సందర్భంగా సంతోషం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేశారు. అదేవిధంగా ఎమ్మెల్సీ తలసాని రఘురాం సైతం కిలివేటి సంజీవయ్యను ఆత్మీయంగా పలకరించి నాయుడుపేట మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ సాధించిన విజయంపై అభినందనలు తెలిపారు. ఒక వివాహ వేడుకలో రాష్ట్రస్థాయి ప్రముఖ నాయకులు కిలివేటి సంజీవయ్యను ప్రత్యేకంగా పలకరించి నాయుడుపేట మున్సిపల్ విజయాన్ని ప్రస్తావిస్తూ అభినందనలు తెలియజేయడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా నిలిచింది.

శ్రీ కేదార గౌరీ వ్రతానికి విచ్చేసే 5,000 మంది భక్తులకు వాయనం సమర్పించేందుకు ఎన్‌డీఆర్ గ్రూప్ చైర్మన్ ఎన్. ఆదికేశవ రెడ్డి విరాళం

ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్

శ్రీకాళహస్తీశ్వరస్వామివారి దేవస్థానంలో నిర్వహించనున్న శ్రీ కేదార గౌరీ వ్రతానికి విచ్చేసే 5,000 మంది భక్తులకు వాయనం సమర్పించేందుకు ఎన్‌డీఆర్ గ్రూప్ చైర్మన్ ఎన్. ఆదికేశవ రెడ్డి దేవస్థానానికి అవసరమైన పూజా సామగ్రిని విరాళంగా అందజేశారు.

ఈ వాయనంలో భాగంగా భక్తులకు అందించేందుకు క్రింది వస్తువులను విరాళంగా సమర్పించారు.

1. పసుపు 2. కుంకుమ 3. జాకెట్ పీసులు 4. గాజులు
5. అరటిపండ్లు 6. తమలపాకులు 7. వక్కలు 8. విడిపూలు
9. పసుపు కొమ్ములు 10. పసుపు దారాలు ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు ఎన్. ఆదికేశవ రెడ్డి కి స్వామివారి దర్శన భాగ్యం కల్పించి, వేద పండితులచే ఆశీర్వచనం అందజేశారు.

ఈ కార్యక్రమంలో దేవస్థానం ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి, డొనేషన్ వింగ్ ఇన్‌ఛార్జి ఎం. నాగయ్య, శివ,మల్లికార్జున రావు తదితరులు పాల్గొన్నారు.



జిల్లావ్యాప్తంగా నేడు 8 కేంద్రాల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు పకడ్బందీ ఏర్పాట్లు

మధ్యాహ్న భోజన సమయానికి ఎంపీటీసీ ఫలితాలు..

సాయంత్రం 6--7 గంటలలోపు జెడ్పీటీసీ ఫలితాలు వెల్లడించేలా ప్రణాళిక -జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్





ప్రజాభూమి ప్రతినిధి తిరుపతి,

తిరుపతి జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి జిల్లాలోని 8 కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. శుక్రవారం స్థానిక శ్రీ గోవిందరాజస్వామి ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాలను జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, తిరుపతి ఆర్డీఓ రామ్మోహన్‌తో కలిసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా ఈ నెల 7న మొత్తం 8 కౌంటింగ్ కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. ఒక్కో కౌంటింగ్ కేంద్రంలో పరిసర ప్రాంతాలకు చెందిన నాలుగైదు మండలాల ఓట్ల లెక్కింపు జరిగేలా ప్రణాళిక రూపొందించామని పేర్కొన్నారు. ఒకే బ్యాలెట్ బాక్స్‌లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ బ్యాలెట్ పత్రాలు వేయడం వల్ల తొలుత వాటిని వేరు చేసి, అనంతరం జెడ్పీటీసీ బ్యాలెట్ పత్రాలను సంబంధిత సెగ్మెంట్ల వారీగా కలిపి, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఓట్ల లెక్కింపు ప్రక్రియను సమాంతరంగా నిర్వహించేలా చర్యలు చేపట్టినట్లు వివరించారు. ప్రతి కౌంటింగ్ హాల్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, కౌంటింగ్ ఏజెంట్ల కోసం ప్రత్యేక బారికేడింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనుమతి పొందిన కౌంటింగ్ ఏజెంట్లను మాత్రమే కేంద్రాల్లోకి అనుమతిస్తామని, పోటీలో ఉన్న అభ్యర్థి లేదా వారి ఏజెంట్‌లో ఒకరికి మాత్రమే ప్రధాన రిటర్నింగ్ అధికారి (ఆర్ఓ) టేబుల్ వద్దకు వెళ్లేందుకు అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు. తిరుపతిలోని శ్రీ గోవిందరాజస్వామి ఆర్ట్స్ కళాశాలలో తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాలతో పాటు నగరి నియోజకవర్గ పరిధిలోని పుత్తూరు, వడమాలపేట మండలాలకు సంబంధించిన మొత్తం 8 మండలాల ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ వివరించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించి మధ్యాహ్న భోజన సమయానికి ఎంపీటీసీ ఫలితాలు, సాయంత్రం 6 నుంచి 7 గంటలలోపు జెడ్పీటీసీ ఫలితాలు వెల్లడించేలా ప్రణాళిక రూపొందించామని తెలిపారు. మీడియా ప్రతినిధులకు కౌంటింగ్ కేంద్రాల వెలుపల ప్రత్యేక ఏర్పాట్లు చేశామని, ఎప్పటికప్పుడు ఎన్నికల ఫలితాల సమాచారాన్ని అందించేందుకు ప్రత్యేక స్క్రీన్, సమాచార షీట్లను అందుబాటులో ఉంచుతామని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ . . జిల్లావ్యాప్తంగా నిర్వహించనున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు పటిష్టమైన పోలీసు భద్రతా ఏర్పాట్లు చేపట్టామని తెలిపారు. అన్ని కౌంటింగ్ కేంద్రాల వద్ద తగినంత మంది పోలీసు సిబ్బందిని నియమించామని, కౌంటింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాల్లో నిరంతర నిఘా ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతి కలిగిన కౌంటింగ్ ఏజెంట్లు, ఎన్నికల సిబ్బంది, అధికారులను మాత్రమే అనుమతిస్తామని తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి, రాకపోకలను క్రమబద్ధీకరించడంతో పాటు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టామని వివరించారు. ఎన్నికల ఫలితాల అనంతరం ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నామని, ప్రజలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పోలీసులకు సహకరించి శాంతిభద్రతల పరిరక్షణకు తోడ్పడాలని జిల్లా ఎస్పీ కోరారు.ఈ కార్యక్రమంలో ఏ ఎస్ పి రవి మనోహరాచారి, తిరువతి అర్బన్ తహశీల్దార్ జనార్ధన్, ఎన్నికల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ వ్యర్థాలను తగ్గిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుకుందాం"





ప్రజాభూమి ప్రతినిధి తిరుపతి

తిరువతి జిల్లా రవాణా శాఖ అధికారి కార్యాలయంలో బ్రిక్స్ కార్యక్రమంలో భాగంగా ఆరవ రోజు అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా "ఎలక్ట్రానిక్ వ్యర్థాలను తగ్గిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుకుందాం" అనే అంశంపై రవాణా శాఖ అధికారులు వాహనదారులకు మరియు కార్యాలయ సిబ్బందికి కూడా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ మాట్లాడుతూ, ప్రస్తుత ఆధునిక కాలంలో మొబైల్ ఫోన్లు, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, ప్రింటర్లు, బ్యాటరీలు తదితర ఎలక్ట్రానిక్ పరికరాల వినియోగం గణనీయంగా పెరిగిందన్నారు. వాటిని ఉపయోగించిన అనంతరం నిర్లక్ష్యంగా పడవేయడం వల్ల నేల, నీరు, గాలి కలుషితమై మానవ ఆరోగ్యానికి, పర్యావరణానికి తీవ్ర నష్టం కలుగుతుందని తెలిపారు. అవసరం లేని ఎలక్ట్రానిక్ పరికరాలను కొనుగోలు చేయకుండా ఉండాలని, చిన్న చిన్న సమస్యలకే పనిచేసే పరికరాలను పారవేయకుండా మరమ్మతులు చేయించుకోవాలని సూచించారు. పాత ఎలక్ట్రానిక్ వస్తువులను సాధారణ చెత్తలో వేయకుండా అధీకృత ఈ-వ్యర్థాల సేకరణ కేంద్రాలకు మాత్రమే అందించాలని తెలిపారు. కార్యాలయాల్లో వినియోగించే కంప్యూటర్లు, ప్రింటర్లు, స్కానర్లు, యూపీఎస్‌లు, బ్యాటరీలను బాధ్యతాయుతంగా నిర్వహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మోటార్ వాహనాల తనిఖీ అధికారి అతికానాజ్ మాట్లాడుతూ, ప్రకృతి మన పూర్వీకుల నుంచి మనకు వచ్చిన ఆస్తి మాత్రమే కాదు, మన భవిష్యత్ తరాల నుంచి మనం తీసుకున్న అప్పు కూడా. దాన్ని కాపాడి తిరిగి అందించడం మనందరి బాధ్యత. మన పిల్లలకు ఆస్తులు ఇవ్వడం కంటే, వారు ఆరోగ్యంగా జీవించగలిగే స్వచ్ఛమైన భూమిని అందించడం గొప్ప వారసత్వం. భూమి మనది కాదు, భూమిపై జీవించే ప్రతి తరానిది."లిలి అని సందేశమిచ్చారు. అలాగే, లి"కొత్త పరికరాలను కొనుగోలు చేయడం అభివృద్ధి కాదు... ఉన్న వరికరాలను బాధ్యతాయుతంగా ఉపయోగించడం నిజమైన అభివృద్ధి." అని పేర్కొన్నారు. అనంతరం కార్యాలయ సిబ్బందితో ఈ-వ్యర్థాల తగ్గింపుపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మోటార్ వాహన తనిఖీ అధికారులు అతికానాజ్, స్వర్ణలత, పరిపాలన అధికారులు విజయకుమార్, విజయ ప్రశాంతి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చిత్తూరు జిల్లా ప్రజలకు, మీడియా మిత్రులకు, పోలీసులకు వారి కుటుంబాలకు దీపావళి పండగ శుభాకాంక్షలు. - జిల్లా ఎస్పీ తుషార్ డూడి

ఈ దీపావళి ప్రతి ఇంటికి సంతోషాలు, ఆనందాలు మరియు ఆరోగ్యాన్ని తీసుకురావాలని ఆశిస్తున్నాను.



ప్రజాభూమి ప్రతినిధి, చిత్తూరు

దీపావళి పండగ వెలుగుల పండగగా, ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. ఆనందం, శాంతి మరియు సౌఖ్యంతో పండగను జరుపుకోవాలని, భద్రతా నిబంధనలను పాటిస్తూ ఆత్మరక్షణతో సురక్షితంగా దీపావళిని ఆనందించమని సూచించారు. వటాకులు ఇబ్బందులకు దారి తీసేలా కాకుండా, శాంతియుతంగా పండగ జరుపుకోవాలని ఎస్పీ కోరారు. దీపావళి పండుగ సాంప్రదాయ విలువలు, మన సంస్కృతి, కుటుంబ పునాది విలువలను పునరుద్ధరించే పండుగగా, సమాజంలో ప్రేమ, సౌహార్దతకు, మరియు స్నేహబంధాలకు ప్రతీకగా నిలుస్తోంది. ఈ సందర్భంగా, మన కర్తవ్యాలను మరువకుండా, చట్టాన్ని పాటిస్తూ వండుగను ఆనందంగా జరువుకోవాలని తెలియజేసారు. జన సముదాయాలు భారీగా కూడే ఈ సమయంలో ప్రజలు, ప్రత్యేకించి పిల్లలు, వృద్ధులు జాగ్రత్తగా ఉండాలని ఎస్పీ గ విజ్ఞప్తి చేశారు. దీపావళి అంటే దీపాల కాంతితో కమ్మిన ఆనందం మాత్రమే కాకుండా, సురక్షితంగా జరుపుకోవాల్సిన బాధ్యత కూడా అని గుర్తు చేశారు. టపాసులు వాడేటప్పుడు సరైన జాగ్రత్తలు తీసుకోవాలని, పిల్లలు పెద్దల పర్యవేక్షణలోనే వీటిని ఉపయోగించాలన్నారు. చిత్తూరు జిల్లా పోలీసులు ప్రజలకు పండుగ సందర్భంలో మరింత సేవలు అందించడానికి సన్నద్ధంగా ఉన్నారని తెలిపారు. బందోబస్తు నిర్వహణతో, రాత్రి సమయంలో మధ్య జరుపుకోవాలని ఎస్పీ ఒక ప్రకటనలో సెక్యూరిటీని మరింత కట్టుదిట్టం చేస్తూ నిఘా తెలిపారు. పెంచినట్లు వివరించారు. పండుగ వేళ రోడ్లపై ట్రాఫిక్ నియంత్రణ, ప్రమాద నివారణ చర్యల ద్వారా ప్రజలకు సహకరించడానికి, పోలీసులు 24 గంటలు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. మీ పరిసర ప్రాంతంలో ఏవైనా అవాంచనీయ ఘటనలు చోటుచేసుకుంటే వెంటనే మీ దగ్గరలోని పోలీస్ స్టేషన్ లో లేదా డైల్ 112 లేదా పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ 9440900005 కు సమాచారం అందించాలని ప్రజలకు తెలియజేసారు. ఈ పండుగ సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని, పండుగను సుఖసంతోషాల

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న టీడీపీ నాయకులు రామ్మోహన్, కుల్లాయప్పని పరామర్శించిన: ఎంపీ అంబిక

ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం

అనంతపురం నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సింగనమల మండలం పెరవలి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు రామ్మోహన్, కుల్లాయప్పని అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబిక లక్ష్మీనారాయణ పరామర్శించారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ సాధారణ ఎన్నికల సందర్భంగా దొంగ ఓట్లను నివారించేందుకు ప్రయత్నించిన నేపథ్యంలో చోటుచేసుకున్న ఘర్షణలో వీరికి తలకు గాయాలు కావడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని, మెరుగైన వైద్యం అందించాలని సూచించాను. ప్రజాస్వామ్యబద్ధంగా, పారదర్శకంగా ఎన్నికలు జరగడం ప్రతి ఒక్కరి బాధ్యత. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలని కోరుతున్నాను. ఈ సందర్భంగా హాస్పిటల్ కమిటీ సభ్యులు నరసింహులు, వెంకటేశ్వర్ రెడ్డి, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రిటైర్డ్ పంచాయతీ అధికారికి తులసి రెడ్డి పరామర్శ

- నాగభూషణ్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిపై ఆరా



ప్రజాభూమి, వేంపల్లె

రిటైర్డ్ గ్రామ పంచాయతీ అధికారి నాగభూషణ్ రెడ్డిని రాజ్యసభ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ ఎన్. తులసి రెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఊపిరితిత్తులకు సంబంధించిన అనారోగ్య సమస్యతో కడపలోని శ్రీకర్ ఆసుపత్రిలో చికిత్స పొందిన నాగభూషణ్ రెడ్డి శుక్రవారం తన స్వగృహానికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న డాక్టర్ తులసి రెడ్డి కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన నివాసానికి వెళ్లి నాగభూషణ్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఆయన త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, అమర్నాథ్ రెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి, వెంకటేశు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభూమి
తిరుపతి,చిత్తూరు 9
శనివారం 07 నవంబరు 2026

జ్ఞానజ్యోతిని వెలిగించడమే దీపావళి

-పర్యావరణ హితమైన బాణసంచతోనే పండుగ జరుపుకోవాలి

-ముందస్తు దీపావళి వేడుకలలో పాఠశాల అధ్యక్షులు డాక్టర్ పి.ఎస్. శ్రీనివాసులు

ప్రజాభూమి, హిందూపురం టౌన్

అజ్ఞానమనే చీకటిని తొలగించి జ్ఞానమనే జ్యోతిని వెలిగించడమే నిజమైన దీపావళి అని పాంచజన్య పాఠశాల అధ్యక్షులు డాక్టర్ పి.ఎస్. శ్రీనివాసులు పేర్కొన్నారు. దీపావళి పండుగను పురస్కరించుకుని పట్టణంలోని పాంచజన్య పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం ముందస్తు దీపావళి వేడుకలను విద్యార్థుల హర్షధ్వానాలు, ఉత్సాహభరిత వాతావరణం నడుమ ఘనంగా నిర్వహించారు. పాఠశాల అధ్యక్షులు డాక్టర్ పి.ఎస్. శ్రీనివాసులు, కరస్పాండెంట్ డి.ఎస్. నందకుమార్ వేడుకలను ప్రారంభించడంతో పాఠశాల ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. ఈ సందర్భంగా అధ్యక్షులు డాక్టర్ పి.ఎస్. శ్రీనివాసులు మాట్లాడుతూ, దీపావళి కేవలం దీపాలు వెలిగించి టపాసులు కాల్చుకునే పండుగ మాత్రమే కాదని, చెడుపై మంచి సాధించిన విజయానికి, చీకటిపై వెలుగు సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పండుగ అని వివరించారు. ప్రతి ఒక్కరి జీవితంలో విద్య అనే వెలుగు ప్రసరించినప్పుడే సమాజంలో అజ్ఞానం, మూఢనమ్మకాలు తొలగిపోయి జ్ఞాన సమాజం ఆవిష్కృతం అవుతుందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు మంచి విలువలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతను అలవర్చుకోవాలని సూచించారు. పండుగ సంబరాల పేరుతో పర్యావరణానికి హాని కలిగించకూడదని, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పర్యావరణహితమైన గ్రీన్ బాణసంచ వినియోగించాలని సూచించారు. అధిక శబ్దం, పొగ వెలువరించే టపాసుల వల్ల చిన్నపిల్లలు, వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్నవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందన్నారు. భావితరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. చిన్నపిల్లలు పెద్దల పర్యవేక్షణలోనే టపాసులు కాల్చాలని, కాటన్ దుస్తులు ధరించాలని, టపాసులకు తగినంత దూరం పాటించాలని సూచించారు. ప్రమాదాలకు ఆస్కారం లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. టపాసుల వినియోగాన్ని తగ్గించి, దీపాలను ఎక్కువగా వెలిగించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడటంతో పాటు ఆనందంగా పండుగ జరుపుకోవచ్చని పేర్కొన్నారు. దీపాలను ఎక్కువగా వెలిగించి, టపాసులను తక్కువగా వినియోగించడం ద్వారా శబ్ద కాలుష్యాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గాయత్రి, ఏ.ఓ భాస్కర్, సూపరింటెండెంట్ విజయేంద్ర, సహాయ ప్రధానోపాధ్యాయులు శశికళ, సతీష్ కుమార్, షేక్ అబ్దుల్ రజాక్, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.





ఎన్నికల హడావుడిలో దీపావళి వెలుగులకు గ్రహణం....!

-అనుమతుల కోసం అధికారుల హడావుడి -33 దుకాణాలకు అనుమతులు

-భద్రతా ఏర్పాట్లపై దృష్టి సారించని-ఎన్నికల విధుల్లో అధికారులు-వ్యాపారులే చేసుకుంటున్న ఏర్పాట్లు

ప్రజాభూమి, హిందూపురం టౌన్

దీపావళి పండుగ వచ్చిందంటే చాలు బాణసంచా దుకాణాల వద్ద సందడి మొదలవుతుంది. ప్రజలకు అవసరమైన టపాసులను అందుబాటులో ఉంచేందుకు వ్యాపారులు ముందస్తుగానే ఏర్పాట్లు చేసుకుంటారు. అయితే ఈ ఏడాది హిందూపురంలో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా కనిపిస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో అధికార యంత్రాంగం పూర్తిగా నిమగ్నం కావడంతో దీపావళి బాణసంచా దుకాణాల ఏర్పాట్లపై నిర్లక్ష్యం నెలకొంది. ప్రతి ఏడాది వారం రోజుల ముందుగానే పూర్తి చేయాల్సిన అనుమతుల ప్రక్రియ ఈసారి పండుగకు కేవలం మూడు రోజుల ముందు ప్రారంభం కావడం, భద్రతా చర్యలపై సంబంధిత శాఖల నుంచి సరైన పర్యవేక్షణ లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. సాధారణంగా దీపావళి పండుగకు వారం రోజుల ముందుగానే రెవెన్యూ, మున్సిపల్, అగ్నిమాపక శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తారు. బాణసంచా వ్యాపారులందరినీ ఒకచోట సమావేశపరిచి దుకాణాల ఏర్పాటుకు సంబంధించిన నిబంధనలు వివరిస్తారు. వ్యాపారుల నుంచి దరఖాస్తులు స్వీకరించడంతో పాటు అవసరమైన పత్రాలు, జీఎస్టీ చెల్లింపుల వివరాలను పరిశీలిస్తారు. దుకాణాలు ఏర్పాటు చేసుకునే స్థలం, షెడ్ల నిర్మాణం, అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా పాటించాల్సిన నిబంధనలపై అవగాహన కల్పిస్తారు. అనంతరం అనుమతుల ప్రక్రియను పూర్తి చేసి వ్యాపారులకు ముందుగానే స్పష్టత ఇస్తారు. కానీ ఈ ఏడాది ఎన్నికల విధుల నేపథ్యంలో అధికారుల నుంచి అలాంటి ముందస్తు చర్యలు కనిపించలేదు. జీఎస్టీ తదితర అవసరమైన చెల్లింపులు పూర్తిచేసిన బాణసంచా వ్యాపారుల వివరాలను సైతం పండుగకు మూడు రోజుల ముందు మాత్రమే అనుమతుల మంజూరు కోసం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి పంపినట్లు తెలుస్తోంది. దీంతో అనుమతుల ప్రక్రియ ఎప్పుడు పూర్తవుతుందోనన్న సందిగ్ధత వ్యాపారుల్లో నెలకొంది. అనుమతులు వస్తాయనే ఆశతో పట్టణంలోని ఎంజీఎం పాఠశాల ఆవరణలో వ్యాపారులు తాత్కాలిక దుకాణాల ఏర్పాటుకు షెడ్ల నిర్మాణ పనులు ప్రారంభించారు. మొత్తం 33 మంది వ్యాపారులకు రెవెన్యూ అధికారులు వ్యాపారాలు నిర్వహించుకునేందుకు అనుమతులు మంజూరు చేశారు. అయితే రెవెన్యూ శాఖ అనుమతులు మంజూరు చేయడంతోనే అధికారుల బాధ్యత పూర్తయినట్లు కాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బాణసంచా దుకాణాల నిర్వహణలో మున్సిపల్, అగ్నిమాపక శాఖల పాత్ర కూడా ఎంతో కీలకం. రెవెన్యూ అనుమతులు పొందిన 33 మంది వ్యాపారులకు మున్సిపల్ అధికారులు ట్రేడ్ లైసెన్సులు మంజూరు చేయడంతో పాటు నిబంధనల ప్రకారం పన్నులు విధించాల్సి ఉంది. అగ్నిమాపక శాఖ అధికారులు ప్రతి దుకాణాన్ని పరిశీలించి అగ్నిప్రమాదాల నివారణకు అవసరమైన భద్రతా ప్రమాణాలను వివరించాలి. అగ్నిమాపక పరికరాల ఏర్పాటు, విద్యుత్ కనెక్షన్ల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, దుకాణాల మధ్య తగిన దూరం, అత్యవసర పరిస్థితుల్లో చేపట్టాల్సిన చర్యలపై వ్యాపారులకు అవగాహన కల్పించాలి. కానీ ఎన్నికల విధుల్లో అధికారులు నిమగ్నం కావడంతో ఈ కార్యక్రమాలపై ఆశించిన స్థాయిలో దృష్టి సారించలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పండుగకు ఒక్కరోజు మాత్రమే సమయం ఉండటంతో వ్యాపారులు ఇక ఆలస్యం చేయలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో తమకు తామే తాత్కాలిక షెడ్ల నిర్మాణాలు పూర్తి చేసుకుంటూ, ఒకరికొకరు సహకరించుకుంటూ దుకాణాల ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. అధికారుల నుంచి రావాల్సిన సూచనలు, భద్రతా మార్గదర్శకాలు సకాలంలో అందకపోవడంతో వ్యాపారులే పరస్పరం చర్చించుకుని అవసరమైన భద్రతా చర్యలు చేపడుతున్నారు. పండుగకు ముందే పూర్తికావాల్సిన ఏర్పాట్లు చివరి నిమిషానికి చేరడంతో వ్యాపారులపై అదనపు ఒత్తిడి పడుతోంది. ఇదిలా ఉండగా శుక్రవారం సాయంత్రం మున్సిపల్ సిబ్బంది ఎంజీఎం పాఠశాల ఆవరణలోని బాణసంచా దుకాణాల వద్దకు చేరుకుని వ్యాపారుల వివరాలను సేకరించారు. ట్రేడ్ లైసెన్సులు, పన్నుల విధింపునకు సంబంధించిన వివరాలను నమోదు చేసే పనిలో నిమగ్నమయ్యారు. పండుగకు కొద్ది గంటల ముందు మున్సిపల్ సిబ్బంది రంగంలోకి దిగడం చూస్తుంటే ముందస్తు ఏర్పాట్ల విషయంలో అధికారుల వ్రణాళిక ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ ప్రభుత్వ యంత్రాంగానికి అత్యంత ప్రాధాన్యమైన విధి అయినప్పటికీ, పండుగల సందర్భంగా ప్రజల భద్రతతో ముడివడిన అంశాలను విస్మరించకూడదని పట్టణ ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఎన్నికల విధుల కారణంగా అనుమతుల మంజూరులో జాప్యం జరిగిందని భావించినా, కనీసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి సంబంధిత శాఖల మధ్య సమన్వయం సాధించాల్సిన అవసరం ఉందని అంటున్నారు. ముఖ్యంగా బాణసంచా దుకాణాల్లో చిన్నపాటి నిర్లక్ష్యం కూడా భారీ ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉన్నందున భద్రతా ప్రమాణాల విషయంలో రాజీ పడకూడదు. పండుగ సమయంలో వేలాది మంది ప్రజలు బాణసంచా కొనుగోళ్ల కోసం ఎంజీఎం పాఠశాల ఆవరణకు వచ్చే అవకాశం ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో దుకాణాల వద్ద భద్రతా ఏర్పాట్లు పక్కాగా ఉన్నాయా? అగ్నిమాపక పరికరాలు అందుబాటులో ఉన్నాయా, అత్యవసర పరిస్థితుల్లో ప్రజలను సురక్షితంగా బయటకు పంపేందుకు తగిన మార్గాలు ఉన్నాయా అనే అంశాలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సిన అవసరం ఉంది. ఇప్పటికైనా రెవెన్యూ, మున్సిపల్, అగ్నిమాపక శాఖల అధికారులు సమన్వయంతో అన్ని దుకాణాలను తనిఖీ చేసి, నిబంధనల అమలును పర్యవేక్షించాలి. ఎన్నికల హడావుడి మధ్య దీపావళి పండుగ భద్రతకు గ్రహణం పట్టకుండా చూడాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉంది.



ప్రాదేశిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం

-ఉదయం 7 గంటలకే కౌంటింగ్ కేంద్రానికి ఏజెంట్లు చేరుకోవాలి

-7.30 గంటలకు స్ట్రాంగ్ రూమ్ నుంచి బ్యాలెట్ పెట్టెల తరలింపు-తొలుత పోస్టల్ బ్యాలెట్లు





ప్రజాభూమి, హిందూపురం టౌన్

ప్రాదేశిక జిల్లా పరిషత్ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు హిందూపురం రూరల్ మండలంలో సర్వం సిద్ధమైంది. శనివారం ఉదయం ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుండటంతో అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. కౌంటింగ్ ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు సహకరించాలని మండల ఎన్నికల అధికారి శివానంద నాయక్ కోరారు. ఈ మేరకు శుక్రవారం హిందూపురం రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఎన్నికల అధికారి శివానంద నాయక్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ వెంకటేష్, ఎంపీడీవో దామోదరమ్మ పాల్గొన్నారు. రెండవ సాధారణ ప్రాదేశిక ఎన్నికల ఓట్ల లెక్కింపు నిర్వహణకు సంబంధించి చేపట్టిన ఏర్పాట్లు, కౌంటింగ్ సమయపాలన, ఏజెంట్ల నియామకం, ఓట్ల లెక్కింపు విధానంపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు అధికారులు సమగ్రంగా వివరించారు. ఉదయం 7 గంటలకే అభ్యర్థుల తరఫున నియమితులైన కౌంటింగ్ ఏజెంట్లు లెక్కింపు కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. ఉదయం 7.30 గంటల లోపు స్ట్రాంగ్ రూమ్ నుంచి బ్యాలెట్ పెట్టెలను బయటకు తీసుకువచ్చి, అవసరమైన ప్రక్రియను పూర్తిచేసిన అనంతరం ఓట్ల లెక్కింపును ప్రారంభిస్తామని తెలిపారు. నిర్ణీత సమయానికి ఏజెంట్లు హాజరై అధికారులకు సహకరించాలని స్పష్టం చేశారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో భాగంగా తొలుత పోస్టల్ బ్యాలెట్లను లెక్కిస్తామని, అనంతరం సాధారణ బ్యాలెట్ పత్రాల లెక్కింపు చేపడతామని వివరించారు. ప్రతి అభ్యర్థి తరఫున ఒక కౌంటింగ్ ఏజెంట్‌ను నియమించుకునేందుకు ఎన్నికల సంఘం అనుమతి ఇచ్చిందని తెలిపారు. జెడ్పీటీసీ అభ్యర్థుల ఓట్ల లెక్కింపు కోసం పది టేబుళ్లు ఏర్పాటు చేస్తున్నందున, ఆ అభ్యర్థుల తరఫున పది మంది ఏజెంట్లకు అవకాశం కల్పించనున్నట్లు వెల్లడించారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఓట్ల లెక్కింపు విధానాన్ని కూడా అధికారులు వివరించారు. ముందుగా బ్యాలెట్ పత్రాల నుంచి ఎంపీటీసీ అభ్యర్థులకు సంబంధించిన ఓట్లను వేరు చేసి, ప్రతి 25 ఓట్ల చొప్పున కట్టలుగా కడతామని తెలిపారు. ఈ ప్రక్రియ పూర్తయిన అనంతరం ఎంపీటీసీ అభ్యర్థుల ఓట్ల లెక్కింపు చేపడతామన్నారు. జెడ్పీటీసీ అభ్యర్థులకు సంబంధించిన బ్యాలెట్ పత్రాలను ప్రత్యేకంగా భద్రపరిచి, ఎంపీటీసీ ఓట్ల లెక్కింపు పూర్తయిన తరువాత వాటిని లెక్కిస్తామని స్పష్టం చేశారు. ఎన్నికల నిర్వహణలో ఇప్పటివరకు రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ప్రజలు అందించిన సహకారం అభినందనీయమని శివానంద నాయక్ పేర్కొన్నారు. పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిన తరహాలోనే ఓట్ల లెక్కింపు కూడా ఎలాంటి వివాదాలు, అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా సజావుగా జరిగేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. కౌంటింగ్ కేంద్రంలో సమయపాలనతో పాటు అధికారులకు సహకరించాలని సూచించారు. ఈ సమావేశంలో మండల స్థాయి అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

జెడ్పీటీసీ ఎన్నికల కౌంటింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి

ప్రజాభూమి,పులివెందుల



జెడ్పీటీసీ ఎన్నికల కౌంటింగ్‌కు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. పట్టణంలోని పాత రవణప్ప సత్రం పాఠశాలలో పులివెందుల, లింగాల, వేముల, వేంపల్లి మండలాలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు శనివారం ప్రారంభించనున్నట్లు అధికారులు వెల్లడించారు. కౌంటింగ్‌కు అవసరమైన ఏర్పాట్లన్నీ పూర్తి చేసినట్లు పేర్కొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో ఓట్ల లెక్కింపు

-రెండు రౌండ్లలో ఫలితాలు వెల్లడించేందుకు చర్యలు

-కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించిన సబ్ కలెక్టర్ ఆనంద్ కుమార్

ప్రజాభూమి, హిందూపురం టౌన్



హిందూపురం మండల పరిధిలో జరిగిన జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం ఉదయం ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహించనున్నారు. ఇందు కోసం కౌంటింగ్ కేంద్రంలో అవసరమైన అన్ని ఏర్పాట్లను ఎన్నికల అధికారులు పూర్తి చేశారు. పెనుకొండ సబ్ కలెక్టర్ ఆనంద్ కుమార్, ఎన్నికల అధికారి శివానంద నాయక్, తహసీల్దార్ వెంకటేశు, ఎంపీడీవో దామోదరమ్మ, డిప్యూటీ ఎంపీడీవోలు శివకుమార్, నారాయణ తదితరులు కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఓట్ల లెక్కింపునకు అవసరమైన బల్లలు, సిబ్బంది నియామకం, బ్యాలెట్ బాక్సుల తరలింపు, భద్రతా ఏర్పాట్లు తదితర అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ ఆనంద్ కుమార్ కౌంటింగ్ కేంద్రాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి ఏర్పాట్లను సమీక్షించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఎలాంటి ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. హిందూపురం మండల వ్యాప్తంగా మొత్తం 43,155 మంది ఓటర్లు ఉండగా, వీరిలో పురుషులు 21,563 మంది, మహిళలు 21,590 మంది ఉన్నారు. ఎన్నికల్లో 31,785 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో 15,794 మంది పురుషులు, 15,991 మంది మహిళలు ఉన్నారు. దీంతో మండలంలో నమోదైన పోలింగ్ వివరాల ఆధారంగా అభ్యర్థుల భవితవ్యం శనివారం తేలనుంది. ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి రెండు రౌండ్లలో ఓట్ల లెక్కింపు పూర్తి చేసేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. అదేవిధంగా జడ్పీటీసీ స్థానానికి పది కౌంటింగ్ బల్లలను ఏర్పాటు చేసి, రెండు రౌండ్లలోనే లెక్కింపు ప్రక్రియను ముగించేలా ప్రణాళిక రూపొందించారు. కౌంటింగ్ సిబ్బంది సమన్వయంతో పనిచేసి నిర్దేశిత సమయంలో ఫలితాలు వెల్లడించేలా అధికారులు చర్యలు చేపట్టారు. దీంతో అభ్యర్థులు, రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తల్లో ఎన్నికల ఫలితాలపై ఉత్కంఠ నెలకొంది. శనివారం వెలువడనున్న ఫలితాల కోసం మండల ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

ఘనంగా సామూహిక లక్ష్మీ కుబేర పూజలు

- 108 రకాల పిండివంటలతో శ్రీ వాసవి మాతకు నైవేద్యం

ప్రజాభూమి, వేంపల్లె



ధన త్రయోదశి సందర్భంగా స్థానిక పట్టణంలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో సామూహిక లక్ష్మీ కుబేర పూజలు ఘనంగా నిర్వహించినట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తోటంశెట్టి చంద్రశేఖర్, మహిళా మండలి అధ్యక్షురాలు బచ్చు భాగ్యేశ్వరమ్మ తెలిపారు. శుక్రవారం ఆలయ అర్చకులు ఇంద్రకంటి ప్రసాద్ శర్మ సిద్ధాంతి నేతృత్వంలో వాసవి మాతకు పంచామృతాభిషేకం, నివేదన, మహామంగళహారతి, మంత్ర పుష్పం తదితర విశేష పూజలు నిర్వహించారు. అనంతరం వేద మంత్రోచ్చారణల నడుమ ధన్వంతరి పూజ చేపట్టారు. శ్రీ వాసవి మాత ఉత్సవమూర్తిని పిండివంటలతో తయారు చేసిన లడ్డూ మాల, కిరీటం, చీరతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో మహిళలు 108 రకాల పిండివంటలను అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం అర్చకుల ఆధ్వర్యంలో మహిళలు సామూహికంగా లక్ష్మీ కుబేర పూజలు నిర్వహించి, మహామంగళహారతి సమర్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య యువజన సంఘం ప్రతినిధి రాయవరం సుబ్బు, ఆలయ నిర్వాహకులు మిట్టా ప్రవీణ్ కుమార్, మహిళా మండలి సభ్యులు నిర్మల, మాధవి, మృధుల, సునీత, వరలక్ష్మి, హేమలత, అనురాధ, సత్యవతి, విజయలక్ష్మి, లక్ష్మీదేవి, భాగ్యలక్ష్మి, లలిత, సుధారాణితో పాటు ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం, శ్రీ వాసవి కళ్యాణ మండపం, అవోపా, మండల ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య మహిళా మండలి, అవోపా మహిళా విభాగ్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



దీపావళికి క్రాకర్స్ విక్రయాల్లో భద్రతా నిబంధనలు తప్పనిసరి

ప్రజాభూమి, పులివెందుల



దీపావళి పండుగ సందర్భంగా పులివెందుల సబ్ డివిజన్ పరిధిలో క్రాకర్స్ వ్యాపారులు ప్రభుత్వ నిబంధనలు, భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని బి.మురళి ఎస్డీపీఓ సూచించారు. చెల్లుబాటు అయ్యే లైసెన్స్, అనుమతులు లేకుండా విక్రయాలు చేయరాదని, అధికారులు అనుమతించిన ప్రదేశాల్లోనే దుకాణాలు ఏర్పాటు చేయాలని, జనావాసాలు, పెట్రోల్ బంకులు, గ్యాస్ గోడౌన్ల దగ్గర దుకాణాలు పెట్టరాదని తెలిపారు.ప్రతి దుకాణంలో ఇసుక, నీటి బకెట్లు, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు అందుబాటులో ఉంచాలని, దుకాణాల వద్ద సిగరెట్లు, బీడీలు, బహిరంగ మంటలు, వెల్డింగ్ పనులు నిషేధ మని, నాణ్యమైన విద్యుత్ వైరింగ్ వాడాలని, లైసెన్స్‌లో అనుమతిం చిన దానికంటే ఎక్కువ స్టాక్ ఉంచరాదని సూచించారు. నివ్వ ప్రదేశాల్లోకి చిన్నపిల్లలు, అనధికార వ్యక్తులను అనుమతించరాదని, నిషేధిత బాణసంచా విక్రయించరాదని, శబ్ద, సమయ నిబంధనలు పాటించాలని, పోలీస్, అగ్నిమాపక, రెవెన్యూ అధికారుల తనిఖీలకు పూర్తిగా సహకరించాలని తెలిపారు.చిన్న నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదానికి దారితీస్తుందని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్డీపీఓ హెచ్చరించారు. ప్రజలు జాగ్రత్తలతో దీపావళిని సురక్షితంగా జరుపుకోవాలని కోరారు.

పోలవరం జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఓట్ల లెక్కింపునకు విస్తృత ఏర్పాట్లు

నవంబర్ 7వ తేదీ ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభం
12 జెడ్పీటీసీ స్థానాలకు 45 మంది, 101 ఎంపీటీసీ స్థానాలకు 275 మంది అభ్యర్థులు పోటీ
4 కౌంటింగ్ కేంద్రాలు, 202 కౌంటింగ్ టేబుళ్లు ఏర్పాటు



ప్రజాభూమి ప్రతినిధి రంపచోడవరం పోలవరం జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ సాధారణ ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపు ప్రక్రియను నవంబర్ 7వ తేదీ శనివారం ఉదయం 8 గంటల నుంచి ప్రారంభించేందుకు జిల్లా ఎన్నికల యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. జిల్లాలోని మొత్తం 12 జెడ్పీటీసీ స్థానాలకు 45 మంది అభ్యర్థులు పోటీలో ఉండగా, 101 ఎంపీటీసీ స్థానాలకు 275 మంది అభ్యర్థులు పోటీ చేశారు. ఎన్నికల నియమావళి, మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపు నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు. జిల్లాలోని చింతూరు, రంపచోడవరం డివిజన్ల పరిధిలో మొత్తం నాలుగు కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు నిర్వహించేందుకు 202 కౌంటింగ్ టేబుళ్లను సిద్ధం చేశారు. ప్రతి కౌంటింగ్ టేబుల్‌కు ఒక కౌంటింగ్ సూపర్‌వైజర్ చొప్పున మొత్తం 202 మంది కౌంటింగ్ సూపర్‌వైజర్లను నియమించారు.


నకిలీ ఏజెంట్ పై చర్య తీసుకోవాలి మిత్ర పక్షాలు డిమాండ్.



ప్రజా భూమి ప్రతినిధి కునవరం.. మండలంలోని చూచి రేవుల గూడెం ఎంపీటీసీ భర్త శ్రీమంతుల సత్యనారాయ ణ పోలింగ్ బూత్ లోకి వెళ్లి ఓటర్లను ప్రలోభ పెడుతూ ఉండగా అక్కడికి వచ్చిన మండల ఎన్నికల అధికారి మీరు ఎందుకు వచ్చారు అని వారిని నిలదీయగా నేను బూతు ఏజెంట్ ని అని తెలియజేశాడు అక్కడ ఉన్న ఒక రాజకీయ నాయకుడు అతనికి ఐడెంటిటీ కార్డు ఒకసారి చూపించండి అని అతనిని అడగగా తాను ఐడెంటిటీ కార్డు చూపించడానికి నిరాకరించాడు ఎన్నికల అధికారి స్పందించి మీ ఐడెంటిటీ కార్డును చూపించండి అని అడగగా అది చూసి ఫేక్ ఐడెంటిటీ కార్డ్ అని సాక్షాత్తు పాత్రికేయుల ముందు ఎన్నికల అధికారి నిర్ధారించడం జరిగింది అతను ఉదయం నుండి ఫేక్ ఐడెంటిటీ కార్డు ఉపయోగించుకొని చూచిరేవుల గూడెం ఎంపీటీసీ పరిధిలోగల 8 9 10 11 పోలింగ్ బూత్ లో అతను తిరుగుతూ ఓటర్లను ప్రలోభ పెడుతూ తనదైన రీతిలో ప్రతి పోలింగ్ బూత్ వద్ద కొంతమందిని తన అనుచరులకు కూడా ఫేక్ ఐడెంటిటీ కార్డులను ఏర్పాటు చేసి అక్కడ ఉన్న ఏజెంట్లను ఎంపీటీసీలను బెదిరించి క్రాస్ ఓటింగ్ చేయించాడు కావున అతనిపై మండల ఎన్నికల అధికారికి రాత్రి 10 గంటలకు చింతురులో ఫిర్యాదు చేయడం జరిగింది తదుపరి ఐటిడిఏ పిఓ కి కూడా కలిసి ఫిర్యాదు చేయడం జరిగింది ఐటిడిఏ పిఓ మాట్లాడుతూ అతనిపై చర్య తీసుకోవడం జరుగుతుందని అతనిని ఏఏ బూతుల్లో తిరిగాడో తెలుసుకొని ఆ బూతుల ఏవో ద్వారా ఫిర్యాదు తీసుకొని అతనిపై పోలీస్ చర్య తీసుకునే విధంగా చూస్తారని వారు హామీ ఇవ్వడం జరిగింది కానీ అతను బహిరంగంగానే తిరుగుతున్నాడు అతనిపై ఎటువంటి చర్య తీసుకోపోయేసరికి మిత్రపక్షాల వారు ఆందోళన చెందుతున్నారు కావున అతనిపై చర్య తీసుకోవాలని అలాగే నాలుగు బూతులను రీపోలింగ్ చేయించాలని మిత్రపక్షాలు డిమాండ్ చేస్తున్నారు ఈ కార్యక్రమంలో వైసిపి జెడ్పిటిసి అభ్యర్థి గుజ్జా బాబు, కాంగ్రెస్ పార్టీ జెడ్పిటిసి అభ్యర్థి చిచ్చడి తిరుపతిరావు సిపిఎం అభ్యర్థి నస్కూరి కామేశ్వరి, మండల సిపిఎం కార్యదర్శి బాబు బొరయ్య కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శ్రీమంతుల వెంకటరమణ, అహ్మద్ భాషా, సిపిఎం జిల్లా కమిటీ నాయకులు మేకల నాగేశ్వరరావు జిల్లా కమిటీ నాయకులు పాయం సీతారామయ్య , సీనియర్ నాయకులు తెలగాని నాగరాజు షణ్ముఖరావు మండల కమిటీ సభ్యుడు తాళ్లూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కూటమిలో వెన్నుపోటు రాజకీయాలు బట్టబయలు..!

-సొంత కూటమి నేతల నుంచి తీవ్ర అన్యాయం మనుబోలు రోహిణి.
-పొత్తు ధర్మానికి పాతర వేసి.. స్వతంత్ర అభ్యర్థికి మద్దతుగా నిలిచిన కూటమి నేతలు.
-జనసైనికుల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెడుతున్న నాయకుల తీరుపై మండిపడ్డ వీర మహిళ రోహిణి.
-కూటమి పెద్దలు,పార్టీ అధిష్ఠానం వెంటనే స్పందించి వెన్నుపోటు ద్రోహంపై సమగ్ర విచారణ జరపాలి.



ప్రజా భూమి ప్రతినిధి నాయుడుపేట. నాయుడుపేట మున్సిపల్ ఎన్నికల వేళ ఎన్డీఏ కూటమిలో అంతర్గత కుమ్ములాటలు, వెన్నుపోటు రాజకీయాలు ఒక్కొక్కటిగా బయటపడుతు,పొత్తు ధర్మాన్ని పాటించాల్సిన చోట,సొంత కూటమి నేతలే తమ భాగస్వామ్య పార్టీ అభ్యర్థి విజయానికి అడ్డు తగులుతూ ద్రోహం చేయడం స్థానిక రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశమైందని మనుబోలు రోహిణి మండిపడ్డారు. ఈ సందర్భంగా నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డు నుంచి జనసేన పార్టీ అధికారిక అభ్యర్థిగా బరిలోకి దిగిన వీర మహిళ మనుబోలు రోహిణికి కూటమి నేతల నుంచే తీవ్ర అన్యాయం జరిగిందంటూ ఆమె చేసిన ప్రకటన కలకలం సృష్టించింది. ఎన్డీఏ కూటమిలో భాగస్వామ్య పక్షాల మధ్య సఖ్యత, పరస్పర సహకారం ఉండాల్సి ఉండగా, నాయుడుపేటలో మాత్రం ఇందుకు పూర్తి విరుద్ధంగా వ్యవహరించారు. జనసేన అభ్యర్థిగా రోహిణి ఎన్నికల రణరంగంలో శ్రమిస్తుంటే, కొందరు కూటమి నాయకులు మాత్రం బాహాటంగానే స్వతంత్ర అభ్యర్థికి మద్దతు తెలుపుతూ ప్రచారం చేయడం దేనికి సంకేతమని శ్రేణులు మండిపడుతున్నాయి. స్వతంత్ర అభ్యర్థి తరఫున ప్రత్యక్షంగా ప్రచారం జరుగుతున్నప్పటికీ, కూటమి నాయకులు దానిని కనీసం అడ్డుకునే ప్రయత్నం చేయకపోవడం వారి కుట్రపూరిత వైఖరికి నిదర్శనమని స్పష్టమవుతోంది. కూటమి అంటే కేవలం పదవుల పంపకం కాదని, పరస్పర గౌరవం, నమ్మకం అని మనుబోలు రోహిణి స్పష్టం చేశారు. తోటి కూటమి అభ్యర్థి పోటీలో ఉన్నప్పుడు ఇలా వెన్నుపోటు పొడవటం జనసేన కార్యకర్తల, వీర మహిళల ఆత్మగౌరవాన్ని తీవ్రంగా దెబ్బతీస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కపట రాజకీయాలపై కూటమి పెద్దలు, జనసేన పార్టీ అధిష్ఠానం ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. తనకు జరిగిన అన్యాయంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఏ జనసైనికుడికి ఇలాంటి దుస్థితి రాకుండా పార్టీ నాయకత్వం భరోసా కల్పించాలని రోహిణి గట్టిగా కోరారు.

ఓట్ల లెక్కింపు యంత్రాంగం సర్వం సిద్ధం అందరూ సహకరించాలి

- జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. ప్రశాంత్ కుమార్



ప్రజా భూమి ప్రతినిధి రంపచోడవరం పోలవరం జిల్లాలో ఎంపీటీసీ,జడ్పిటిసిల ఓట్ల లెక్కింపు ఒకటికి రెండుసార్లు పరిశీలించుకుని ప్రశాంతమైన వాతావరణంలో ఓట్ల లెక్కింపు నిర్వహించాలని పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏ సమావేశపు హాలులో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్ వారి ఆధ్వర్యంలో ఈనెల 7వ తారీకున స్థానిక డిగ్రీ కళాశాల ప్రాంగణంలో, గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఓట్ల లెక్కింపు పక్రియ పై పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్,రంపచోడవరం సబ్ కలెక్టర్ డి.పృధ్వి రాజ్ కుమార్, జడ్పీ సి ఈ ఓ పురుషోత్తం కలిసి రిటర్నింగ్ అధికారులకు ,కౌంటింగ్ సూపర్వైజర్లు,కౌంటింగ్ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ పోలవరం జిల్లాలో కౌంటింగ్ ప్రక్రియలో విధులు నిర్వహించే ప్రతి అధికారి,సిబ్బంది తమ బాధ్యతలను పూర్తిస్థాయిలో తెలుసుకొని అప్రమత్తంగా వ్యవహరించాలని ఆయన సూచించారు. కౌంటింగ్‌కు సంబంధించిన ఎన్నికల నియమ నిబంధనలు, విధివిధానాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. బ్యాలెట్ పత్రాల పరిశీలన,చెల్లుబాటు అయ్యే ఓట్లు, చెల్లని ఓట్ల గుర్తింపు,ఓట్ల లెక్కింపు, ఫలితాల నమోదు వంటి అంశాల్లో ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలన్నారు.ప్రతి రౌండ్‌లో కౌంటింగ్ ప్రక్రియను జాగ్రత్తగా నిర్వహిస్తూ, లెక్కింపులో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలని తెలిపారు. కౌంటింగ్ సిబ్బంది మధ్య సమన్వయం ఉండాలని, కౌంటింగ్ కేంద్రాల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, నిష్పక్షపాత విధానం పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ పూర్తి చేయాలని ఆయన సూచించారు. కౌంటింగ్ విధులకు నియమితులైన అధికారులు, సిబ్బంది శిక్షణలో వివరించిన ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా అవగాహన చేసుకొని,తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. పోలవరం జిల్లా లో పోలింగ్ కేంద్రాల సంఖ్య, ఎంపీటీసీ స్థానాలు,పోలింగ్ సిబ్బంది అవసరాలను పరిగణనలోకి తీసుకొని సిబ్బందిని కేటాయించడం జరిగిందని ఎన్నికల విధులకు నియమితులైన సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించి, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా విధులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని,ప్రతి పోలింగ్ కేంద్రంలో అవసరమైన సిబ్బంది అందుబాటులో ఉండేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన తెలిపారు. జడ్పీటీసీ,ఎంపీటీసీ ఎన్నికల కౌంటింగ్ కేంద్రాల్లో అవసరమైన ఎన్నికల సామగ్రి, మైక్ సిస్టమ్స్,అనౌన్స్‌మెంట్ సౌకర్యాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలన్నారు.కొన్ని మండలాల్లో రెండు కౌంటింగ్ గదులు ఏర్పాటు చేసే అవకాశం ఉన్నందున,ఏ ఆర్వో ఏ గదిలో,ఏ టేబుల్ వద్ద విధులు నిర్వహించాలి అనే విషయంపై స్పష్టమైన ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ప్రతి ఆర్వోకు కేటాయించిన కౌంటింగ్ సూపర్వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు తదితర సిబ్బంది వివరాలను ముందుగానే తెలుసుకోవాలని ఆయన సూచించారు. సంబంధిత కార్యాలయ సిబ్బందితో ఫోన్ చేయించి,విధులకు హాజరయ్యే సిబ్బంది వివరాలు, హాజరును నిర్ధారించుకోవాలన్నారు. ఏ ఒక్క సూపర్వైజర్ లేదా అసిస్టెంట్ గైర్హాజరు కారణంగా కౌంటింగ్ ప్రక్రియలో ఆలస్యం జరగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. కౌంటింగ్‌కు అవసరమైన సిబ్బంది,సామగ్రి,ఇతర సౌకర్యాలన్నింటినీ ముందురోజే తనిఖీ చేసుకోవాలని, కౌంటింగ్ రోజున అధికారులు నిర్ణీత సమయానికి ముందుగానే కేంద్రాలకు చేరుకుని విధులకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. అలాగే కౌంటింగ్‌కు సంబంధించిన ప్రాథమిక నివేదికలను సకాలంలో పంపడంతో పాటు, కేటాయించిన యాప్‌లో అవసరమైన వివరాలను ఎప్పటికప్పుడు నిర్ణీత సమయంలో అప్డేట్ చేయాలని ఆయన సూచించారు.పోలవరం జిల్లాలో 101 ఎంపీటీసీ స్థానాలకు, 12 జడ్పిటిసి స్థానాలకు 368 పోలింగ్ కేంద్రాలలో జరిగిన ఎన్నికలకు సంబంధించిన కౌంటింగ్ కు ఈనెల ఏడవ తారీఖున చింతూరు డివిజన్లోని నాలుగు మండలాలకు గిరిజన సంక్షేమ శాఖ మహిళల గురుకుల ఆశ్రమ పాఠశాల ప్రాంగణంలో అదేవిధంగా రంపచోడవరం డివిజన్లోని 8 మండలాలకు రంపచోడవరం డిగ్రీ కళాశాల ప్రాంగణంలో అదేవిదంగా గురుకులం బాలికల ఆశ్రమ పాఠశాలో ఈ ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని ఏర్పాటు ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఎన్నికలకు నియమించిన సూపర్వైజర్లు సిబ్బంది ఈనెల ఏడవ తారీకు ఉదయం 6:00 గంటలకల్లా సంబంధిత కౌంటింగ్ కేంద్రాలకు చేరుకొని కౌంటింగ్ కు సంబంధించిన విధులకు హాజరుకావాలని ఆయన తెలిపారు. రంపచోడవరం సబ్ కలెక్టర్ డి పృథ్వీరాజ్ కుమార్ మాట్లాడుతూ ఈనెల ఏడవ తారీకు జరగబోయే ఓట్ల లెక్కింపు ప్రక్రియను ఒకటికి రెండుసార్లు పూర్తిస్థాయిలో అవగాహన చేసుకుని ప్రశాంతమైన వాతావరణంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియను నిర్వహించాలని ఓట్ల లెక్కింపు నియమించిన సూపర్వైజర్లు సిబ్బందికి ఏమైనా సమస్యలు ఉన్న ఎడల వెంట వెంటనే సంబంధిత ఆర్వో లకు తెలియజేయాలని ఆయన అన్నారు. ఓట్ల లెక్కింపుకు సంబంధించిన ఏర్పాట్లు పక్కాగా ఏర్పాట్లు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శివరావు, జిల్లా పంచాయతీ అధికారి జి. భాస్కరరావు, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ సత్యనారాయణమూర్తి, అన్ని మండలాలకు సంబంధించిన ఎన్నికల అధికారులు,రిటర్నింగ్ అధికారులు,కౌంటింగ్ సూపర్వైజర్లు, కౌంటింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


పల్లెలను సర్వనాశనం చేసిన వైసీపీకి ఓటడిగే అర్హత లేదు

- **కేంద్రం ఇచ్చిన కోట్ల రూపాయల పంచాయతీ నిధులను జగన్ దారి మళ్లించి పప్పుబెల్లాల్లా వాడేశారు**
- **కరోనా విపత్తులోనూ పల్లెల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లేందుకు పైసలు లేకుండా చేసిన పాపం జగన్‌దే**
- **రూ. 3,000 కోట్ల ఉపాధి హామీ నిధులను వైసీపీ కార్యకర్తలు బొక్కేశారు-మాజీ ఎమ్మెల్సీ అశోక్ బాబు**

ప్రజాభూమి ప్రతినిధి,మంగళగిరి: గత ఐదేళ్ల వైఎస్ జగన్ పాలనలో రాష్ట్ర గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, పంచాయతీ రాజ్ వ్యవస్థలు పూర్తిగా సర్వనాశనమయ్యాయని, ఆ ఆక్రోశం, ఆవేదనతోనే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్‌సీపీపై తిరగబడి కూటమికి 94 నుంచి 95 శాతం చారిత్రక విజయాన్ని కట్టబెట్టారని మాజీ ఎమ్మెల్సీ పర్చూరి అశోక్ బాబు స్పష్టం చేశారు. జగన్ ప్రభుత్వ హయాంలో గ్రామాలు, రైతులు, పేదలు ఎదుర్కొన్న దుస్థితిని ఎండగట్టారు. నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నిన్నటితో రాష్ట్రంలో జెడ్పీటీసీలు, ప్రధాన మున్సిపాలిటీలు, కార్పొరేషన్ ఎన్నికల ప్రక్రియ దాదాపుగా ముగిసిందని, త్వరలోనే పార్టీ రహితంగా జరిగే పంచాయతీ ఎన్నికలు కూడా రాబోతున్నాయని పేర్కొన్నారు. సాధారణ ఎన్నికలు వేరు, స్థానిక సంస్థల ఎన్నికలు వేరు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ, పంచాయతీ ఎన్నికలే అసలైన గ్రామీణ ప్రజల నాడిని, వారి నిజమైన అభిప్రాయాలను స్పష్టంగా ప్రతిబింబిస్తాయి. గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లోనూ ప్రజలు ఇదే తరహా చారిత్రక తీర్పు ఇవ్వబోతున్నారు. వైఎస్ జగన్ ఐదేళ్ల పాలనలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పూర్తిగా గ్రహణం పట్టింది. పల్లెల్లో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు వంటి కనీస మౌలిక వసతులు గాలికొదిలేశారు. ఆ చీకటి రోజులు ముగిసి, ఇప్పుడు ఆ గ్రహణం వీడిపోయింది. గ్రామాల్లో మళ్లీ వికాసం మొదలవుతోంది. గ్రామాల్లో సాధారణంగా ఎప్పుడైనా అతివృష్టి, వరదలు వస్తే ఆ నష్టం ఆ ఒక్క ఏడాదికే పరిమితమవుతుంది. రైతులు, ప్రజలు మరుసటి ఏట కోలుకుంటారు. కానీ జగన్ ఐదేళ్ల పాలన గ్రామాలను ఎంతలా నాశనం చేసిందంటే.. ఆ నష్టం నుంచి తేరుకోవడానికే ఏళ్లు పడుతోంది. గ్రామీణ వ్యవస్థలను పూర్తిగా సర్వనాశనం చేసేశారు. నిధులు లేక, పనులు చేయలేక 'మాకొద్దీ పదవులు' అంటూ ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, సర్పంచులు రాజీనామాలు చేసే దుస్థితికి తెచ్చారు. ఈ విధ్వంసానికి ఒకే ఒక్క కారణం.. ఘోరమైన పరిపాలనా లోపం, మిస్ మేనేజ్మెంట్. కేంద్రం నుంచి పంచాయతీలకు నేరుగా వచ్చిన 14వ, 15వ ఆర్థిక సంఘం నిధులను సైతం దొడ్డిదారిన దారిమళ్లించారు. స్థానిక సంస్థల అధికారాలను, ఆర్థిక స్వాతంత్ర్యాన్ని కాలరాశారు. ఈ దారుణమైన నిధుల మిస్ మేనేజ్మెంట్ వల్లే స్థానిక ప్రజాప్రతినిధులు చేతులెత్తేసే పరిస్థితి వచ్చింది. గ్రామీణ ప్రజలు ఇవన్నీ గమనించారు కాబట్టే, ఇప్పుడు స్థానిక సంస్థల్లోనూ కూటమికి పూర్తి మద్దతు ప్రకటిస్తున్నారు.

గ్రామీణ వ్యవస్థల వెన్నువిరిచిన వైఎస్ జగన్.. అందుకే స్థానిక ఎన్నికల్లో ప్రజల చారిత్రక తిరుగుబాటు

కేంద్రం 14, 15వ ఆర్థిక సంఘాల ద్వారా గ్రామ పంచాయతీలకు నేరుగా కేటాయించిన దాదాపు ?12,000 కోట్ల నిధులను జగన్ ప్రభుత్వం దొడ్డిదారిన దారిమళ్లించి పప్పుబెల్లాల్లా ఖర్చు చేసిందని మాజీ ఎమ్మెల్సీ పర్చూరి అశోక్ బాబు మండిపడ్డారు. మున్సిపాలిటీల మాదిరిగా కాకుండా చిన్న పంచాయతీలన్నీ కేంద్ర నిధుల మీదే ఆధారపడి నడుస్తాయి. అలాంటి నిధులు లాక్కోవడంతో పారిశుధ్య కార్మికులకు జీతాలు ఇవ్వలేక, కనీసం వీధుల్లో చల్లడానికి బ్లీచింగ్ పౌడర్ కూడా కొనలేక పంచాయతీలు దివాళా తీశాయి. 'బ్లీచింగ్ వేస్తే కరోనా పోతుంది' అని ఎగతాళిగా మాట్లాడిన జగన్, చివరకు ఆ బ్లీచింగ్ కూడా లేకుండా చేసి ప్రజారోగ్యాన్ని గాలికొది



లేశారు. నీటి సరఫరా, కనీస పౌర సేవలు నిలిచిపోయి పంచాయతీలు కేవలం నామమాత్రంగా మిగిలాయి. గ్రామీణ జీవనం ఆధారపడి ఉన్న వ్యవసాయం, పాడి, చేతివృత్తులు, వ్యవసాయ కూలీల రంగాలను తీవ్ర సంక్షోభంలోకి నెట్టారు. రైతుల దగ్గర ధాన్యం కొనుగోలు చేసి 6-7 నెలలైనా పైసలు ఇవ్వలేదు. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే గత ప్రభుత్వం బకాయి పెట్టిన 1,600 కోట్ల ధాన్యం బకాయిలను రైతులకు చెల్లించాం. క్రాప్ ఇన్సూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీలను ఎగ్గొట్టారు. కరోనా కష్టకాలంలో పంట చేతికొచ్చినా అమ్ముకోలేక, అమ్మినా డబ్బులు రాక అన్నదాతలు రోడ్డున పడ్డారు. గ్రామీణ పేదలకు కొండంత అండగా ఉండాల్సిన ఉపాధి హామీ పథకంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నేతలు దాదాపు 3,000 కోట్ల విలువైన పనిదినాలను బోగస్ పేర్లతో మింగేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించి చెల్లించాల్సిన దాదాపు ?2,000 కోట్లను కక్షపూరితంగా నిలిపివేస్తే, చివరకు కోర్టుల ద్వారా న్యాయ పోరాటం చేసి ఆ నిధులు సాధించుకోవాల్సి వచ్చింది. పేదలకు 25 లక్షల ఇళ్లు, సెంటు స్థలం పేరుతో దాదాపు ?7,000 నుంచి ?8,000 కోట్ల మేర భారీ అవినీతికి పాల్పడ్డారు. పట్టణాలకు ఆనుకుని గ్రామాల్లో ఉన్న టిడ్కో ఇళ్లపై ఆశపడ్డ లక్షలాది మందికి సుమారు 5 లక్షల ఇళ్లను ఉద్దేశపూర్వకంగా నిలిపివేసి మొండిచేయి చూపారు. జగన్ ఇచ్చిన సెంటు స్థలాల్లో 40 శాతానికి పైగా ముంపు ప్రాంతాలు, కొండలు, గుట్టలే. నీళ్లల్లో వేసిన సర్వే రాళ్లు వరదల్లో కొట్టుకుపోయాయని చెప్పుకొచ్చారు. జగన్ ఇచ్చే సాయం నమ్మి పేదలు తమ వద్ద ఉన్న రెండు, మూడు లక్షల రూపాయల పొదుపు మొత్తాన్ని పెట్టుబడిగా పెట్టి స్లాబ్ దశ వరకు నిర్మించుకుంటే, ప్రభుత్వం నిధులు ఇవ్వక లక్షలాది ఇళ్లు మధ్యలోనే ఆగిపోయి పేద కుటుంబాలు అప్పులపాలయ్యాయి. గ్రామాల్లో వృద్ధులకు ఆసరాగా నిలిచే పెన్షన్లను తెలుగుదేశం సానుభూతిపరులనే నెపంతో రద్దు చేశారు. తమ పార్టీ కార్యకర్తలకు అడ్డగోలుగా దివ్యాంగుల పెన్షన్లు కట్టబెట్టారు. వాలంటీర్ వ్యవస్థను పూర్తిగా వైఎస్సార్‌సీపీ కేడర్‌తో నింపేశారు. అన్నిటికంటే దారుణంగా గ్రామీణ పేదల జేబులు గుల్ల చేస్తూ, ?50-60 విలువ చేయని హానికరమైన సొంత బ్రాండ్ల నాసిరకం మద్యాన్ని 100, 200లకు అమ్ముకుని వారి ఆరోగ్యాన్ని నాశనం చేశారు. అందుకే 2024 ఎన్నికల్లో ఆ లిక్కర్ బాధితులే జగన్‌కు గట్టి బుద్ధి చెప్పారు. ఓటమిని జీర్ణించుకోలేక మేమేదో అరాచకం చేశామని ఈసీకి 74 ఫిర్యాదులు ఇవ్వడం హాస్యాస్పదం. గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి కూడా ఎన్నికలను ప్రజాస్వామ్యబద్ధంగానే నిర్వహించారు. కానీ జగన్ మాత్రం ప్రతి బూత్, ప్రతి మున్సిపాలిటీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీల్లో గొడవలు సృష్టించే కుసంస్కృతిని తీసుకొచ్చారు. గతంలో మీ బలం అనుకున్న ఒకటిరెండు ప్రాంతాల్లో జరిగిన అంతర్గత ఘర్షణలను మాపై నెట్టడం సరికాదు. గ్రామాల్లో విద్యా, వైద్య, తాగునీరు, గృహ నిర్మాణ రంగాల్లో మేము తెచ్చిన మార్పును ప్రజలు గుర్తించారు. పట్టణాల్లో మాకు 94% విజయం దక్కినట్లే, రేపు వెలువడే జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఫలితాల్లోనూ గ్రామీణ ప్రజలు కూటమికి చారిత్రక విజయాన్ని అందించి తీరబోతున్నారని అశోక్ బాబు స్పష్టం చేశారు.

చంద్రబాబు రాష్ట్రాన్ని మరో బీహార్‌లా మార్చేశాడు

- స్థానిక ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి అరాచకాలు - మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి

ప్రజాభూమి ప్రతినిధి,నరసరావుపేట: 75 ఏళ్ల ప్రజాస్వామ్య చరిత్రలో ఎన్నడూ చూడని విధంగా పోలీసులను అడ్డం పెట్టుకుని రాష్ట్రంలో ఎన్నికల వ్యవస్థను భ్రష్టు పట్టించిన చంద్రబాబు, రాష్ట్రాన్ని బీహార్‌లా మార్చేశాడని మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి ధ్వజమెత్తారు. నరసరావుపేటలోని తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగి ఉంటే ప్రజలకు సంక్షేమ ఫలాలు సక్రమంగా అందేవీ అని, జెడ్పీటీసీ అభ్యర్థులకు ప్రలోభాలు, బెదిరింపులకు పాల్పడ్డారని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతిపక్షాలను అణగదొక్కడానికి పోలింగ్ బూత్‌లను అగ్రకులాల ఇళ్ల మధ్యలో ఏర్పాటు చేసి.. బీసీ, ఎస్సీ, ఎస్టీలను అక్కడకొచ్చి ఓట్లు వేయనీయకుండా అడ్డుకున్నారని దుయ్యబట్టారు. ఏకంగా పోలీసులే పోలింగ్ ఏజెంట్లుగా మారి అడ్డుకోవడం, చివరికి తెలుగుదేశం పార్టీ నాయకులనే ఓటెయ్యనీయకుండా పోలీసులే దారుణాలు సాగించారని విమర్శించారు. నామినేషన్ల సమయంలో మహిళల చీరలు లాగే స్థాయికి దిగజారారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు తమకు జరిగిన అన్యాయాన్ని, తమపై ప్రదర్శిస్తున్న అహంకారాన్ని ఎప్పటికీ సహించరని హెచ్చరించారు. రాబోయే కాలంలో ఈ అరాచకాలకు పాల్పడిన అధికారుల ఉద్యోగాలు పోయే వరకు న్యాయపోరాటం చేస్తామని వార్నింగ్ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం సాగిస్తున్న ఈ అహంకారపూరిత పాలనకు ప్రజలు త్వరలోనే చెంప చెల్లుమనిపించే రోజు వస్తుందని కాసు మహేష్ రెడ్డి స్పష్టం చేశారు.

ఆయన ఇంకా ఏమన్నారంటే... రాష్ట్రాన్ని చంద్రబాబు మరో బీహార్‌లా మార్చేశారు. 75 ఏళ్ల ప్రజాస్వామ్య చరిత్రలో ఎన్నడూ చూడని విధంగా రాష్ట్రంలో ఎన్నికల వ్యవస్థను భ్రష్టు పట్టించారు. నామినేషన్లు వేయకుండా అభ్యర్థులను అడ్డుకోవడం, కిడ్నాప్‌లు చేయించడం, ప్రివెంటివ్ అరెస్టుల పేరుతో నిర్బంధించడం, మహిళల చీరలు లాగే స్థాయికి దిగజారడం, పోలింగ్ ఏజెంట్లను పోలీసులే బయటకు లాగడం.. ఇదేనా చంద్రబాబు చెప్పే అనుభవజ్ఞుడైన పాలన? పోలీసు వ్యవస్థను అడ్డుపెట్టుకుని ప్రతిపక్షానికి ఎన్నికల్లో పోటీ చేసే హక్కు లేకుండా చేయడం ఎన్నడూ చూడలేదు. మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించామని గొప్పలు చెప్పుకునే ప్రభుత్వం, మహిళా అభ్యర్థులనే ఒంటరిగా నామినేషన్ కేంద్రాలకు వెళ్లాలని చెప్పడం ఎంతటి దుర్మార్గం? ప్రతిపక్ష పార్టీ అభ్యర్థులను భయపెట్టి, అవమానించి, నామినేషన్లు వేయకుండా చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈరోజు రాష్ట్రంలో ప్రజాస్వామ్యం అపహాస్యమైంది. దీనికి పూర్తి బాధ్యత చంద్రబాబు ప్రభుత్వానిదే.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగి ఉంటే ప్రజలు తమకు నచ్చిన అభ్యర్థులను ఎన్నుకునేవారు. గెలుపోటములు ప్రజలు నిర్ణయించేవారు. కానీ ఈ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాన్నే లేకుండా చేసింది. గురజాల మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిని నామినేషన్ల సమయంలో ప్రివెంటివ్ అరెస్ట్ పేరుతో నిర్బంధించారు. 16వ తేదీన తీసుకెళ్లి, మేము హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ వేయడంతో 17వ తేదీ అర్ధరాత్రి విడుదల చేశారు. మరుసటి రోజు చివరి తేదీన నామినేషన్ వేయడానికి వెళ్తే డీఎస్పీ అడ్డుకుని అనుమతించనని చెప్పారు. జెడ్పీటీసీ అభ్యర్థులను కూడా ప్రలోభాలకు గురిచేశారు. ఒకరికి రూ.50 లక్షలు ఇస్తామని ఆశ చూపించారు. మరొకరిని అరెస్టు చేస్తామని బెదిరించారు. ఇంకొకరికి మద్యం తాగించి నిర్బంధించే ప్రయత్నం చేశారు. అయినా మా అభ్యర్థులు వెనక్కి తగ్గకుండా పోరాడారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడటమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు నిలబడ్డారు. అధికారంలో ఉన్న నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి అధికారులు చట్టవిరుద్ధంగా వ్యవహరించడం మానుకోవాలి. పోలీసులు, ఎన్నికల అధికారులు రాజ్యాంగానికి, చట్టానికి మాత్రమే కట్టుబడి పనిచేయాలి. అభ్యర్థులను నిర్బంధించడం, కిడ్నాప్‌లకు సహకరించడం, పోలింగ్ ఏజెంట్లను అడ్డుకోవడం, ఓటర్ల హక్కులను కాలరాయడం వంటి చర్యల్లో ఎవరి పాత్ర ఉన్నా చట్టప్రకారం విచారణ జరగాలి. ఈరోజు వారు చేస్తున్న ప్రతి పనికి రేపు సమాధానం చెప్పాల్సి ఉంటుంది. ఈరోజు చంద్రబాబు అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఎన్నికలను అవహాస్యం చేసి ఉండవచ్చు. పోలీసులను ఉపయోగించుకుని ప్రతిపక్షాన్ని అణచివేయాలని చూసి ఉండవచ్చు. ఈ ఎన్నికల్లో జరిగిన ప్రతి అక్రమంపై రాబోయే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకునే వరకు మా పోరాటం ఆగదు. ప్రజలకు జరిగిన అన్యాయానికి, కూటమి ప్రదర్శిస్తున్న అహంకారానికి తగిన సమాధానం చెప్పే రోజు త్వరలోనే వస్తుందని కాసు మహేష్ రెడ్డి స్పష్టం చేశారు.

ప్రజాభూమి
పోలవరం 11
శనివారం 7 నవంబరు 2026

పోలవరం జిల్లాలో...

జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఓట్ల లెక్కింపునకు పకడ్బందీ ఏర్పాట్లు

- కౌంటింగ్ ప్రక్రియలో ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలి
- చింతూరు డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల కౌంటింగ్ సిబ్బందికి శిక్షణకు హాజరైనా జిల్లా కలెక్టర్
- సిబ్బంది అప్రమత్తంగా, నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలి
- జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్





ప్రజా భూమి ప్రతినిధి-కూనవరం

పోలవరం జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ సాధారణ ఎన్నికలు – 2026 ఓట్ల లెక్కింపు ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కె. దినేష్ కుమార్ కౌంటింగ్ సిబ్బందికి సూచించారు.నవంబర్ 7వ తేదీ శనివారం ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభం కానున్న నేపథ్యంలో శుక్రవారం చింతూరులోని ఐటిడిఏ సమావేశ మందిరంలో చింతూరు డివిజన్ పరిధిలోని చింతూరు, కూనవరం, వి.ఆర్.పురం, ఎటపాక మండలాలకు చెందిన కౌంటింగ్ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్, చింతూరు సబ్ కలెక్టర్ చిట్టిపులి నరేంద్ర పడాల్ పాల్గొని సిబ్బందికి కౌంటింగ్ విధివిధానాలపై సమగ్రంగా దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె . దినేష్ కుమార్ మాట్లాడుతూ , ఓట్ల లెక్కింపు ప్రక్రియలో ప్రతి దశను ఎన్నికల కమిషన్ నిర్దేశించిన నిబంధనల ప్రకారం నిర్వహించాలని తెలిపారు. కౌంటింగ్ సిబ్బంది తమకు కేటాయించిన టేబుళ్ల వద్ద నిర్దేశిత సమయానికి విధులకు హాజరుకావాలని, ఎన్నికల విధులకు సంబంధించిన గుర్తింపు కార్డులు, అవసరమైన సామగ్రితో సిద్ధంగా ఉండాలని సూచించారు. కౌంటింగ్ ప్రారంభానికి ముందు బ్యాలెట్ బాక్సుల సీల్స్, ట్యాగులు, ఇతర ఎన్నికల పత్రాలను నిబంధనల ప్రకారం పరిశీలించాలన్నారు. బ్యాలెట్ పత్రాలను జాగ్రత్తగా తెరిచి, సంబంధిత స్థానాలకు చెందిన ఓట్లను వేర్వేరుగా క్రమబద్ధీకరించి, లెక్కింపులో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలని ఆదేశించారు.బ్యాలెట్ పత్రాల చెల్లుబాటు, చెల్లని ఓట్ల గుర్తింపు, అభ్యర్థులకు వచ్చిన ఓట్ల లెక్కింపు తదితర అంశాల్లో ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. చెల్లుబాటు అయ్యే ఓట్ల విషయంలో సందేహాలు తలెత్తినప్పుడు సొంత నిర్ణయాలు తీసుకోకుండా, ఎన్నికల నిబంధనల ప్రకారం సంబంధిత రిటర్నింగ్ అధికారి దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ప్రతి టేబుల్ వద్ద కౌంటింగ్ సూపర్‌వైజర్, సహాయక సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ, ప్రతి రౌండ్‌లో లెక్కించిన ఓట్ల వివరాలను నిర్దేశిత ఫార్మాట్లలో నమోదు చేయాలన్నారు. లెక్కింపు పూర్తయిన అనంతరం సంబంధిత రికార్డులను సక్రమంగా సమర్పించి, ఫలితాల ప్రకటనకు అవసరమైన ప్రక్రియను నిబంధనల ప్రకారం పూర్తి చేయాలని తెలిపారు.

టెండర్డ్ బ్యాలెట్ పేపర్లపై స్పష్టత:

శిక్షణ కార్యక్రమంలో టెండర్డ్ ఓట్లకు సంబంధించిన నిబంధనలపై కూడా కలెక్టర్ సిబ్బందికి స్పష్టత ఇచ్చారు. పోలవరం జిల్లాలోని ఏ పోలింగ్ కేంద్రంలోనూ టెండర్డ్ బ్యాలెట్ పేపర్లు పోలింగ్ సమయంలో జారీ కాలేదని, జిల్లా వ్యాప్తంగా అటువంటి బ్యాలెట్ పత్రాలు ఏవీ లేవని తెలిపారు. అందువల్ల కౌంటింగ్ సమయంలో టెండర్డ్ బ్యాలెట్ పత్రాలకు సంబంధించి ఎటువంటి ప్రత్యేక పరిస్థితి ఉత్పన్నం కాదని వివరించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం మాత్రమే టెండర్డ్ బ్యాలెట్ పత్రాల నిర్వహణ, లెక్కింపు అంశాలను చేపట్టాలని సిబ్బందికి సూచించారు.

కౌంటింగ్ ఏర్పాట్లు:

పోలవరం జిల్లాలో మొత్తం 12 జెడ్పీటీసీ స్థానాలకు 45 మంది అభ్యర్థులు, 101 ఎంపీటీసీ స్థానాలకు 275 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. చింతూరు, రంపచోడవరం డివిజన్ల పరిధిలో మొత్తం నాలుగు కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి, 202 కౌంటింగ్ టేబుళ్లను సిద్ధం చేశారు. వీటికి 202 మంది కౌంటింగ్ సూపర్‌వైజర్లను, 606 మంది కౌంటింగ్ సిబ్బందిని నియమించారు. అదనంగా రిజర్వ్ సిబ్బందిని కూడా అందుబాటులో ఉంచారు.కౌంటింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించే సిబ్బంది ఎన్నికల ప్రవర్తనా నియమావళి, కౌంటింగ్ కేంద్రాల భద్రతా నిబంధనలు, అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ సూచిం చారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండి, ఎలాంటి గందర గోళానికి తావులేకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని తెలిపారు.ఈ శిక్షణ కార్యక్రమంలో చింతూరు సబ్ కలెక్టర్ చిట్టిపులి నరేంద్ర పడాల్, ఎన్నికల విధులకు సంబంధించిన అధికారులు, కౌంటింగ్ సూపర్‌వైజర్లు, సహాయక సిబ్బంది పాల్గొన్నారు.

మండల ప్రజలకు ఓటర్లకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపిన జిల్లా నాయకులు మేకల నాగేశ్వరరావు



ప్రజా భూమి ప్రతినిధి-కూనవరం

మండల ప్రజలందరికీ సీపీఎం పార్టీ తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు సీపీఎం జిల్లా నాయకులు మేకల నాగేశ్వరరావు అన్నారు.కూనవరం మండల కేంద్రంలోని మార్ర శ్రీరామమూర్తి భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా సీపీఎం–వైసీపీ పొత్తులో భాగంగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేసిన సీపీఎం, వైసీపీ నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.అదేవిధంగా పార్టీలకు అతీతంగా సహకరించిన మండలంలోని ప్రతి కుటుంబానికి, ప్రతి ఓటరుకు పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. ఎన్నికల సమయంలో ప్రజలు అందించిన సహకారాన్ని సీపీఎం పార్టీ ఎప్పటికీ మరచిపోదని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ప్రజల పక్షాన నిలబడి పనిచేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బాబు బొర్రయ్య, మండల కమిటీ సభ్యులు కొమరం పెంటయ్య, మడకం నాగమణి, పాయం సత్యనారాయణ, ఆవుల ఉపేంద్ర, సీనియర్ నాయకులు తలగాని నాగరాజు, మహిళా సంఘం నాయకురాలు గుండం బుచ్చమ్మ, నస్కూరి కామేశ్వరి, పార్టీ కార్యకర్తలు మడకం జోగయ్య, ఉయిక కన్నయ్య కొండాఈశ్వర్, దాసరి నాగరాజు, నస్కూరి వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకి విజయంపై ధీమా.. ప్రజలకు కృతజ్ఞతలు

కలిసికట్టుగా పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు అభినందనలు..

రానున్న రోజుల్లో మంచి రోజులు వస్తాయన్న మాదిరెడ్డి సత్తిబాబు

ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం.



వి.ఆర్.పురం మండలంలో నిన్న జరిగిన జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కి ఓటు వేసి మద్దతు తెలిపిన ఓటర్లందరికీ పార్టీ తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియ జేస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మాదిరెడ్డి సత్తిబాబు తెలిపారు. శుక్రవారం రేఖపల్లి లోని ఆయన నివాసం వద్ద వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు మాచర్ల గంగయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజ యమే లక్ష్యంగా పోటీ చేసిన అభ్యర్థులతో పాటు మండల నాయకులు, తాజా మాజీ ప్రజాప్రతి నిధులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు సమన్వయంతో ఐక్యంగా పనిచేశారని పేర్కొన్నారు. అందరి సమష్టి కృషి, ప్రజల మద్దతుతో రేపు వెలువడనున్న ఎన్నికల ఫలితాలు వైఎస్సార్‌సీపీకి అను కూలంగా వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఎండనక, వాననక కష్టపడి పనిచేసిన ప్రతి నాయకుడికి, కార్యకర్తకు పార్టీ తగిన గుర్తింపునిస్తుందని, రానున్న రోజుల్లో మంచి రోజులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ శ్రేణులు ఇదే ఐక్యత, పట్టుదలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి నాయకులు, వివిధ హోదాల్లో ఉన్న పార్టీ ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం కొనుగోలుదారులపై నిఘా ఎక్కడ?

- ఏజెన్సీ నుంచి మైదాన ప్రాంతాలకు రాత్రివేళల్లో తరలింపుపై సమాచారం
- గతంలో పట్టుబడిన వాహనాల కదలికలపైనా ఆరా తీయాలి
- సీసీ కెమెరాల రికార్డులు పరిశీలిస్తే వెలుగులోకి వచ్చే వాస్తవాలు!

ప్రజాభూమి ప్రతినిధి-రాజమౌమ్మంగి



పేదల కోసం ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న రేషన్ బియ్యంపై అక్రమ కొనుగోళ్ల వ్యవహారం మరోసారి చర్చకు వస్తోంది. ఏజెన్సీ గ్రామాల్లో లబ్ధిదారుల నుంచి సేకరిస్తున్న రేషన్ బియ్యం మైదాన ప్రాంతాలకు తరలిపోతున్నాయన్న సమాచారం కలకలం రేపుతోంది. ముఖ్యంగా రాత్రివేళల్లో వాహనాల ద్వారా బియ్యం బయట ప్రాంతాలకు చేరుతున్నాయన్న సమాచారంపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. రాజమౌమ్మంగి మండలం నుంచి రాత్రి సుమారు 11 గంటల సమయంలో రేషన్ బియ్యం తరలించినట్లు సమాచారం అందుతోంది. ఈ క్రమంలో గతంలో రేషన్ బియ్యం కేసులో పట్టుబడిన వాహనమే తిరిగి రవాణాకు ఉపయోగిస్తున్నారన్న సమాచారం కూడా పరిశీలనకు అర్హమైనది. గతంలో పట్టుబడిన వాహనాలు ప్రస్తుతం ఎక్కడ తిరుగుతున్నాయి? వాటి యజమానులు ఎవరు? మళ్లీ బియ్యం రవాణాకు ఉపయోగిస్తున్నారా? అన్నది అధికారులు నిర్ధారించాల్సి ఉంది.ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతోంది. రేషన్ బియ్యం గ్రామాల్లో ఎవరు కొనుగోలు చేస్తున్నారు? ఇంటింటికీ వెళ్లి సేకరిస్తున్నారా? మండల కేంద్రాల్లో మధ్యవర్తులు ఉన్నారా? సేకరించిన బియ్యాన్ని ఎక్కడ నిల్వ చేస్తున్నారు? మైదాన ప్రాంతాల్లో ఎవరికి విక్రయిస్తున్నారు? ఈ మొత్తం వ్యవహారంపై విచారణ జరిగితేనే అక్రమ కొనుగోళ్ల వెనుక ఉన్న వ్యక్తుల వివరాలు బయటపడతాయి.రాజమౌమ్మంగి నుంచి బయట ప్రాంతాలకు వెళ్లే మార్గాల్లో పలుచోట్ల సీసీ కెమెరాలు ఉన్నాయి. రాత్రి వేళల్లో వెళ్లే వాహనాల నంబర్లు, సమయాలు, ప్రయాణ మార్గాలను పరిశీలించడం ద్వారా అనుమానాస్పద రాకపోకలను గుర్తించే అవకాశం ఉంది. గతంలో నమోదైన కేసుల్లోని వాహనాల వివరాలతో ప్రస్తుత సీసీ కెమెరా దృశ్యాలను సరిపోల్చి చూడాల్సిన అవసరం ఉంది.జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు ఇకనైనా కేవలం రేషన్ దుకాణాల తనిఖీలకే పరిమితం కాకుండా, బియ్యం కొనుగోలు చేస్తున్న వ్యక్తులు, నిల్వ కేంద్రాలు, రవాణా వాహనాలు, మైదాన ప్రాంతాల్లోని కొనుగోలుదారుల వరకు విచారణ విస్తరించాలి. పగటిపూట తనిఖీలతో పాటు రాత్రివేళల్లోనూ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలి. గతంలో పట్టుబడిన వాహనాలపై కూడా ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి. రేషన్ బియ్యం కొనుగోలు చేస్తున్నవారైనా, నిల్వ చేస్తున్నవారైనా, తరలిస్తున్నవారైనా చట్టానికి అతీతులు కారు. గత కేసుల వివరాలు, వాహనాల కదలికలు, సీసీ కెమెరాల రికార్డులను సమగ్రంగా పరిశీలిస్తే ఈ వ్యవహారంలో ఎవరెవరి పాత్ర ఉందో తేలే అవకాశం ఉంది.పేదల బియ్యాన్ని పక్కదారి పట్టించే ప్రయత్నాలకు అడ్డుకట్ట వేయాలంటే జిల్లా యంత్రాంగం మూలాలపై దృష్టి పెట్టాలి. రాజమౌమ్మంగి నుంచి ఏజెన్సీ ప్రాంతాల వరకు రేషన్ బియ్యం కొనుగోలు, రవాణా వ్యవస్థపై ప్రత్యేక విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఎంపీటీసీ,జడ్పీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం

- రెండు రెవెన్యూ డివిజన్ల పరిధిలోని 20 మండ లాలకు రెండు కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటు
- కాకినాడలో 160, పెద్దాపురం లో 146 కౌంటింగ్ టేబుళ్ల ఏర్పాటు
- జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

ప్రజాభూమి ప్రతినిధి-కాకినాడ

జిల్లాలో జడ్పీటీసీ, ఎంపీటీసీ రెండవ సాధారణ ఎన్నికలు– 2026కు సంబంధించి ఓట్ల లెక్కింపు ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.కాకినాడ జిల్లాలోని రెండు రెవెన్యూ డివిజన్ ల పరిధిలో మొత్తం 20 మండలాల కు సంబంధించి ఓట్ల లెక్కింపు నిర్వహణ కోసం రెండు కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

కాకినాడ కౌంటింగ్ కేంద్రం: పి.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో....

కాకినాడ రెవెన్యూ డివిజన్ పరిధిలోని పెదపూడి, కాజులూరు, కరప, తాళ్లరేవు,కాకినాడ రూరల్, పిఠాపురం,యు. కొత్తపల్లి, గొల్లప్రోలు మండలాలతో పాటు పెద్దాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలోని సామర్లకోట,తొండంగి మండలాలకు సంబంధించి మొత్తం 10 మండలాల ఓట్ల లెక్కింపు కోసం కాకినాడలోని పి.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కౌంటింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కేంద్రంలో ఓట్ల లెక్కింపు సజావుగా నిర్వహించేందుకు మొత్తం 160 కౌంటింగ్ టేబుళ్లను సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు.

పెద్దాపురం కౌంటింగ్ కేంద్రం: మహారాణి కళాశాలలో...

పెద్దాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలోని గండేపల్లి,జగ్గంపేట, ప్రత్తిపాడు, తుని,శంఖవరం, ఏలేశ్వరం,కిర్లంపూడి, రౌతులపూడి,కోట నందూరు, పెద్దాపురం మండలాలకు సంబంధించి మొత్తం 10 మండలాల ఓట్ల లెక్కింపు కోసం పెద్దాపురం లోని మహారాణి కళాశాలలో కౌంటింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ వివరించారు.ఈ కేంద్రంలో ఓట్ల లెక్కింపు నిర్వహణకు మొత్తం 146 కౌంటింగ్ టేబుళ్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.రెండు కౌంటింగ్ కేంద్రాల్లోనూ ఓట్ల లెక్కింపు ప్రక్రియకు అవసరమైన మౌలిక సదుపాయాలు,భద్రతా ఏర్పాట్లు,అధికారుల విధుల కేటాయింపు తదితర అంశాలను ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.



నేడే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ఫలితాలు

- ఎవరి ధీమా వారిదే.. అసలు విజయం ఎవరిదో తేలాలంటే వేచి చూడాల్సిందే!
- గెలుపుపై ప్రధాన పార్టీల అంచనాలు.. అభ్యర్థుల్లో టెన్షన్
- సైలెంట్ ఓటింగ్ ఎవరికి అనుకూలించిందో నేడు తేలనున్న వైనం

ప్రజాభూమి ప్రతినిధి-అడ్డతీగల

స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యంత కీలకమైన ఘట్టానికి తెరపడింది. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ముగియడంతో ఇప్పుడు అందరి దృష్టి ఓట్ల లెక్కింపు, ఫలితాలపైనే కేంద్రీకృతమైంది. గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నికల సందర్భంగా నెలకొన్న రాజకీయ వేడి ప్రస్తుతం స్ట్రాంగ్ రూముల వద్దకు చేరింది. పోలింగ్ ముగిసినప్పటి నుంచి పల్లెల్లో ఎక్కడ చూసినా ఎవరిది గెలుపు? ఏ పార్టీకి పైచేయి లభించనుంది? అనే చర్చలు జోరుగా సాగుతున్నాయి. అభ్యర్థులు, పార్టీ నాయకులు తమ తమ విజయావకాశాలపై అంచనాలు వేసుకుంటుండగా, సాధారణ ప్రజల్లోనూ ఎన్నికల ఫలితాలపై ఆసక్తి నెలకొంది.

గెలుపుపై ఎవరి ధీమా వారిదే

పోలింగ్ ముగియడంతో అభ్యర్థుల్లో ఉత్కంఠ నెలకొంది. తమకే మెజారిటీ ఓట్లు వస్తాయని, తమ మండలంలో పార్టీ జెండా ఎగురవేయడం ఖాయమని ప్రధాన పార్టీల నేతలు, అభ్యర్థులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. పోలింగ్ శాతం, బూత్‌ల వారీగా నమోదైన ఓటింగ్, తమకు అనుకూలంగా ఉన్న ఓటర్ల సంఖ్యను బేరీజు వేసుకుంటూ విజయావకాశాలను అంచనా వేస్తున్నారు. ఎన్నికల ప్రచార సమయంలో తమకు లభించిన స్పందన, గ్రామాల్లో తమకు ఉన్న వ్యక్తిగత పరిచయాలు, పార్టీ బలాబలాలు గెలుపునకు దోహదపడతాయని భావిస్తున్నారు.

బూత్‌ల వారీగా లెక్కలు.. అభ్యర్థుల్లో ఉత్కంఠ

ఎన్నికల్లో తమకు ఎక్కడ అనుకూలత ఉంది? ఏ గ్రామంలో ఎక్కువ ఓట్లు పోలయ్యాయి? ఏ పోలింగ్ కేంద్రంలో తమకు మెజారిటీ వచ్చే అవకాశం ఉంది? అనే అంశాలపై అభ్యర్థులు, వారి అనుచరులు విశ్లేషణలు చేసుకుంటున్నారు. పోలింగ్ శాతం ఆధారంగా తమ విజయావకాశాలను లెక్కగడుతున్నారు. ప్రత్యర్థి పార్టీలకు ఎక్కడ బలమైన మద్దతు లభించిందనే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నారు. ఈ క్రమంలో గ్రామాలు, పోలింగ్ కేంద్రాల వారీగా రాజకీయ చర్చలు కొనసాగుతున్నాయి.

సైలెంట్ ఓటింగ్.. ఎవరి కొంప ముంచుతుందో?

స్థానిక సంస్థల ఎన్నికల్లో సైలెంట్ ఓటింగ్ కీలక పాత్ర పోషిస్తుందని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. ప్రచార సమయంలో కనిపించిన రాజకీయ వాతావరణానికి భిన్నంగా ఓటర్లు తమ నిర్ణయాన్ని బ్యాలెట్ ద్వారా వెల్లడించే అవకాశం ఉంటుంది. బహిరంగంగా ఒక పార్టీకి మద్దతు తెలిపిన వారు చివరకు ఎవరికి ఓటు వేశారనే విషయం ఫలితాల వరకు తెలియదు. ఈ నేపథ్యంలో సైలెంట్ ఓటింగ్ ఎవరికి అనుకూలించిందన్నది ప్రధాన పార్టీలకు అంతుచిక్కని ప్రశ్నగా మారింది.



అసమ్మతి ఓట్లు.. స్థానిక సమీకరణాల ప్రభావం

పార్టీలలో అంతర్గత విభేదాలు, అసమ్మతి నాయకుల వ్యవహారం, అభ్యర్థుల వ్యక్తిగత ప్రభావం, స్థానిక సమస్యలు ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే అంశాలుగా మారే అవకాశం ఉంది. కొన్ని ప్రాంతాల్లో పార్టీ కంటే అభ్యర్థి వ్యక్తిగత పరిచయాలు, ప్రజలతో ఉన్న సంబంధాలు ప్రాధాన్యత పొందుతాయి. మరికొన్ని చోట్ల అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు, గ్రామాల్లో నెలకొన్న సమస్యలు ఓటర్ల నిర్ణయాన్ని ప్రభావితం చేస్తాయి. దీంతో కేవలం పోలింగ్ శాతాన్ని బట్టి గెలుపును అంచనా వేయడం కష్టమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

స్ట్రాంగ్ రూముల వద్ద భద్రత.. ఫలితాల కోసం ఎదురుచూపులు

పోలింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం ఎన్నికలకు సంబంధించిన బ్యాలెట్ బాక్సులను కట్టుదిట్టమైన భద్రత మధ్య స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచారు. ఎన్నికల సామగ్రి, బ్యాలెట్ బాక్సుల భద్రతపై అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు. ఫలితాల వెల్లడితో గ్రామీణ ప్రాంతాల్లో రాజకీయ పరిస్థితులు మరింత స్పష్టతకు రానున్నాయి.

గ్రామీణ రాజకీయాల్లో కీలక మలుపు

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు గ్రామీణ రాజకీయాల్లో కీలకమైనవిగా భావిస్తారు. మండల పరిషత్, జిల్లా పరిషత్ స్థాయిలో ప్రజాప్రతినిధుల ఎన్నికలు కావడంతో ఈ ఫలితాలు స్థానిక రాజకీయ భవిష్యత్తుపై ప్రభావం చూపనున్నాయి. గ్రామస్థాయిలో పార్టీ బలాబలాలు, నాయకుల ప్రభావం, ప్రజల మద్దతు ఏ మేరకు ఉందో ఈ ఎన్నికల ఫలితాలు వెల్లడించనున్నాయి. విజయం సాధించిన అభ్యర్థులు తమ రాజకీయ ప్రస్థానంలో మరో అడుగు ముందుకు వేయనుండగా, ఓటమి పాలైన అభ్యర్థులకు ప్రజల తీర్పు ఆత్మపరిశీలనకు దారితీయనుంది.

నేడు తేలనున్న అసలు విజేతలు

ఎన్నికల ప్రచారంలో ఎవరి మాటలు వారివి.. పోలింగ్ అనంతరం ఎవరి అంచనాలు వారివి.. కానీ అసలు విజయం మాత్రం ఓట్ల లెక్కింపుతోనే నిర్ధారణ కానుంది. తమకు అనుకూలంగా ఓటింగ్ జరిగిందని భావిస్తున్న అభ్యర్థులు ఫలితాల కోసం ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. గ్రామీణ రాజకీయాల్లో ఆధిపత్యం సాధించేది ఎవరు? స్థానిక పీఠాలను కైవసం చేసుకునేది ఏ పార్టీ? ఓటర్లు ఎవరికి పట్టం కట్టారు? అనే ప్రశ్నలకు నేడు సమాధానం లభించనుంది. దీంతో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ఫలితాలపై రాజకీయ వర్గాలతో పాటు ప్రజల్లోనూ తీవ్ర ఆసక్తి నెలకొంది.ఎవరి ధీమా వారిదే.. ఎవరి అంచనాలు వారివే.. కానీ ప్రజల తీర్పు మాత్రం బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తమై ఉంది. ఆ తీర్పు వెల్లడయ్యే వేళ గ్రామీణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలు తెరపైకి రానున్నాయి.

ప్రజాభూమి

జనరల్

శనివారం, నవంబర్ 07, 2026

12



ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి దోమల వల్ల కలిగే వ్యాధులను నిర్మూలిద్దాం

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ

విజయవాడ నగరంలో దోమల ద్వారా వ్యాపించే డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధులను సమర్థవంతంగా నివారించేందుకు ప్రతి ఇంటిలో ప్రతి శుక్రవారం డ్రై డేను తప్పనిసరిగా పాటించాలని విజయవాడ నగరపాలక సంస్థ బయాలజిస్ట్ సూర్యకుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం చేపల మార్కెట్ మరియు గాంధీ నగర్ పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు దోమల నివారణపై సూచనలు అందించారు.ఈ సందర్భంగా బయాలజిస్ట్ సూర్యకుమార్ మాట్లాడుతూ నగరంలో దోమల ఉత్పత్తిని అరికట్టేందుకు విజయవాడ నగరపాలక సంస్థ శాస్త్రీయ పద్ధతుల్లో విస్తృత చర్యలు చేపడుతోందన్నారు. ప్రధాన కాలువల్లో పూడిక తొలగింపు చేపట్టి ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా నిరంతర చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ట్రాక్టర్ ఆధారిత ప్రత్యేక యంత్రాలు, బోట్ల సహాయంతో కాలువల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్కలు, చెత్తాచెదారం, ఇతర వ్యర్థాలను తొలగిస్తున్నామని చెప్పారు.నిబ్బంది చేరుకోలేని ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా ఎంఎల్ ఆయిల్ స్ప్రే చేసి దోమల లార్వా పెరగకుండా నివారణ చర్యలు చేపడుతున్నామని తెలిపారు.



అదేవిధంగా నగరంలోని వివి ధ ప్రాంతాల్లో నిరం తరం ఫాగింగ్, యాంటీ లార్వల్ స్ప్రేయింగ్ నిర్వ హించడంతో పాటు, దోమల లార్వాను ఆహారంగా తీసు కునే గాంబూసియా చేప ల ను నీటి వనరు ల్లో విడిచి పెట్టి జీవసంబంధిత పద్ధతు లను కూడా అమలు చేస్తు న్నామ ని వివరించారు.నగరపాలక సంస్థ చర్యలతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రతి ఇంటి లో వారానికి ఒకరోజు, ముఖ్యంగా ప్రతి శుక్రవారం 'డ్రై డే'గా పాటించి, ఇంటి లోపల, బయట, డాబాపై మరియు పరిసర ప్రాంతాల్లో ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచిం చారు. వాడుకలో లేని బకెట్లు, మగ్గులు, తొట్లు, డ్రమ్ములు, పూల కుండీలు, కొబ్బరి చిప్పలు, టైర్లు, కూలర్లు, ఫ్రిజ్ ట్రేలు, నీటి నిల్వ ఉండే ఇతర పాత్రలను ప్రతి శుక్రవారం తప్పనిసరిగా పరిశీలించి వాటిలోని నీటిని పూర్తిగా పారబోయాలని సూచించారు. కేవలం ఐదు నుంచి ఏడు రోజుల పాటు నిల్వ ఉన్న నీటిలోనే దోమల లార్వా వేగంగా అభివృద్ధి చెందుతుందని, అందువల్ల వారానికి ఒక సారి నీటి నిల్వలను తొలగించడం ద్వారా దోమల ఉత్పత్తిని గణనీయంగా తగ్గించవచ్చని వివరిం చారు. అవగాహన కార్యక్రమంలో భాగంగా అధికారులు ఇంటింటికీ వెళ్లి నీరు నిల్వ ఉండే ప్రదే శాలను గుర్తించి ప్రజలకు ప్రత్యక్షంగా చూపిస్తూ, వాటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేయ డం ద్వారా దోమల వ్యాప్తిని శాశ్వతంగా నియంత్రించవచ్చని వివరించారు. పరిశు భ్రమైన పరిస రాలు, ప్రజల అప్రమత్తత, నగరపాలక సంస్థ చర్యలు కలిసివస్తేనే దోమల ద్వారా వ్యాపించే వ్యాధు లను పూర్తిగా నియంత్రించగలమని తెలిపారు.ఈ కార్యక్రమంలో బయాలజిస్ట్ తో పాటు సబ్ యూనిట్ ఆఫీసర్ సుబ్బారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మలేరియా విభాగం సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నాగుల చవితికి భక్తులకు అన్ని సదుపాయాలు ఏర్పాటు చేస్తాం

మోపిదేవి శ్రీవల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానం ఈ వో డి శ్రీరామ వరప్రసాదరావు

ప్రజా భూమి ప్రతినిధి అవనిగడ్డ



నాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్రంలోనే ప్రసిద్ధ దేవాలయంగా మహిమాన్వితఆలయంగా ప్రసిద్ధిగాంచిన కృష్ణాజిల్లా మోపిదేవి మండలంలోని శ్రీ వల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్య స్వామి దేవాలయంలో నాగుల చవితి రోజున భక్తులకు సకల సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నట్టు మోపిదేవి దేవస్థానం కార్యనిర్వాహణాధికారి డి శ్రీరామ వరప్రసాదరావు విలేకరుల సమావేశంలో తెలియజేశారునాగుల చవితి సందర్భంగా స్వామివారిని దర్శించుకునేందుకు రాష్ట్రం నలుమూలల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్నందున భక్తులకు ఎటు వంటి అసౌకర్యాలు కలగకుండా తగు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

నాగుల చవితి సంద ర్భంగా రాష్ట్ర నలుమూలల నుండి వచ్చే భక్తులు నాగదేవతలకు పూజలు, స్వామివారి పుట్టలో పాలు పోయుటకు అనువుగా భక్తులకు అన్ని సకల సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు.ఈ పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ పరిసరాల్లో భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేయనున్నారు. భక్తులు ప్రశాంతంగా స్వామివారిని దర్శించుకుని పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారు ఆశీస్సులు పొందాలని ఆయన తెలిపారు.మోపిదేవి శ్రీ వల్లి దేవసేన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం అర్చకులు... ఘనాపాటి మాట్లాడుతూ శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని నాగుల చవితి రోజున దర్శించుకున్న వారికి అష్టైశ్వర్యాలు కలుగుతాయని దోషాలు నశింపబడతాయని భక్తులు విరివిగా వచ్చి స్వామివారిని దర్శించుకుని తమ మొక్కుబడులు తీర్చుకోవాలని సూచించారు.

ఎంపీటీసీ, జెడ్‌పీటీసీ ఓట్ల లెక్కింపునకు విస్తృత ఏర్పాట్లు

- శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా భద్రతా చర్యలు
- జిల్లాలో తొమ్మిది చోట్ల కౌంటింగ్‌కు సౌకర్యాల కల్పన
- దాదాపు 1,500 మంది సూపర్‌వైజర్లు, అసిస్టెంట్లు, ఇతర సహాయ సిబ్బంది
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ:
ఎంపీటీసీ, జెడ్‌పీటీసీ ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపు ప్రక్రియను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఎన్టీఆర్ జిల్లాలో విస్తృత ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. 16 జెడ్‌పీటీసీ, 276 ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా తొమ్మిది ప్రాంతాల్లో ఓట్ల లెక్కింపు కేంద్రాలను ఏర్పాటు చేసి, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించినట్లు పేర్కొన్నారు.శుక్రవారం కలెక్టర్ లక్ష్మీశ.. జెడ్‌పీ సీఈవో పి.సుశీల, విజయవాడ ఆర్‌డీవో వెన్నెల శ్రీను, రిటర్నింగ్ అధికారి కేవీఎస్‌ఆర్ రవికుమార్‌తో కలిసి విజయవాడ సబ్‌కలెక్టర్ కార్యాలయంవద్దగల మాంటిస్సోరి కళాశాల ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన విజయవాడ రూరల్ కౌంటింగ్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఓట్ల లెక్కింపునకు చేసిన ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లా డారు. 18 కౌంటింగ్ హాళ్లు, 281 కౌంటింగ్ టేబుళ్లతో పాటు ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు సుమారు 1,500 మంది కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, ఇతర సహాయ సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. వీరికి ఎన్నికల నిబంధనలు, ఓట్ల లెక్కింపు విధానం, అనుసరించాల్సిన మార్గదర్శకాలపై తగిన శిక్షణ అందించినట్లు పేర్కొన్నారు. ఓట్ల లెక్కింపు నిర్వహించే కేంద్రాల్లో కౌంటింగ్ హాళ్లు, టేబుళ్లు, బారికేడ్లు, ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, సీసీ కెమెరాలు, తాగునీరు, విద్యుత్, వెలుతురు, ప్రత్యా మ్నాయ విద్యుత్ సరఫరా, భద్రతా ఏర్పా ట్లను పూర్తి చేసినట్లు వెల్లడించారు. రిటర్నింగ్ అధికారులు రౌండ్ల వారీగా వివరాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి ధ్రువీకరించిన తర్వాత ఎన్నికల ఫలితాలను అధికారికంగా ప్రకటిస్తారని తెలిపా రు. కౌంటింగ్ కేంద్రాలు, బయట ప్రదేశాల్లో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగ కుండా పటిష్ట పోలీసు భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతి ఉన్న వ్యక్తులను మాత్రమే గుర్తింపుకార్డులతో అనుమతించడం, రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలను కచ్చితంగా అమలు చేయడం, కౌంటింగ్ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించడం వంటి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములైన అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ఓట్ల లెక్కింపును ప్రశాంతంగా, పారదర్శకంగా పూర్తిచేసేలా దిశానిర్దేశం చేసినట్లు వెల్లడించారు.

తొమ్మిది చోట్ల కౌంటింగ్‌కు ఏర్పాట్లు:
ఎ.కొండూరు, విస్సన్నపేట, తిరువూరు, గంపల గూడెం మండలాల సెగ్మెంట్లకు సంబంధించి కౌంటింగ్ తిరువూరులోని శ్రీ వాహిని ఇన్‌స్టి ట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల కేంద్రంలో జరుగుతుందని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. విజయవాడ రూరల్ మండలానికి సంబంధించి విజయవాడ సబ్ కలెక్టర్ కార్యాల యం, ఓల్డ్ మాంటిస్సోరి కళాశాలలో జరుగు తుందన్నారు.
జి.కొండూరుకు కుంటముక్క లలోని లక్కిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కౌంటింగ్ జరుగుతుందని తెలిపా రు. అదేవిధంగా మైలవరం, రెడ్డిగూడెం మండ లా లకు మైలవరంలోని లక్కిరెడ్డి హనిమిరెడ్డి ఇండోర్ స్టేడియంలో, ఇబ్రహీంపట్నంకు కొండపల్లి జెడ్‌పీ బాలికల హైస్కూల్‌లో, జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాలకు జగ్గయ్యపేటలోని ఎస్‌జీఎస్ కళాశాల కేంద్రంలో జరుగుతుందన్నారు. నందిగామ మండలానికి నందిగామ జెడ్‌పీ ఉన్నతపాఠశాలలో, చందర్లపాడుకు నందిగామ కేవీఆర్ డిగ్రీ కళాశాలలో కంచికచర్ల, వీరుళ్లపాడు మండలాలకు కంచికచర్ల మార్కెట్‌యార్డులో ఏర్పాటుచేసిన కౌంటింగ్ కేంద్రంలో కౌంటింగ్ ప్రక్రియకు ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

ఓట్ల లెక్కింపు ప్రక్రియ పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలి

కౌంటింగ్ అధికారులకు స్వయంగా శిక్షణ ఇచ్చి సూచనలు చేసిన జిల్లా కలెక్టర్ డీకే బాలాజి

ప్రజాభూమి ప్రతినిధి,గన్నవరం:
ఓట్ల లెక్కింపు ప్రక్రియను పకడ్బందీగా, పారద ర్శకంగా నిర్వహిస్తూ, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి అధికారులను ఆదేశించారు. జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలు–2026 నిర్వహ ణలో భాగంగా శనివారం గన్నవరం మండలంలోని సెయింట్ జాన్స్ హైస్కూల్లో జరగనున్న జడ్పీటీసీ, ఎంపిటిసి ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి శుక్రవారం జిల్లా కలె క్టర్ కౌంటింగ్ కేంద్రాన్ని సందర్శించి ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా కౌంటింగ్ కేంద్రంలో చేపట్టిన ఏర్పాట్లను పరిశీ లించిన జిల్లా కలెక్టర్, కౌంటింగ్ విధుల్లో పాల్గొనే అధికారులకు స్వయంగా శిక్షణ ఇచ్చి, ఓట్ల లెక్కింపు ప్రక్రియను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పలు సూచనలు చేశారు. కౌంటింగ్ సమయంలో ఎన్నికల నియ మా వళి ని, నిబంధనలను తప్పనిసరిగా పాటిం చాలని, ప్రతి దశలో అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. అనంతరం కౌం టింగ్ కేంద్రంలో బ్యాలెట్ బాక్సుల ను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్‌ల భద్రత, బ్యాలెట్ బాక్సు ల భద్రపరి చిన విధానం, కౌంటింగ్‌కు అవస రమైన ఏర్పాట్లను సమీక్షించారు. ఓట్ల లెక్కింపు ప్రారంభం నుంచి పూర్తయ్యే వరకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసర మైన అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికా రులను ఆదేశించారు.కౌంటింగ్ ప్రక్రియ సజావుగా, ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తూచా తప్పకుండా



అమలు చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు.కలెక్టర్ వెంట తాసిల్దార్ శివయ్య, ఎన్నికల అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఓట్ల లెక్కింపులో నిబంధనలను ఖచ్చితంగా పాటించాలి

కౌంటింగ్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా జాగ్రత్త వహించాలి : కలెక్టర్ డీకే బాలాజి



ప్రజాభూమి ప్రతినిధి,మచిలీపట్నం:
కృష్ణా జిల్లాలో శనివారం నిర్వహించనున్న ఎంపీ టీసీ, జడ్పీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపులో నిబంధ నలను ఖచ్చితంగా పాటిస్తూ ప్రక్రియను పకడ్బం దీగా, పారదర్శకంగా, ఎలాంటి పొరపా ట్లకు తావులేకుండా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాత్రి మచిలీపట్నంలోని తన క్యాం పు కార్యాల యం నుంచి రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, ప్రత్యేక అధికారులు, మాస్టర్ ట్రైనర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఓట్ల లెక్కింపు ఏర్పాట్లు, అనుసరించాల్సిన విధివిధానాలపై పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఎం. నవీన్, సహాయ కలెక్టర్ నమ్రత అగర్వాల్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఓట్ల లెక్కింపు ప్రక్రి యకు సంబంధించిన అంశాలను వివరించారు. స్ట్రాంగ్ రూమ్‌ల నుంచి బ్యాలెట్ బాక్సులను కౌంటింగ్ టేబుళ్ల వద్దకు తరలించే విధానం, బ్యాలెట్ పేపర్ల విభజన, ప్రారంభ లెక్కింపు, అభ్యర్థుల వారీగా వివరమైన లెక్కింపు, ఫలితాల నమోదు తదితర అంశాలపై అధికారులకు అవగాహన కల్పించారు.కౌంటింగ్ ప్రక్రియ ఉదయం 7 గంటలకు ప్రారంభమవుతుందని, ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందు గానే పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రతి కౌంటింగ్ టేబుల్‌పై పోస్టల్ బ్యాలెట్, ప్రారంభ లెక్కింపు, ఎంపీటీసీ, జడ్పీటీసీ వివరాల నమోదు కోసం అవసరమైన రిజల్ట్ షీట్లు, డిక్లరేషన్ ఫారాలు అందుబాటులో ఉంచాలన్నారు. బ్యాలె ట్ పేపర్ల విభజన కోసం పింక్, వైట్ ట్రేలను, అభ్యర్థుల వారీగా బ్యాలెట్లను వేరు చేసేందుకు అవసరమైన ట్రేలను ప్రతి టేబుల్‌పై సిద్ధం చేయాలని ఆదేశించారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ బ్యాలెట్ బాక్సుల కోసం ప్రత్యేక డ్రమ్‌లు, రబ్బర్ బ్యాండ్లు, పేపర్ వైట్‌లు, తిరస్కరణ స్టాంపులు, ప్లేట్లు, స్టేషనరీ, పెన్నులు, ప్యాడ్లు, కాలిక్యులేటర్లు తదితర సామగ్రిని ముందుగానే ఏర్పాటు చేసుకో వాలన్నారు. చెల్లని ఓట్లను తిరస్కరించే సమ యంలో అందుకు గల కారణాలను నిబంధనల ప్రకారం స్పష్టంగా నమోదు చేయాలని, ఈ విషయంలో కౌంటింగ్ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించా రు. ప్రతి టేబుల్‌కు ప్రారంభ లెక్కింపు, వివరమైన లెక్కింపు ప్రక్రియలకు అనుగుణంగా నేమ్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు.కౌంటింగ్ హాళ్లలో టేబుల్ నంబర్లు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, ప్రింటర్, ప్రత్యేక ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, మీడియా పాయింట్లను ఏర్పాటు చేయాలని తెలిపారు. కౌంటింగ్ సిబ్బందికి, విధుల్లో పాల్గొనే ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా గుర్తింపు కార్డులు జారీ చేయాలని, ఐడీ కార్డులు లేని వారిని పోలీసు సిబ్బంది అనుమతించరని స్పష్టం చేశారు. ప్రతి కౌంటింగ్ హాల్‌కు ఇద్దరు మాస్టర్ ట్రైనర్లను కేటాయించామని, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, రిజర్వ్ సిబ్బంది సహా అందరికీ గుర్తింపు కార్డులు అందేలా చూడాలన్నారు.కౌంటింగ్ కేంద్రాల్లో సిబ్బందికి అవసరమైన ఆహారం, టీ, తాగునీటి సౌకర్యాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని సూచించారు. సిబ్బందికి నిర్ణీత సమయాల్లో బిస్కెట్లు, స్నాక్స్ వంటి అల్పాహారాన్ని అందు బాటులో ఉంచాలని, అవసరమైన మేరకు సహా యక సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు.ప్రతి కౌంటింగ్ సెగ్మెంట్‌కు అవసర మైన దానికంటే రెట్టింపు సంఖ్యలో టేబుళ్లను సిద్ధం చేసుకోవాలని, ఒక్కో గదిలో సగం టేబుళ్లు ఏర్పాటు చేసి, రెండు పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన బ్యాలెట్ బాక్సులను ఒకే గదిలో ఉంచే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఆయా పోలింగ్ కేంద్రాలకు చెందిన అభ్యర్థుల ఏజెంట్ల సమక్షంలో ఒక్కొక్క బ్యాలెట్ బాక్సును క్రమపద్ధ తిలో తెరిచి లెక్కింపు చేపట్టాలని, అన్ని బ్యాలెట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు సంబంధిత ఏజెంట్లు అక్కడే ఉండేలా చూడాలన్నారు.ఎంపీటీసీ, జడ్పీటీసీ ఓట్ల లెక్కింపును ఒకేసారి సమాంత రంగా నిర్వహించాలని, ఒక గదిలోని బ్యాలెట్ పేపర్లను మరొక గదికి తరలించడానికి వీల్లేదని స్పష్టం చేశారు. అన్ని టేబుళ్ల వద్ద మొద ట ప్రారంభ లెక్కింపు ప్రక్రియను పూర్తిచేసిన అనంతరం మాత్రమే అభ్యర్థుల వారీగా వివరమైన లెక్కింపు చేపట్టాలని, ప్రారంభ లెక్కింపు సమయంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్య ర్థుల ఏజెంట్లు అందుబాటులో ఉండేలా చూడా లని సూచించారు.ప్రతి కౌంటిం గ్ కేంద్రంలో మీడియా కోసం ప్రత్యేక గదిని కేటాయించి, టీవీ లేదా స్క్రీన్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కౌంటింగ్ ఫలితాలను ఎప్పటిక ప్పుడు మీడియాకు అందు బాటులో ఉంచేం దుకు అవసరమైన చర్యలు తీసుకోవాల న్నారు. కౌంటింగ్ హాళ్లలో ఆన్‌లైన్ డేటా ఎంట్రీని జిల్లా స్థాయి అధికారుల పర్యవేక్షణలోనే నిర్వహించా లని, స్వర్ణ పంచాయతీ యాప్ లేదా ఇతర పోర్టల్లలో ఫలితాల వివరాలను నమోదు చేసే సమ యంలో ఎలాంటి తప్పులు జరగకుండా జాగ్ర త్తలు తీసుకోవాలని సూచిం చారు. ఎంపీడీవోలు, తహశీల్దార్లు, ప్రత్యేక అధికారులు తమకు కేటాయించిన కౌంటింగ్ గదుల్లో ప్రక్రియ సజావుగా జరిగేలా నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశించారు.వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్వోలు, ఏఆర్వోలు, ప్రత్యేక అధికా రులు తదితర ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం

కౌంటింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి
జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ
ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం
సిబ్బంది, ఏజెంట్లు ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలి



ప్రజాభూమి ప్రతినిధి,జగ్గయ్యపేట:
జిల్లాలో నిర్వహించిన జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రశాంత వాతావ రణంలో, ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా, పారదర్శకంగా నిర్వహించేం దుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి. లక్ష్మీశ తెలిపారు.ఈ నేపథ్యంలో శుక్రవారం జగ్గయ్యపేట ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తున్న పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే ఎన్నికల సిబ్బందికి కల్పించిన ఏర్పాట్లు, బ్యాలెట్ ప్రక్రియ నిర్వహణ తీరును తనిఖీ చేసి, సంబంధిత అధికా రులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు కోసం ఎస్.జి.ఎస్. కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని కలెక్టర్ క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. కౌంటింగ్ హాల్‌లో ఏర్పాటు చేసిన టేబుళ్లు, కౌంటర్లు, బారికేడ్లు, సిబ్బంది విధుల నిర్వహణకు కేటాయించిన ప్రదేశాలు, కౌంటింగ్ ఏజెంట్లకు కల్పించిన సీటింగ్ ఏర్పాట్లు, వారి రాకపోకలకు నిర్దేశించిన మార్గాలను పరిశీలించారు.కౌంటింగ్ ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఎన్నికల నిబంధ నల ప్రకారం కౌంటింగ్ సిబ్బంది, అభ్యర్థులు, ఏజెంట్లకు నిర్దేశించిన ప్రదేశాలను స్పష్టంగా కేటాయించాలని, కౌంటింగ్ హాల్‌లో క్రమశి క్షణ, సమన్వయం పాటించేలా చర్యలు తీసుకో వాలని ఆదేశించారు. పోలీస్ శాఖతో సమన్వ యం చేసుకుంటూ పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు కల్పించాలని సూచించారు. జిల్లా పరిధిలోని 3 డివిజన్లు, 16 మండలాల పరిధిలో మొత్తం 16 జడ్పీటీసీ స్థానాలు, 276 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు. ఓట్ల లెక్కింపు కోసం జిల్లా వ్యాప్తంగా 9 ప్రాంతాల్లో కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ప్రతి కౌంటింగ్ కేంద్రం లో మూడు నుంచి నాలుగు మండలాలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు జరిగేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు. తిరువూరు, మైలవరం, జగ్గయ్యపేట, నందిగామ, విజయవాడ నగరంలో కూడా కౌంటింగ్ కేంద్రాలను సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులే కుండా నిర్వహించేందుకు జిల్లా వ్యాప్తంగా సు మారు 1,500 మంది కౌంటింగ్ సిబ్బందిని నియ మించినట్లు కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా పటిష్టమైన శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీ స్ శాఖ తరఫున సుమారు 1,500 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. పోలీస్ కమిషనర్, కలెక్టర్, ఆర్డీవోలు, ఏసీపీలు, డీఎస్పీలు, పంచాయతీరాజ్, జిల్లా పరిషత్ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ కౌంటింగ్ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తారని తెలిపారు. నవంబర్ 7వ తేదీ శనివారం ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమవుతుందని కలెక్టర్ తెలిపారు. కౌంటింగ్ విధులు నిర్వహించే సిబ్బం ది ఉదయం 6:30 గంటల నుంచి 7 గంటల మధ్య తమకు కేటాయించిన కౌంటింగ్ కేంద్రా లకు తప్పనిసరిగా చేరుకోవాలని ఆదేశించారు. తొలుత బ్యాలెట్ పేపర్లను నిబంధనల ప్రకారం వర్గీకరించిన అనంతరం ఓట్ల లెక్కింపు చేపడతా రని తెలిపారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు ఏకకాలంలో కొనసాగుతుందని పేర్కొ న్నారు. ప్రతి దశలోనూ ఎన్నికల నిబంధనలు, నిర్దేశిత విధివిధానాలను ఖచ్చితంగా పాటించాలని అధికారులకు సూచిం చారు.వివిధ రాజకీయ పార్టీలు, అభ్యర్థుల తరఫున నియమితులైన కౌంటింగ్ ఏజెంట్లు ఉదయం 7 గంటల కల్లా సంబంధిత కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ సూచించారు.

Printed by MOHANEESWAR PUBLICATIONS Published by ANKIREDDYPALLE RAMAMOHAN REDDY on behalf of ANKIREDDYPALLE RAMAMOHAN REDDY , printed at West Godavari and published at D. No.11-12-124, Nawabpetcolony,3rd Division, Eluru editor ANKIREDDYPALLE RAMAMOHAN REDDY .RNI NO:APTEL/25/A1219.cell:9502116677.

ప్రజాభూమి

జనరల్ 13

శనివారం 7 నవంబర్ 2026

కరటూరి గిరిజనులు ఎన్నికలు బహిష్కరణ!

- ముందు మా హక్కులే!
- తర్వాతే ఓటు హక్కు!
- మీ వాళ్లను నిలబెట్టుకోండి, పార్లమెంట్లో డిమాండ్ చేయండి!

ప్రజాభూమి ప్రతినిధి, జీలుగుమిల్లి

ఏళ్ల తరబడి గిరిజనులను ప్రభుత్వ మోసం చేస్తూనే ఉందని, ఆ మోసాలకు గురవుతూనే ఉన్నామని గత్యంతరం లేని పరిస్థితిలో ఎంపీటీసీ జెడ్పీటీసీ ఎన్నికలను బహిష్కరిస్తున్నామని కరుటూరి గిరిజనులు వాపోయారు. మా భూములు, ఇళ్ళ పూర్తిగా కోల్పోయి నిరాశరులయం. ఏళ్లు గడుస్తున్న మమ్మల్ని పట్టించుకోవడం లేదని జీలుగుమిల్లి తహసిల్దారి వెంకటేశ్వరను గిరిజనులు నిలబెట్టారు. కరాకండిగా తేల్చి చెప్పారు. ఎక్కడో ఉన్న మమ్ములను ఈ ప్రాంతాన్ని తీసుకొచ్చి పడవేసి భూములు ఇవ్వలేదు, ఇల్లు ఇవ్వలేదు పూర్తిగా, కనీస వసతులు లేకుండా అల్లాడిపోతున్నామని ఎమ్మార్వో ను నిలదీశారు. పోలవరం ప్రాజెక్టుకు భూములు ఇచ్చి ఎక్కడో కానుకంతలో ఉన్న వైజాగ్ ప్రజలకు ద్రాహార్తి తీస్తున్నామని అయినా మమ్మల్ని పట్టించుకోవటం లేదంటూ వారు వాపోయారు. ముందు మాకు అక్కులే ప్రధానమని తర్వాతే ఓట్లు వేస్తాం అంటూ వారు ఎమ్మార్వో కి ఎదురు తిరిగారు. మా భూములు ప్రభుత్వానికి ఇచ్చి మేము సుప్రీంకోర్టుకు వెళ్ళటం ఏంటి అని వారు అమ్ము ఎమ్మార్వో ను నిగ్గదీశారు. “ఆలు లేదు సోలు లేదు “ గెలిచిన తర్వాత సుప్రీంకోర్టు కి వెళ్ళాలంట ఏంటండీ మా గిరిజనుల పరిస్థితి ఇది అంటూ గిరిజనులు ఎదురు తిరిగారు. కనీస స్థానికులు గాని అధికారులు కానీ రాజకీయ నాయకులు గానీ ఎన్నికలు ఎప్పుడు మా గ్రామాలను పట్టించుకోవట్లేదు అంటూ వారు



వాపోయారు. ఎమ్మార్వో వింత వాదనతో గిరిజనులు కోపోద్రికలయ్యారు. మీడియా ముందు గిరిజల్లు యాకవురు పెట్టారు. ఏదేమైనా రానున్న పంచాయతీ ఎన్నికలు కూడా బహిష్కరిస్తామని, అటు తరువాత తీవ్రమైన చర్యలు కూడా వెనకాడబోమని వారు హెచ్చరించారు. దీంతో ఏమి పాల్గొని అధికారి గణం తట్ట బుట్ట సర్దుకుని వెని తిరిగారు. దీనిపై జిల్లా అధికారిగా గణం చర్యలు తీసుకుంటుందో వేచి చూడాలి.



విద్యుత్ పునరుద్ధరణ పనుల్లో పాల్గొంటున్న ఇతర రాష్ట్రాల సిబ్బందిని కలిసిన మంత్రి గొట్టిపాటి

ప్రజాభూమి ప్రతినిధి, సంతనూతలపాడు:

సంతనూతలపాడు నియోజకవర్గ పరిధిలోని నిడమానూరు, నాగులుప్పలపాడు, వినోదరాయునిపాలెం ప్రాంతాల్లో తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థ పునరుద్ధరణకు చేపట్టిన పనులను రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యుత్ పునరుద్ధరణ పనుల్లో పాల్గొంటున్న తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన విద్యుత్ సిబ్బందితో పాటు, అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం నుంచి వచ్చి సేవలందిస్తున్న సిబ్బందిని మంత్రి కలుసుకుని మాట్లాడారు. ఈ సందర్భంగా సిబ్బందికి కల్పిస్తున్న ఆహారం, వసతి సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. విధి నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. తుఫాన్ పరిస్థితుల్లో సొంత ప్రాంతాలను వదిలి వచ్చి విద్యుత్ పునరుద్ధరణ పనుల్లో సేవలందిస్తున్న సిబ్బంది అంకితభావాన్ని మంత్రి అభినందించారు. ప్రజలకు వీలైనంత త్వరగా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేలా పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

బోటు మునిగి తమిళ జాలర్లు మృతి చెందడంపై సీఎం చంద్రబాబు విచారం



- మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపిన ముఖ్యమంత్రి
- మరో ఇద్దరు ఆచూకీ కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేయాలని సీఎం ఆదేశంలి

ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి: తమిళనాడు మత్స్యకారుల బోటు ప్రమాదంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. సముద్రంలో మత్స్యకారుల బోటు ప్రమాదంలో చిక్కుకుని పలువురు మృత్యువాతపడడం దురదృష్టకమని సీఎం అన్నారు. మురసు తుపాను ప్రభావంతో సముద్రంలో ప్రతికూల వాతావరణ పరిస్థితులు నెలకొన్న సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకోవడం ఆవేదన కలిగించిందన్నారు. మృతుల కుటుంబాలకు ముఖ్యమంత్రి ప్రగాఢ సానుభూతి తెలిపారు. తమిళనాడు బోటు ప్రమాదం... గల్లంతైన వారి కోసం జరుగుతున్న గాలింపు చర్యలపై సీఎం అధికారులను అడిగి తెలుసుకున్నారు. గత మూడు రోజులుగా గాలింపు చర్యలు చేపడుతున్నామని అధికారులు తెలిపారు. పలువురు మత్స్యకారులు మరణించిన స్థితిలో ఉండగా ప్రకాశం జిల్లా కొత్తపట్నం సముద్ర తీరానికి బోటు కొట్టుకు వచ్చిందని అధికారులు చెప్పారు. ఈ బోటులో ప్రయాణిస్తున్న తొమ్మిది మందిలో ఏడుగురు మృతి చెందగా.. మరో ఇద్దరు గల్లంతు అయ్యారని తెలిపారు. మత్స్యకారుల మృతదేహాలను గుర్తించి సహాయక చర్యలు చేపడుతున్నామని అధికారులు తెలిపారు. మరో ఇద్దరి ఆచూకీ కోసం గాలింపు కొనసాగుతోందని వెల్లడించారు. ఇందుకోసం కోస్ట్‌గార్డ్, మెరైన్ పోలీసులు, స్థానిక మత్స్యకారుల బృందాలు సహా సంబంధిత అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సీఎం సూచించారు. మృతదేహాలను గుర్తించడం, పోస్టుమార్టం తదితర అవసరమైన ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేసి వారి కుటుంబాలకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. మత్స్యకారులు తమిళనాడు రాష్ట్రానికి చెందినవారు కావడంతో అక్కడి అధికారులతో సమన్వయం చేసుకుంటూ మృతదేహాలను వారి స్వస్థలాలకు తరలించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు.

గెలిచే నాయకులు ఎవరు?
భవితవ్యం తేలేది నేడే!



ప్రజాభూమి ప్రతినిధి, తాళ్లపూడి

తాళ్లపూడి మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలపై ఉత్కంఠ నెలకొంది. కాబోయే ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ నాయకుల భవితవ్యం బ్యాలెట్ పెట్టెల్లో భద్రంగా ఉండగా, శనివారం ఓట్ల లెక్కింపుతో అభ్యర్థుల విజయావకాశాలు తేలనున్నాయి. మండలంలోని 15 ఎంపీటీసీ స్థానాలకుగాను తాడిపూడి ఎంపీటీసీ స్థానం ఏకగ్రీవం కావడంతో టీడీపీ ఎంపీపీ అభ్యర్థి నామా నాగ శంకర రాణి తొలి విజయాన్ని అందుకున్నారు. మిగిలిన 14 ఎంపీటీసీ స్థానాల్లో కూటమి అభ్యర్థుల సీట్ల కేటాయింపుల్లో జరిగిన మార్పులు, అసంతృప్త అభ్యర్థుల బుజ్జగింపులు ఓటర్లపై ఎలాంటి ప్రభావం చూపాయన్నది ఆసక్తికరంగా మారింది. మిగిలిన స్థానాల్లో వైకాపా అభ్యర్థులు పోటీ చేయగా, జనసేన మూడు, టీడీపీ 11, బీజేపీ ఒక స్థానంలో బరిలో నిలిచాయి. వర్గాలుగా ఉన్న వైకాపా ఈ ఎన్నికల్లో ఐక్యంగా ముందుకు సాగగా, టీడీపీలో అంతర్గత విభేదాలు ఉన్నప్పటికీ రెబల్స్‌గా అభ్యర్థులు బరిలోకి దిగకపోవడం గమనార్హం. విజయావకాశాలపై కూటమి నేతలు అధికార పక్షానికి అనుకూలంగా ఫలితాలు వస్తాయని, తమ అభ్యర్థుల విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు వైకాపా నాయకులు తమ ప్రభావం తగ్గలేదని, తాళ్లపూడి మండలంలో ఆరు ఎంపీటీసీ స్థానాలు గెలుచుకుంటామని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఓటర్ల తీర్పుపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

కొవ్వాడ వరద బాధితులకు పునరావాస కేంద్రం

200 మందికి భోజన వసతి కల్పించిన రెవెన్యూ శాఖ



ప్రజాభూమి ప్రతినిధి, తాళ్లపూడి

కొవ్వాడ వరద ఉధృతితో అన్నదేవరపేట గ్రామంలోని జాన్‌పేట, అరుంధతీపేట, ఇందిరమ్మ కాలనీల్లోకి నీరు చేరడంతో సుమారు 200 మంది బాధితులకు అధికారులు పునరావాసం కల్పించారు. అల్లూరి సూరన్న జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురువారం రాత్రి నుంచి శుక్రవారం భోజన వసతి ఏర్పాటు చేశారు. ఎన్నికల హడావుడిలో అధికారులు, నాయకులు ఉండగా కొవ్వాడ వరద నీరు ఒక్కసారిగా పెరగడంతో ప్రజలు ఇళ్లలో ఉండలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో రెవెన్యూ అధికారులు తక్షణ చర్యలు చేపట్టి ట్రాక్టర్ల ద్వారా బాధితులను పునరావాస కేంద్రానికి తరలించి భోజన సదుపాయం కల్పించారు. శుక్రవారం కూడా పునరావాస కేంద్రం కొనసాగింది. తహసీల్దార్ లక్ష్మి లావణ్య కేంద్రాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. ఆర్ఐ రామకృష్ణ, వీఆర్వోలు నాగేశ్వరరావు, సంతోష్, ప్రవీణ్, సంజీవ్ పర్యవేక్షణ చేస్తున్నారు. స్థానిక టీడీపీ నాయకులు సకాలంలో ట్రాక్టర్లను పంపించి బాధితుల తరలింపునకు సహకరించారు. వరద నీరు ఇప్పటికీ ఆయా ప్రాంతాల్లో కొనసాగుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మహా పూర్ణాహుతితో ముగిసిన వాడపల్లి వెంకన్న బ్రహ్మోత్సవాలు

- గౌతమి గోదావరి తీరాన వైభవంగా శ్రీనివాసుని చక్రస్నానం.. తొమ్మిది రోజుల పాటు అంగరంగ వైభవంగా ఉత్సవాలు.

ప్రజాభూమి ప్రతినిధి కొత్తపేట

కోనసీమ తిరుమలగా ప్రసిద్ధిగాంచిన ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో తొమ్మిది రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహించిన 14వ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం మహా పూర్ణాహుతితో భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా ముగిశాయి. బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు, వైదిక కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, మహాశాంతి హోమం నిర్వహించిన అనంతరం వేదమంత్రాల నడుమ మహా పూర్ణాహుతి



కార్యక్రమాన్ని వైభవంగా జరిపించారు. అనంతరం ఆలయ సమీపంలోని గౌతమి గోదావరి నదీతీరానికి స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను తీసుకువెళ్లి అవభృథస్నానం (చక్రస్నానం) శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ పవిత్ర ఘట్టాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. గోవింద నామస్మరణలు, వేదమంత్రోచ్ఛారణల మధ్య గోదావరి తీరం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. అనంతరం ఆలయంలో ధ్వజావరోహణ కార్యక్రమాన్ని నిర్వహించి స్వామివారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. సాయంత్రం విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, మహాదాశీర్వచనం, ఏకాంతసేవ తదితర కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. నీరాజన మంత్రపుష్పాలు, తీర్థప్రసాద వితరణతో బ్రహ్మోత్సవాల ముగింపు కార్యక్రమాలు పూర్తయ్యాయి. తొమ్మిది రోజుల పాటు వివిధ అలంకరణలు, వాహన సేవలు, ప్రత్యేక పూజలతో సాగిన బ్రహ్మోత్సవాల్లో భక్తులు విశేషంగా పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఉత్సవాల ముగింపుతో ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఈ కార్యక్రమాల్లో దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ ముదునూరి వెంకటరాజు, కార్యనిర్వహణాధికారి, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



ఓటు హక్కు వినియోగించుకున్న డిసిసిబి మాజీ చైర్మన్ కరాటం రాంబాబు

ప్రజాభూమి, బుట్టాయగూడెం

మాజీ డిసిసిబి చైర్మన్ కరాటం రాంబాబు జడ్పిటిసి ఎంపీటీసీ ఎన్నికలలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలో శుక్రవారం జరిగిన జడ్పిటిసి ఎంపీటీసీ ఎన్నికలలో ఆయన తన ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ 26లో రాంబాబు ఓటు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు విలువైనదని అన్నారు. ఓటు హక్కు పొందడం, ఎన్నికలలో ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడం పౌరుని యొక్క ప్రాథమిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ గుర్తించాలని అన్నారు. ఓటు హక్కు తోనే ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవచ్చని, మంచి ప్రభుత్వాలను ఎన్నుకొని, ప్రజా సంక్షేమ పాలన పొందవచ్చని తెలిపారు.

వరద బాధితులకు టీడీపీ యువత నిత్యావసర సరుకుల పంపిణీ



ప్రజాభూమి ప్రతినిధి, తాళ్లపూడి

తుఫాను ప్రభావంతో కొవ్వాడ వరద నీటి ఉధృతికి తాడిపూడి గ్రామంలో సుమారు 30 కుటుంబాలు నీట మునిగి ఇబ్బందులు పడుతున్నాయి. బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు టీడీపీ సీనియర్ నాయకులు నామా కొండబాబు యూత్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. బియ్యం, వంటనూనె, కూరగాయలతో కూడిన సరుకులను తెలుగు యువత నాయకులు నామా సురేంద్ర కుమార్, సిద్ధన రాధాకృష్ణ బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా సురేంద్ర కుమార్ మాట్లాడుతూ.. కష్టకాలంలో బాధిత కుటుంబాలకు అండగా నిలవడం తమ బాధ్యతని, ఎవరూ అధైర్యపడవద్దని భరోసా ఇచ్చారు. ఆపదలో ఉన్నవారికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వినియోగదారులకు అందుబాటు ధరల్లో దీపావళి టపాసులు

- డీసీఎంఎస్‌లో నాణ్యమైన క్రాకర్స్ విక్రయాలు - కొనుగోలుదారుల హర్షం



ప్రజాభూమి దెందులూరు

దీపావళి పండుగను పురస్కరించుకుని సామాన్య,మధ్యతరగతి ప్రజలకు అందుబాటు ధరల్లో నాణ్యమైన టపాసులు అందించేందుకు ఏలూరు డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.చైర్మన్ చాగంటి మురళీకృష్ణ పర్యవేక్షణలో వట్లూరులోని డీసీఎంఎస్ గోడౌన్‌లో వివిధ రకాల క్రాకర్స్‌ను విక్రయానికి అందుబాటులో ఉంచినట్లు సీనియర్ అధికారి కృష్ణరాజు తెలిపారు.శుక్రవారం గోడౌన్ వద్ద టపాసులు కొనుగోలు చేసిన పలువురు మాట్లాడుతూ, బయటి మార్కెట్‌తో పోలిస్తే డీసీఎంఎస్‌లో తక్కువ ధరలకు నాణ్యమైన క్రాకర్స్ లభిస్తున్నాయని హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా కృష్ణరాజు మాట్లాడుతూ,లాభాపేక్షకు తావులేకుండా ప్రజాసేవే ప్రధాన లక్ష్యంగా సరసమైన ధరలకు టపాసులు అందిస్తున్నామని తెలిపారు. ఏలూరు నగరంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.డీసీఎంఎస్ చేపట్టిన ఈ విక్రయాలపై కొనుగోలుదారులు సంతృప్తి వ్యక్తం చేశారు.

ఏలూరులో ఏసీబీ వలలో పర్యావరణ ఇంజినీర్..!

- ఎన్ఓసీ కోసం రూ.30 వేల లంచం తీసుకుంటూ పట్టుబాటు

ప్రజాభూమి ఏలూరు



కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయంలో ఏసీబీ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. తిమ్మాపురంలో గిడ్డంగి ఏర్పాటుకు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్ఓసీ) మంజూరు చేసేందుకు రూ.లక్ష లంచం డిమాండ్ చేసి, చివరకు రూ.30 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.ఈ క్రమంలో లంచం తీసుకుంటుండగా ఈఈ సీతారామచంద్రమూర్తిని ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు సమాచారం.ఈ ఘటనతో ఏలూరు కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయంలో కలకలం రేగింది. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతికి అడ్డుకట్ట పడాలంటే ప్రజలు చైతన్యవంతులు కావాలి. ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి లంచం డిమాండ్ చేస్తే ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేయాలని అధికారులు సూచిస్తున్నారు.

ప్రజాభూమి

జనరల్ 14

శనివారం 7 నవంబర్ 2026

ఇంద్రకీలాద్రిపై ధనత్రయోదశి, దీపావళి ప్రత్యేక పూజలు

- రాత్రి 7 గంటలకు ఆలయ కవాట బంధనం”

ప్రజాభూమి ప్రతినిధి, ఇంద్రకీలాద్రి

శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో వైదిక కమిటీ వారి సూచనల మేరకు “ధన త్రయోదశి”, “దీపావళి” పర్వదినాలను పురస్కరించుకుని శ్రీ అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజా కార్యక్రమములు శాస్త్రోక్తంగా నిర్వహించబడుతున్నాయని దేవస్థాన కార్యనిర్వహణాధికారి వి.కె. శీనానాయక్ తెలిపారు.

కార్యక్రమముల వివరాలు:

07-11-2026 (శనివారం) – ధన త్రయోదశి ధన త్రయోదశి పర్వదినం సందర్భంగా శనివారం ఉదయం 8:00 గంటలకు పాత యాగశాలలో దేవస్థానం తరఫున (భక్తులకు పరోక్షముగా) శాస్త్రోక్తంగా “శ్రీ మహాలక్ష్మి యాగం” నిర్వహించబడుతుంది.

08-11-2026 (ఆదివారం) – దీపావళి: దీపావళి పర్వదినం సందర్భంగా ఆదివారం ప్రదోష కాలంలో శ్రీ అమ్మవారి ప్రధానాలయములో విశేషంగా “శ్రీ ధనలక్ష్మీ పూజ”, దీపాలంకరణ మరియు బాణాసంచా వెలిగించు కార్యక్రమములు వైభవంగా జరుగుతాయి. దీపావళి పూజా కార్యక్రమములు పూర్తయిన అనంతరం, ఆదివారం రాత్రి సరిగ్గా 7:00 గంటలకు శ్రీ అమ్మవారి ప్రధాన ఆలయముతో పాటు అన్ని ఉపాలయముల తలుపులు మూసివేసి కవాట బంధనం నిర్వహించబడుతుందని భక్తులు గమనించి, జగన్మాత శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల కృపాకటాక్షాలకు పాత్రులు కాగలరని కోరారు.

వరద బాధితులకు అండగా ప్రభుత్వం

- అన్నదేవరపేట పునరావాస కేంద్రాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే ముప్పిడి



ప్రజాభూమి ప్రతినిధి, తాళ్లపూడి

ముసురు తుఫాను ప్రభావంతో వరద బాధితుల కోసం అన్నదేవరపేట అల్లూరి సూరన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు శుక్రవారం పరిశీలించారు. కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి కేంద్రాన్ని సందర్శించి బాధితుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న బాధితులకు ఈవెనింగ్ స్నాక్స్ అందించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సహాయ సహకారాలు అందించాలని సంబంధిత సిబ్బందికి ఎమ్మెల్యే సూచించారు. వరద ప్రభావిత ప్రజలకు అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపు (కౌంటింగ్) కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ



ఎం.పి.టి.సి మరియు జెడ్.పి.టి.సి ఎన్నికల ఓట్ల లెక్కింపును అత్యంత సమర్థవంతంగా, ప్రశాంత వాతావరణంలో పూర్తి చేయడానికి ఎన్.టి.ఆర్.పోలీస్ కమీషనర్ శ్రీ ఎస్.వి.రాజ శేఖర బాబు నేతృత్వంలో 4 ఏ.సి.పి.లు, 12 మంది ఇన్స్పెక్టర్లు, 51మంది ఎస్.ఐ.లతో కలిపి సుమారు 1123 మంది పోలీస్ అధికారులు మరియు సిబ్బందితో జిల్లాలోని ముఖ్యమైన ప్రదేశాలలో పికెట్స్ మరియు కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా నగర పోలీస్ కమీషనర్ మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు మరియు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా వ్యాప్తంగా పట్టిష్ట బందోబస్తు చర్యలు చేపట్టడం జరిగింది. ప్రతీ కౌంటింగ్ కేంద్రం వద్ద ‘మూడు అంచెల భద్రత’ను ఏర్పాటు చేయడం జరిగింది. అనుమతి పత్రాలు ఉన్న అధికారులను, ఏజెంట్లను మాత్రమే సమగ్ర తనిఖీల అనంతరం లోపలికి అనుమతిస్తారన్నారు. కౌంటింగ్ కేంద్రాలు, సమస్యాత్మక ప్రాంతాల్లో, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద సీసీటీవీ కెమెరాలు, డ్రోన్ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. కౌంటింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాల్లో మరియు శాంతిభద్రతల దృష్ట్యా సున్నితమైనవిగా గుర్తించిన గ్రామాలు, ప్రధాన కూడళ్లలో ప్రత్యేక పోలీస్ పికెట్స్ ఏర్పాటు చేశామన్నారు. లెక్కింపు ముగిసిన అనంతరం ఎలాంటి గొడవలకు తావులేకుండా నిబంధనలకు విరుద్ధంగా విజయోత్సవ ర్యాలీలు తీయడం, బాణసంచా కాల్చడం మరియు మైకులు ఉపయోగించడంపై ఆంక్షలు విధించడమైనదన్నారు. సోషల్ మీడియాలో పుకార్లు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు లేదా అవాస్తవాలు ప్రచారం చేసే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను విజయవంతంగా మరియు ప్రశాంతంగా పూర్తి చేసేందుకు రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, వారి మద్దతుదారులు మరియు ప్రజలందరూ పోలీస్ శాఖకు పూర్తి స్థాయిలో సహకరించాలని కోరడమైనది. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని నగర పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ఈ ప్రకటన ద్వారా తెలిపారు.

విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించరాదు

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ

ఎం.పి.టి.సి. మరియు జెడ్.పి.టి.సి. ఎన్నికల ఫలితాలు విడుదలవుతున్న నేపథ్యంలో ఎం.పి.టి.సి. మరియు జెడ్.పి.టి.సి. ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థులు గానీ, వారి మద్దతుదారులు గానీ ఎలాంటి విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులు, డప్పు వాయిద్యాలతో కూడిన ప్రదర్శనలు నిర్వహించడానికి అనుమతి లేదన్నారు. బహిరంగ ప్రదేశాల్లో ప్రజాశాంతికి భంగం కలిగించేలా బాణసంచా కాల్చడం, అధిక శబ్దంతో కూడిన మైక్ సెట్లు/డిజె లను ఉపయోగించడం పూర్తిగా నిషిద్ధమన్నారు. ఎన్.టి.ఆర్.పోలీస్ కమీషనరేట్ పరిధిలో సెక్షన్ 163 బి.ఎన్.ఎస్.ఎస్. మరియు పోలీసు చట్టం (30 ్రశీశ్రీఅఎవ ూూఖీ) అమలులో ఉన్నాయన్నారు.కావున నగరంలో ప్రజల శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా నిషేధాజ్ఞలను ఉల్లంఘించి ర్యాలీలు నిర్వహించినా, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా, లేదా ఇతర వర్గాల మనోభావాలను దెబ్బతీసే విధంగా ప్రవర్తించినా సంబంధిత వ్యక్తులపై కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేయబడతాయన్నారు.

ఎన్నికల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో ముగిసేందుకు అభ్యర్థులు, ప్రజాప్రతినిధులు మరియు ప్రజలందరూ పోలీసు శాఖకు పూర్తి స్థాయిలో సహకరించాలని కోరుతూ, ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరస్పరం శాంతి సామరస్యాలను పాటించాలని నగర పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ఈ ప్రకటన ద్వారా తెలిపారు.

తుపాను బాధిత ప్రతి రైతునూ ఆదుకుంటాం

- శనివారం నాటికి 100 శాతం విద్యుత్ పునరుద్ధరణే లక్ష్యం
- రెండు తుపానులతో విద్యుత్ శాఖకు రూ.500 కోట్లకుపైగా నష్టం
- మురసు తుపానుతో 7,500కు పైగా స్తంభాలు నేలకూలాయి
- మూడు రాష్ట్రాల నుంచి 3 వేల మందికిపైగా సిబ్బంది సేవలు
- విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

ప్రజాభూమి ప్రతినిధి,అద్దంకి

అర్నబ్, మురసు తుపాన్లతో తీవ్రంగా నష్టపోయిన ప్రాంతాల్లో ప్రతి రైతు, ప్రతి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ భరోసా ఇచ్చారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో శనివారం సాయంత్రానికి 100 శాతం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడమే లక్ష్యంగా పనులు చేపట్టినట్లు తెలిపారు. రెండు తుపాన్ల కారణంగా విద్యుత్ శాఖకు రూ.500 కోట్లకుపైగా నష్టం వాటిల్లిందని వెల్లడించారు. మంత్రి శుక్రవారం అద్దంకి, సంతనూతలపాడు నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటించి తుపాను నష్టాన్ని పరిశీలించారు. జె.పంగులూరు మండలంలోని ముప్పవరం, కొండమంజులూరు, కోటపాడు, జనకవరం, తూర్పు తక్కెళ్లపాడు, అలవలపాడు గ్రామాలతో పాటు కొరిశపాడు మండలంలోని పి.గుడిపాడు, కొరిశపాడు, కుర్రవానిపాలెం, రావినూతల గ్రామాలను సందర్శించారు. అనంతరం సంతనూతలపాడు నియోజకవర్గంలోని నాగులుప్పలపాడు మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయ్‌కుమార్ ఆయన వెంట ఉన్నారు. ముప్పవరంలో దెబ్బతిన్న మామిడి తోటలను, కొండమంజులూరులో ధ్వంసమైన నర్సరీని పరిశీలించి రైతులతో మాట్లాడారు. కోటపాడులో కూలిన ఇళ్లు, పశువుల కొట్టాలు, నేలకొరిగిన విద్యుత్ స్తంభాలను పరిశీలించారు. తూర్పు తక్కెళ్లపాడులో పొలాల్లో పడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు, దెబ్బతిన్న విద్యుత్ లైన్లను చూశారు. తుపాను నష్టంపై బాధితులను అడిగి తెలుసుకున్నారు.

పొగాకు సహా పలు పంటలకు నష్టం


తుపాను ప్రభావంతో మొక్కజొన్న, అరటి, బొప్పాయి, ఉసిరి, మామిడి తోటలు దెబ్బతిన్నాయని మంత్రి తెలిపారు. సంతనూతలపాడు, అద్దంకి, ఒంగోలు పరిసర ప్రాంతాల్లో పొగాకు పంటకు భారీ నష్టం వాటిల్లిందన్నారు. ప్రకాశం జిల్లాలో పొగాకు బ్యార్న్‌లు కూడా దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. రైతుల సమక్షంలోనే జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి పంట నష్టం అంచనాలను వేగంగా పూర్తి చేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవ నష్టాన్ని నమోదు చేయాలన్నారు. ఏ ఒక్క రైతుకూ అన్యాయం జరగకుండా పారదర్శకంగా అంచనాలు రూపొందించాలని స్పష్టం చేశారు.

విద్యుత్ శాఖకు రూ.500 కోట్ల నష్టం

అర్నబ్ తుపాను సమయంలో గంటకు 160 కిలోమీటర్ల వేగంతో, మురసు తుపాను సమయంలో 120 కిలోమీటర్లకుపైగా వేగంతో గాలులు వీచాయని మంత్రి వివరించారు. దీంతో విద్యుత్ లైన్లు, కండక్టర్లు తెగిపోవడంతో పాటు డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసమయ్యాయని తెలిపారు. మురసు తుపాను కారణంగానే 7,500కుపైగా విద్యుత్ స్తంభాలు నేలకూలాయని చెప్పారు. ఇళ్లు, పంటలు, ఇతర ఆస్తులకు కూడా భారీగా నష్టం వాటిల్లిందన్నారు.

శనివారం నాటికి పూర్తిస్థాయిలో సరఫరా

విద్యుత్ పునరుద్ధరణ పనులను ప్రాధాన్య క్రమంలో చేపడుతున్నట్లు గొట్టిపాటి తెలిపారు. గోదావరి జిల్లాల్లో తుపాను ప్రభావిత ప్రాంతాలకు గురువారం సాయంత్రానికే పూర్తిస్థాయిలో సరఫరా పునరుద్ధరించామన్నారు. ప్రకాశం, గుంటూరు పరిసర ప్రాంతాల్లోనూ పనులు వేగంగా సాగుతున్నాయని చెప్పారు. వర్షాలు తగ్గినప్పటి నుంచి విద్యుత్ సిబ్బంది నిరంతరాయంగా పనిచేస్తున్నారని, అప్పటికి 70 శాతం సరఫరాను పునరుద్ధరించినట్లు వివరించారు. ఒంగోలు, చిలకలూరిపేట, నరసరావుపేట, అద్దంకి పట్టణాల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పూర్తయిందన్నారు. మిగిలిన ప్రాంతాల్లో మండల కేంద్రాల నుంచి గ్రామాల వరకు పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో 24 గంటలకుపైగా విద్యుత్ సరఫరా నిలిచిపోయిన నేపథ్యంలో ముందుగా గృహ వినియోగదారులకు సరఫరా అందించి, ఆ తర్వాత వ్యవసాయ, ఆక్వా రంగాలకు పునరుద్ధరిస్తున్నట్లు చెప్పారు. శనివారం సాయంత్రానికి తుపాను ప్రభావిత ప్రాంతాలన్నింటికీ విద్యుత్ సరఫరా అందించేందుకు చర్యలు



తీసుకుంటున్నామన్నారు.

మూడు రాష్ట్రాల నుంచి 3 వేల మందికిపైగా సిబ్బంది

విద్యుత్ పునరుద్ధరణకు కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల నుంచి మూడు వేల మందికిపైగా సిబ్బంది వచ్చి సేవలందిస్తున్నారని మంత్రి తెలిపారు. సంతనూతలపాడు మండలం నిడమానూరులో పనిచేస్తున్న ఇతర రాష్ట్రాల సిబ్బందిని కలిసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అలవలపాడులో స్తంభాలను తిరిగి నిలబెట్టే పనుల్లో ఉన్న కర్ణాటకలోని బళ్లారి సిబ్బందితో, నిడమానూరు వద్ద పనిచేస్తున్న తమిళనాడు సిబ్బందితో మాట్లాడి పనుల పురోగతిని తెలుసుకున్నారు. పునరుద్ధరణ పనుల్లో ఉన్న సిబ్బందికి నాణ్యమైన భోజనం, వసతి కల్పించాలని అధికారులను ఆదేశించారు. పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చిన సిబ్బంది ఇబ్బందులు పడకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో మాట్లాడి సిబ్బందిని రప్పించారని తెలిపారు. విపత్కర సమయంలో సహకరించిన మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, విద్యుత్ శాఖ మంత్రులు, సిబ్బందికి ఆంధ్రప్రదేశ్ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

రెండు రోజుల్లో సమగ్ర నష్టం నివేదిక

అర్నబ్, మురసు తుపాన్ల వల్ల జరిగిన నష్టంపై ప్రాథమిక నివేదికను ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అందజేసినట్లు మంత్రి తెలిపారు. పంటలు, ఆస్తులు, విద్యుత్ వ్యవస్థతో పాటు ఇతర రంగాలకు జరిగిన నష్టంపై మరో రెండు రోజుల్లో సమగ్ర నివేదిక సమర్పిస్తామన్నారు. నష్టపోయిన ప్రతి రైతుకు, బాధిత కుటుంబానికి ప్రభుత్వ పరిహారం, సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఆత్మస్థైర్యంతో కోలుకుంటున్న గోపిక

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత
- త్వరలో స్కూల్ కూడా వెళతానంటున్న విద్యార్థిని
- మంత్రి నారా లోకేశ్ కు ధన్యవాదాలు తెలిపిన బాధితురాలు
- బాధిత కుటుంబానికి, విద్యార్థినికి అండగా కూటమి ప్రభుత్వం
- మహిళలు, బాలికల భద్రతకు సీఎం చంద్రబాబు అధిక ప్రాధాన్యం
- హంతకులకు అండగా జగన్
- రాప్తాడు నిందితుడికి న్యాయ సహకారం : మంత్రి సవిత మండిపాటు
- బెంగుళూరు మణిపాల్‌లో విద్యార్థినికి మంత్రి సవిత పరామర్శ

ప్రజాభూమి ప్రతినిధి,బెంగళూరు

విద్యార్థిని గోపిక కోలుకుంటోందని, మంత్రి నారా లోకేశ్ మంచి వైద్యమందిస్తున్నారని, తాను త్వరలో స్కూల్ కూడా వెళ్లతానని, పదో తరగతి పరీక్షలు కూడా రాస్తానని ఆమె ఎంతో ఆత్మ స్థైర్యంతో చెబుతోందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. మంత్రి నారా లోకేశ్ సొంత బిడ్డ మాదిరిగా గోపిక ఆరోగ్యంపై శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. నిందితుడు హేమంత్ ను కాపాడడానికి జగన్ ప్రయత్నిస్తున్నాడని, కూటమి ప్రభుత్వంపై బురదజల్లాలనే ఉద్దేశంతో,



ఆయనెప్పుడూ హంతకులను వెంటేసుకుంటా వస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలోమహిళలు, బాలికల భద్రతకు అధిక ప్రాధాన్యమిస్తున్నామన్నారు. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా, వేధించినా అదే వారికి చివరి రోజని హెచ్చరించారు. బెంగళూరులోని మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధిత బాలిక గోపికను మంత్రి సవిత శుక్రవారం పరామర్శించారు. అనంతరం తనను కలిసిన విలేకరులతో మాట్లాడారు. గురువారం బాలికకు నిర్వహించిన శస్త్రచికిత్స విజయవంతమైందని, ప్రస్తుతం గోపిక ఆరోగ్యం క్రమంగా మెరుగుపడుతోందని వైద్యులు తెలిపినట్లు మంత్రి వెల్లడించారు. దాడికి గురైన విషయం తెలిసిన వెంటనే విద్యార్థినిని అనంతపురం నుంచి బెంగళూరులోని మణిపాల్ ఆసుపత్రికి గ్రీన్ ఛానల్ ద్వారా వేగంగా తరలించి సకాలంలో వైద్యం అందించేలా చర్యలు తీసుకున్నామన్నారు. తనకు మెరుగైన వైద్యమందిస్తున్నారని, మంత్రి నారా లోకేశ్ కు విద్యార్థిని ధన్యవాదాలు తెలిపినట్లు మంత్రి సవిత సవిత వెల్లడించారు. తాను త్వరలో స్కూల్ కు వెళతానని, పదో తరగతి పరీక్షలు కూడా రాస్తానని విద్యార్థి గోపిక ఎంతో ఆత్మస్థైర్యంతో మాట్లాడుతోందని తెలిపారు. సబాధితురాలి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు ప్రభుత్వ అధికారులు , ఎన్టీఆర్ ట్రస్ట్ తరఫున డాక్టర్ గంగాధర్ రెడ్డి బాలిక వైద్య సేవలను నిరంతరం పర్యవేక్షిస్తున్నారని వెల్లడించారు. మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యే పరిటాల సునీతతో పాటు తమకు అండగా నిలిచి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ బాలిక కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారని మంత్రి సవిత వెల్లడించారు.

హంతకులకు జగన్ న్యాయ సహకారం

జగన్ రెడ్డి స్వార్థ రాజకీయాలు చేస్తూ, హంతులను వెంటేస్తుకొస్తున్నారని మంత్రి సవిత మండిపడ్డారు. డ్రైవర్ ను హత్య చేసిన ఎమ్మెల్సీ అనంతబాబును, మాజీ మంత్రి సిదిరి అప్పలరాజు తనయుడిని, రాప్తాడులో విద్యార్థినిపై రంపంతో దాడి చేసిన నిందితుడిని జగన్ అండగా నిలుస్తూ వస్తున్నారన్నారు. తన లీగల్ టీమ్ తో రాప్తాడు నిందితుడిని కాపాడడానికి హైకోర్టులో పిల్ వేశారన్నారు. ప్రజల మాన, ప్రాణాలకంటే జగన్ కు హంతకులే ముఖ్యమన్నారు. రాప్తాడు నిందితుడిని చట్టపరంగా కఠినంగా శిక్షిస్తామన్నారు. అరెస్టు చేయడానికి వెళ్లిన సమయంలోదాడి చేయడం వల్లే నిందితుడిపై పోలీసులు కాల్పులు జరపారన్నారు. రాష్ట్రంలో మహిళలు, బాలికల భద్రతకు అధిక ప్రాధాన్యమిస్తున్నామన్నారు. వారి పట్ల అసభ్యంగా ప్రవర్తించినా, వేధింపులకు పాల్పడినా అదే వారికి చివరి రోజని మంత్రి సవిత హెచ్చరించారు. మహిళలు, బాలికలపై ఎక్కడైనా దాడులు జరిగితే ప్రభుత్వం ఉపేక్షించబోదని మంత్రి సవిత స్పష్టం చేశారు. రాష్ట్రంలో గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోందని, యువత భవిష్యత్తును నాశనం చేసే గంజాయి ముఠాలపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని మంత్రి సవిత తెలిపారు.


విద్యార్థిని కుటుంబానికి భరోసా

అంతకుముందు ఆసుపత్రికి వెళ్లిన మంత్రి సవిత...విద్యార్థిని కుటుంబ సభ్యులు, వైద్యులతో మాట్లాడారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, మెరుగైన వైద్యమందించాలని సూచించారు. గోపిక త్వరగా పూర్తిగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బాలిక కుటుంబానికి ప్రభుత్వ పరంగా అండగా ఉంటామని మంత్రి సవిత భరోసా ఇచ్చారు. మంత్రి వెంట పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి : నిరంతర పర్యవేక్షణ చేపట్టాలి!

- శివన్నపేట గురుకులంలో జ్వరాల పరిస్థితిపై మంత్రి అచ్చెన్నాయుడు ఆరాలి
- విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలి.. అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలిలి
- జిల్లా కలెక్టర్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు మంత్రి ఆదేశంలి

ప్రజాభూమి ప్రతినిధి,శ్రీకాకుళం, మన్యం జిల్లా పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం మండలం శివన్నపేటలోని ఏపిటిడబ్ల్యూఆర్ఎస్, యుఆర్జేసీ గురుకుల వసతి పాఠశాలలో విద్యార్థులకు జ్వరాలు, జలుబు, దగ్గు లక్షణాలు కనిపించిన నేపథ్యంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అప్రమత్తమయ్యారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై జిల్లా కలెక్టర్ డా. ఎన్. ప్రభాకర రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి తాజా పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి విద్యార్థి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని అధికారులను ఆదేశించారు. జ్వర లక్షణాలతో బాధపడుతున్న విద్యార్థులకు తక్షణమే మెరుగైన వైద్య సేవలు అందించాలని, అవసరమైన మందులు, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. గురుకుల పాఠశాలలో ప్రత్యేక వైద్య శిబిరం కొనసాగించాలని, వైద్య నిపుణులతో విద్యార్థులకు ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. అనారోగ్యంతో ఉన్న విద్యార్థులను ప్రత్యేకంగా పర్యవేక్షిస్తూ, ఇతర విద్యార్థులకు ఇన్ఫెక్షన్లు వ్యాపించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తాగునీటి నాణ్యత, ఆహార పదార్థాల స్వచ్ఛత, వంటశాల పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జ్వరాల వ్యాప్తికి గల కారణాలను గుర్తించేందుకు అవసరమైన పరీక్షలు నిర్వహించి, నివేదికల ఆధారంగా తగిన చర్యలు చేపట్టాలన్నారు. శివన్నపేట గురుకులంలోనే కాకుండా జిల్లావ్యాప్తంగా అన్ని గురుకుల, సంక్షేమ వసతి పాఠశాలల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలని, ఎక్కడైనా జ్వర లక్షణాలు కనిపిస్తే వెంటనే స్పందించి వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు దిశానిర్దేశం చేశారు. విద్యార్థుల ఆరోగ్య భద్రత విషయంలో ఏమాత్రం అలసత్వం ప్రదర్శించరాదని, పరిస్థితి పూర్తిగా సాధారణ స్థితికి వచ్చే వరకు వైద్య బృందాలు నిరంతరం అందుబాటులో



ఉండాలని మంత్రి ఆదేశించారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు తల్లిదండ్రుల్లో ఆందోళన తొలగించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.